
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




బుధవారం | 29-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) :301 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య రా. 6.06 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ. 8.20 తదుపరి శ్రవణం వర్జ్యం: మ. 12.09-1.40, దుర్ముహూర్తం: మ. 12.05-12.50, అమృతఘడియలు: రా. 9.19-10.50, రాహుకాలం: మ. 12.00-1.30, సూర్యోదయం: 6.51, సూర్యాస్తమయం: 6.05 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● బుధవారం 29 జనవరి 2025

త్రిష కొత్త చరిత్ర

త్రి'షో'



గొంగడి త్రిష (110 నాటౌట్, 3/6)

తెలుగమ్మాయి రికార్డు శతకం

- యువ భారత్ ఘన విజయం
- 150 పరుగులతో స్కాట్లాండ్ చిత్తు
- సెమీస్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఢీ
- అండర్-19 టీ20 వరల్డ్‌కప్

కౌలాలంపూర్: తెలుగమ్మాయి గొంగడి త్రిష (59 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లతో 110 నాటౌట్, 3/6) సెంచరీ విజృంభణతో పాటు బౌలింగ్‌లోనూ సత్తా చాటడంతో.. అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో సూపర్ సిక్స్‌ను భారత జట్టు ఘన విజయంతో ముగించింది. ఈపాటికే సెమీస్ చేరిన డిఫెండింగ్ చాంప్ భారత్.. గ్రూప్-1లో మంగళవారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో 150 పరుగుల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తు చేసింది. తద్వారా టోర్నీలో వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసింది. టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో స్కాట్లాండ్ 14 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. పిప్పా కెల్లీ (12), ఎల్మా (12) టాప్ స్కోరర్లు. ఆయుషి శుక్లా 4.. త్రిష, వైష్ణవి శర్మ చెరో 3 వికెట్లు తీశారు. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన త్రిష 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. శుక్రవారం జరిగే తొలి సెమీస్‌లో ఇంగ్లండ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

బాదుడే.. బాదుడు: భద్రాద్రి కొత్తగూడెం అమ్మాయి త్రిష ఆరంభం నుంచే ఎడాపెడా షాట్లతో స్కాట్లాండ్ బౌలర్లను ఓ ఆటాడుకొంది. మరో ఓపెనర్ కమిలిని (51) కూడా త్రిషకు చక్కని సహకారం అందించడంతో స్కోరు బోర్డు కళ్లెంలేని గుర్రంలా పరుగెత్తింది. నాలుగో ఓవర్‌లో మూడు బౌండ్రీలు బాదిన త్రిష.. మ్యాచ్ ఆసాంతం అదే జోరును కొనసాగించింది. మరో ఎండ్‌లో ఉన్న కమిలిని కూడా ఎక్కువగా ఫోర్లతోనే స్కోరు బోర్డు నడిపింది. ఏడో ఓవర్‌లో మెక్‌కోల్ బౌలింగ్‌లో త్రిష ఏకంగా సిక్స్‌తో ఔరా అనిపించింది. టాప్ గేర్‌లో సాగిన త్రిష .. మరో మూడు బౌండ్రీలతో అర్ధ శతకం పూర్తి చేసుకొంది. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి భారత్ 104/0తో భారీ స్కోరు దిశగా సాగింది. పార్కర్ వేసిన 13వ ఓవర్‌లో త్రిష ఏకంగా మూడు సిక్స్‌లు బాదడం మ్యాచ్‌కే హైలైట్. ఇక, బౌండ్రీతో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న కమిలిని ఆ తర్వాతి బంతికే అవుటైంది. దీంతో తొలి వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సనిక చల్కే (29 నాటౌట్) కూడా త్రిషకు అండగా నిలిచింది. 18వ ఓవర్‌లో త్రిష శతకం పూర్తి చేసుకోగా.. చల్కే బౌండ్రీలతో టీమ్ స్కోరును 200 మార్క్ దాటించింది.

నెంబర్‌వన్‌గా..

ఈ ప్రపంచకప్‌లో సూపర్‌ఫామ్‌తో దూసుకెళ్తున్న 19 ఏళ్ల గొంగడి త్రిష మరోమారు సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంది. 53 బంతుల్లోనే శతకం అందుకున్న త్రిష.. టోర్నీ చరిత్రలోనే సెంచరీ నమోదు చేసిన తొలి క్రికెటర్‌గా అరుదైన చరిత్ర సృష్టించింది. ఈ క్రమంలో ఓవరాల్‌గా ఈ టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఇంగ్లండ్ బ్యాటర్ గ్రేస్ స్క్రివెన్స్ (93) రికార్డును త్రిష అధిగమించింది. అంతేకాదు.. ప్రస్తుత టోర్నీలో 230 రన్స్‌తో అత్యధిక పరుగులు సాధించిన క్రికెటర్‌గా టాప్‌లో కొనసాగుతోంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 208/1 (త్రిష 110 నాటౌట్, కమిలిని 51; మెక్లైరా 1/25).

స్కాట్లాండ్: 14 ఓవర్లలో 58 (కెల్లీ 12, ఎమ్మా 12; ఆయుషి 4/8, త్రిష 3/6).



'అత్యుత్తమ క్రికెటర్' బుమ్రా

దుబాయ్: ప్రతిష్ఠాత్మక ఐసీసీ 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును జస్‌ప్రీత్ బుమ్రా సొంతం చేసుకొన్నాడు. గతేడాది మూడు ఫార్మాట్లలోనూ 31 ఏళ్ల బుమ్రా ఆకట్టుకొన్నాడు. '2024లో అద్భుత ప్రదర్శనకుగాను పురుషుల విభాగంలో 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' కింద ఇచ్చే సర్ గ్యారీ ఫీల్డ్ సోబర్స్ అవార్డుకు బుమ్రా ఎంపిక య్యాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లోనే కాదు పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ అతడి ప్రదర్శన అమోఘం' అని ఐసీసీ కొనియాడింది. రాహుల్ ద్రవిడ్ (2004), సచిన్ టెండూల్కర్ (2010), అశ్విన్ (2016), విరాట్ కోహ్లీ (2017, 2018) తర్వాత ఈ అవార్డును అందుకొన్న ఐదో భారత ఆటగాడిగా బుమ్రా రికార్డులకెక్కాడు. టీమిండియా టీ20 వరల్డ్‌కప్ నెగ్గడంలోనూ జస్‌ప్రీత్ కీలకపాత్ర పోషించాడు. గతేడాది ఆడిన 13 టెస్టుల్లో 71 వికెట్లు పడగొట్టాడు. తనకు ఇంతటి గౌరవం దక్కడం ఎంతో ఆనందంగా ఉందని ఓ వీడియో సందేశంలో బుమ్రా పేర్కొన్నాడు. టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా కూడా బుమ్రా ఎంపికైన సంగతి తెలిసిందే.



'మహిళల క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా కెర్

ఐసీసీ 'ఉమెన్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమేలియా కెర్ ఎంపికైంది. ఇప్పటికే ఆమె మహిళల టీ20ల్లోనూ ఉత్తమ ప్లేయర్ అవార్డు దక్కించుకుంది. గతేడాది టీ20 వరల్డ్‌కప్‌లో కెర్ విశేషంగా రాణించి 387 పరుగులతో పాటు 29 వికెట్లు తీసింది. అలాగే ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఆల్‌రౌండ్ షో (43; 3/24)తో కివీస్‌కు తొలి టైటిల్ దక్కేలా చేయడంతో పాటు ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగానూ నిలిచింది.



సురేఖను ఖేల్‌రత్నకు పరిగణించండి

- కేంద్ర క్రీడా శాఖను ఆదేశించిన ఏపీ హైకోర్టు
- 2023 లేదా 2024 జాబితాలో ఆమె పేరు చేర్చాలని సూచన

అమరావతి (ఆంధ్రజ్యోతి): దేశ అత్యుత్తమ క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు విజయవాడ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ పేరును పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. ఖేల్‌రత్న అందుకునేందుకు తనకు అన్ని అర్హతలున్నా అవార్డుకు ఎంపికచేయలేదంటూ 2023లో సురేఖ హైకోర్టులో పిటిషన్ వేసింది. సుదీర్ఘ వాదనల అనంతరం దీనిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల తుది తీర్పును వెలువరించారు. తీర్పు ప్రతి మంగళవారం అందుబాటులోకి వచ్చింది. 2023, 2024 సంవత్సరాలకు ఖేల్‌రత్న అవార్డుకు ఇప్పటికే ఎంపికైన క్రీడాకారులతో పాటు జ్యోతి సురేఖ పేరును కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. 2023లో జరిగిన అవార్డుల ఎంపికను ఈ దశలో రద్దు చేయడం సరికాదు కనుక మరోసారి దరఖాస్తు సమర్పించాలని సురేఖను కోరకుండా పాత అర్జీనే పరిశీలించి ఆమె పేరును క్రీడా పురస్కారాల జాబితాలో చేర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అవార్డుల పాలసీలో పతకాలకు కేటాయించిన మార్కుల ప్రకారం సురేఖకు 148 పాయింట్లు (80 శాతం అర్హత) ఉండగా, ఆ ఏడాది అవార్డు పొందిన వారికి 58.5 పాయింట్లు (31.46 శాతం అర్హత) మాత్రమే ఉన్నట్లు తమ దృష్టికి రావడంతో సురేఖకు అన్యాయం జరగకుండా చూడాలని ఆదేశించింది. పాలసీలోని నిబంధనల ప్రకారం 80 శాతం పతకాల ఆధారంగా, 20 శాతం ఎంపిక కమిటీ విచక్షణాధికారం ప్రకారం మార్కులు ఇచ్చి అవార్డుకు ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఈ విచక్షణాధికారం దుర్వినియోగం కాకుండా కేంద్ర క్రీడాశాఖ మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించింది. ఈ వ్యాజ్యంలో పిటిషనర్ తరఫున న్యాయవాది ఉన్నం మురళీధరరావు, అఖిల్ చౌదరి వాదనలు వినిపించారు.

ఝులకిచ్చారు

మూడో టీ20లో భారత్ ఓటమి

- ఇంగ్లండ్ ఆశలు సజీవం
- వరుణ్‌కు ఐదు వికెట్లు



డకెట్ (28 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 51)

రాజ్‌కోట్: ఐదు టీ20ల సిరీస్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న టీమిండియాకు బ్రేక్ పడింది. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (5/24) బౌలింగ్‌లో వణికించినా.. బ్యాటింగ్‌లో వైఫల్యం దెబ్బతీసింది. అటు కచ్చితంగా గెలిచి తీరాల్సిన వేళ ఇంగ్లండ్ అదరగొట్టింది. మంగళవారం జరిగిన మూడో టీ20లో ఒత్తిడిని అధిగమిస్తూ.. బట్లర్ సేన 26 పరుగులతో గెలిచింది. సిరీస్‌లో 2-1తో నిలిచింది. ముందుగా ఇంగ్లండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులు చేసింది. డకెట్ (28 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 51), లివింగ్‌స్టోన్ (24 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్సర్లతో 43), బట్లర్ (24) రాణించారు. హార్దిక్‌కు 2 వికెట్లు లభించాయి. ఛేదనలో భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 145 పరుగులు చేసింది. హార్దిక్ (40), అభిషేక్ (24) ఫర్వాలేదనిపించారు. ఒవర్టన్‌కు మూడు.. కార్స్, ఆర్చర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా డకెట్ నిలిచాడు. అర్ష్‌దీప్‌నకు విశ్రాంతినిచ్చి ఈ మ్యాచ్‌లో పేసర్ షమిని బరిలోకి దింపారు. మూడో టీ20 పుణెలో 31న జరుగుతుంది.

బ్యాటర్ల ఇబ్బంది: ఓ మాదిరి ఛేదనే అయినా సిరీస్‌లో తొలిసారి భారత బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. హార్దిక్ పాండ్యా ఆదుకునే ప్రయత్నం చేసినా అతడి ఇన్నింగ్స్‌లో వేగం లోపించింది. శాంసన్ (3) మరోసారి షార్ట్ పిచ్ బంతికి వెనుదిరగ్గా.. మరో ఓపెనర్ అభిషేక్, సూర్య (14) ఉన్న కాసేపు వేగం కనబర్చారు. కానీ ఈ ముగ్గురు కూడా పవర్‌ప్లేలోనే వెనుదిరగడం ఛేదనపై ప్రభావం పడింది. భీకరఫామ్‌లో ఉన్న తిలక్ (18) నాలుగు మ్యాచ్‌ల అనంతరం అవుటయ్యాడు. స్పిన్నర్ రషీద్ 8వ ఓవర్‌లో తిలక్‌ను బౌల్డ్ చేశాడు. సుందర్ (6) కూడా విఫలమవగా హార్దిక్‌పై భారం పడింది. వరుసగా రెండు ఓవర్లలో అతడి అవుట్ కోసం రివ్యూకు వెళ్లిన ఇంగ్లండ్ విఫలమైంది. ఆరో వికెట్‌కు అక్షర్ (15)తో కలిసి హార్దిక్ 38 రన్స్ జోడించాడు. 12 బంతుల్లో 41 రన్స్ అవసరమవగా, హార్దిక్ లాంగాఫ్‌లో క్యాచ్ ఇవ్వడంతో భారత్‌కు ఆశలు లేకుండా పోయాయి.

ఆదుకున్న డకెట్, లివింగ్‌స్టోన్: వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఇంగ్లండ్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. ఆరంభంలో ఓపెనర్ డకెట్, చివర్లో లివింగ్‌స్టోన్ మెరుపు బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నారు. మరోవైపు వరుణ్ చక్రవర్తి మ్యాజిక్ బంతులకు సగం మంది బ్యాటర్లు వికెట్లను సమర్పించుకున్నారు. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ సాల్ట్ (5) వికెట్‌ను హార్దిక్ తీశాడు. ఈ దశలో బట్లర్ సాయంతో డకెట్ చెలరేగాడు. షమి ఓవర్‌లో సిక్సర్ బాదిన అతను హార్దిక్ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. అలాగే ఐదో ఓవర్‌లో 4,4,6తో 15 రన్స్ రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 52/1 స్కోరుతో నిలిచింది. అటు బట్లర్ ఏడో ఓవర్‌లో 4,6 బాదడంతో 200 స్కోరు ఖాయమనిపించినా, మధ్య ఓవర్లలో వరుణ్ రాకతో సీన్ మారిపోయింది. ముందుగా బట్లర్ వికెట్‌తో వరుణ్ షాకిచ్చాడు. అటు 26 బంతుల్లోనే డకెట్ హాఫ్ సెంచరీ పూర్తి చేసినా.. అక్షర్‌కు చిక్కాడు. 14వ ఓవర్‌లో స్మిత్ (6), ఒవర్టన్ (0)లను వరుస బంతుల్లో వరుణ్ పెవిలియన్‌కు చేర్చాడు. తన తర్వాతి ఓవర్‌లోనే కార్స్ (3), ఆర్చర్ (0)లను అవుట్ చేసి ఐదు వికెట్లను పూర్తి చేశాడు. 16 ఓవర్లలో 127/8 స్కోరుతో కష్టాల్లో ఉన్న జట్టును లివింగ్‌స్టోన్ ఆదుకున్నాడు. 17వ ఓవర్‌లో 3 సిక్సర్లతో 19 రన్స్ రాబట్టాడు. ఈ దశలో లివింగ్‌స్టోన్‌ను హార్దిక్ అవుట్ చేశాడు. కానీ చివరి రెండు ఓవర్లలో 20 రన్స్ రాబట్టడంతో ఇంగ్లండ్ స్కోరు 170 దాటగలిగింది.



1 తమ జట్టు ఓడిన రెండు సందర్భాల్లోనూ ఐదు వికెట్లు తీసిన తొలి టీ20 బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్: సాల్ట్ (సి) అభిషేక్ (బి) హార్దిక్ 5; డకెట్ (సి) అభిషేక్ (బి) అక్షర్ 51; బట్లర్ (సి) శాంసన్ (బి) వరుణ్ 24; బ్రూక్ (బి) బిష్ణోయ్ 8; లివింగ్‌స్టోన్ (సి) జురెల్ (బి) హార్దిక్ 43; స్మిత్ (సి) జురెల్ (బి) వరుణ్ 6; ఒవర్టన్ (బి) వరుణ్ 0; కార్స్ (సి) తిలక్ (బి) వరుణ్ 3; ఆర్చర్ (బి) వరుణ్ 0; రషీద్ (నాటౌట్) 10; ఉడ్ (నాటౌట్) 10; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 171/9; వికెట్ల పతనం:** 1-7, 2-83, 3-87, 4-108, 5-115, 6-115, 7-127, 8-127, 9-147; **బౌలింగ్:** షమి 3-0-25-0; హార్దిక్ 4-0-33-2; సుందర్ 1-0-15-0; వరుణ్ 4-0-24-5; బిష్ణోయ్ 4-0-46-1; అక్షర్ 3-0-19-1; అభిషేక్ 1-0-4-0.

భారత్: శాంసన్ (సి) రషీద్ (బి) ఆర్చర్ 3; అభిషేక్ (సి) ఆర్చర్ (బి) కార్స్ 24; సూర్యకుమార్ (సి) సాల్ట్ (బి) ఉడ్ 14; తిలక్ (బి) రషీద్ 18; హార్దిక్ (సి) బట్లర్ (బి) ఒవర్టన్ 40; సుందర్ (సి) బట్లర్ (బి) ఒవర్టన్ 6; అక్షర్ (సి) రషీద్ (బి) ఆర్చర్ 15; జురెల్ (సి) సాల్ట్ (బి) కార్స్ 2; షమి (సి) బ్రూక్ (బి) ఒవర్టన్ 7; బిష్ణోయ్ (నాటౌట్) 4; వరుణ్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 145/9. వికెట్ల పతనం:** 1-16, 2-31, 3-48, 4-68, 5-85, 6-123, 7-131, 8-140, 9-140. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-33-2; ఉడ్ 3-0-29-1; కార్స్ 4-0-28-2; లివింగ్‌స్టోన్ 1-0-11-0; రషీద్ 4-0-15-1; ఒవర్టన్ 4-0-24-3.

విమర్శలను తట్టుకోలేకే
గవాస్కర్‌పై రోహిత్ ఫిర్యాదు?





న్యూఢిల్లీ: ఇటీవలే ముగిసిన ఆస్ట్రేలియా టూర్‌లో రోహిత్ శర్మ బ్యాటింగ్‌తోపాటు కెప్టెన్సీలోనూ విఫలమయ్యాడు. ఈ నేపథ్యంలో సిరీస్‌లో రోహిత్ వ్యూహాలు, మైదానంలో అతడి తీరును మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ తూర్పారబట్టాడు. వ్యక్తిగత కారణాలతో పెర్త్‌లో తొలి టెస్ట్‌కు దూరమైన హిట్‌మ్యాన్.. సిడ్నీ మ్యాచ్‌లో ఆడలేదు. దీంతో జట్టు పగ్గాలను మరొకరికి అప్పగించాలని రోహిత్‌కు సన్నీ సూచించాడు. ఇలా తనను కించపరిచేలా విమర్శించడాన్ని జీర్ణించుకోలేక పోతున్న రోహిత్.. సన్నీపై చర్యలు తీసుకోవాలని బీసీసీఐకి ఫిర్యాదు చేసినట్టు ఓ అధికారి తెలిపాడు. 'గవాస్కర్ తనను అంతగా విమర్శించాల్సిన అవసరంలేదని రోహిత్ భావిస్తున్నాడు. ఇలాంటి వారి వ్యాఖ్యల కారణంగా తనపై ఒత్తిడి మరింతగా పెరిగిందని హిట్‌మ్యాన్ బోర్డుకు వివరణ ఇచ్చాడ'ని ఆ అధికారి చెప్పాడు. బీసీసీఐ కఠినంగా హెచ్చరించడంతో ఆసీస్ టూర్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత రోహిత్, జైస్వాల్, పంత్, గిల్ రంజీ మ్యాచ్ ఆడారు. కోహ్లీ, రాహుల్ మాత్రం వైద్య కారణాలతో విశ్రాంతి తీసుకొన్నారు. అయితే, ఆడిన ఆ ఒక్క రంజీ మ్యాచ్‌లో కూడా రోహిత్, జైస్వాల్ విఫలమయ్యారు. 'వారు మనసు పెట్టి ఆడలేదనిపిస్తోంది. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కాపాడుకోవడానికే రోహిత్, జైస్వాల్ తదితర టీమిండియా క్రికెటర్లు దేశవాళీ మ్యాచ్‌ల్లో ఆడారా?' అని సన్నీ అనుమానం వ్యక్తం చేశాడు. కోహ్లీ, రాహుల్ తనకు గాయాలైనట్టు చెప్పడంపైనా సందేహం వ్యక్తం చేశాడు. గాయపడితే వారు ఎన్‌సీఏకు ఎందుకు రిపోర్ట్ చేయలేదని ప్రశ్నించాడు. రంజీ చివరి లీగ్ మ్యాచ్‌లకు దూరమవుతామని ప్రకటించిన ఆటగాళ్లపై బోర్డు ఏవైనా చర్యలు తీసుకొంటుందా? అని అడిగాడు.

అర్జున్‌కు మరో డ్రా

విక్‌ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్‌లో తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి మరో గేమ్‌ను డ్రా చేసుకోగా.. పెంటేల హరికృష్ణకు ఓటమి ఎదురైంది. మంగళవారం వి ఇ (చైనా)తో జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌లో అర్జున్ పాయింట్ పంచుకొన్నాడు. కాగా, వ్లాదిమిర్ ఫెడోసివ్ (స్లొవేనియా) చేతిలో హరి పరాజయం పాలయ్యాడు. కాగా, సహచరుల మధ్య జరిగిన గేమ్‌లో లియోన్ లూక్ మెండోన్కాపై వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు విజయం సాధించాడు. చాలెంజర్స్ విభాగంలో దివ్య దేశ్‌ముఖ్, వైశాలి రమేష్ బాబు మధ్య జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్ డ్రాగా ముగిసింది.





దేశాభివృద్ధిలో క్రీడలది కీలక పాత్ర

- 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ప్రయత్నం
- ప్రధాని నరేంద్ర మోదీ
- ఘనంగా జాతీయ క్రీడల ప్రారంభోత్సవం

డెహ్రాడూన్: కిక్కిరిసిన రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో వేలాది మంది క్రీడాకారుల హర్షధ్వానాల మధ్య 38వ జాతీయ క్రీడలను ప్రధాని నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించారు. ఉత్తరాఖండ్ సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించిన కార్యక్రమాలు, లేజర్ షో అలరించాయి. మంగళవారం అంగరంగ వైభవంగా జరిగిన ఈ క్రీడల ఆరంభ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని క్రీడాకారులను ఉత్తేజపరుస్తూ ప్రసంగించారు. బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగమ్మ ఆశీస్సులతో ఇక్కడి జాతీయ క్రీడలు జరుగుతున్నాయని అన్నారు. 'గ్రీన్ థీమ్'తో నిర్వహిస్తున్న ఈ జాతీయ క్రీడల్లో క్రీడాకారులకు ఇచ్చే పతకాలను సైతం ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యర్థాలతో రూపొందించడాన్ని ప్రధాని అభినందించారు. దేశాభివృద్ధిలో క్రీడారంగానిది కీలక పాత్రని, 2036 ఒలింపిక్స్‌ను భారత్‌లో నిర్వహించేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. వరల్డ్ చెస్ చాంపియన్ గుకేష్, ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్ హంపి, ఖో-ఖో వరల్డ్‌కప్‌లు సాధించిన భారత జట్లను అభినందించారు. అంతకుముందు వివిధ రాష్ట్రాల జట్లు తమ క్రీడాకారుల బృందాలతో మార్చ్ ఫాస్ట్‌ను నిర్వహించాయి. ఆంధ్రప్రదేశ్ తరఫున ఉమామహేష్, తెలంగాణ తరఫున చికితరావు రాష్ట్ర ఒలింపిక్ సంఘాల జెండాలను చేతబూని తమ క్రీడా బృందాలను ముందుకు నడిపించారు.

తమిళనాడు, శ్రీలంకలోనూ కిడ్నీ దందా!

- తొలుత వైజాగ్‌లో.. దొరికిపోవటంతో మకాం హైదరాబాద్‌కు
- 3 ఆస్పత్రుల్లో అడ్డగోలుగా కిడ్నీ మార్పిళ్లు .. దర్యాప్తులో వెల్లడి
- మరో నలుగురు నిందితుల కోసం పోలీసుల గాలింపు

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో వెలుగు చూసిన కిడ్నీ మార్పిడి దందా ముఠా సభ్యులు.. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు, వైజాగ్, తమిళనాడు, శ్రీలంకల్లోనూ ట్రాన్స్‌ప్లాంటేషన్ రాకెట్ కొనసాగించినట్లు సమాచారం. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మొత్తం 14 మందితో కూడిన ముఠాలో ఇప్పటి వరకు 10మందిని అరెస్టు చేసిన పోలీసులు మరో నలుగురి కోసం గాలిస్తున్నారు. ముఠా ప్రధాన సూత్రధారి వైజాగ్‌కు చెందిన పవన్ అలియాస్ లియోన్ నేరచరిత్రపై దృష్టి పెట్టారు. ముఠాలో కీలకంగా వ్యవహరించిన డాక్టర్ రాజశేఖర్‌తో కలిసి పవన్.. విశాఖపట్నం పెందుర్తిలో అక్రమ కిడ్నీ మార్పిడి దందాకు తెరలేపినట్లు సమాచారం. అక్కడ 4 ఆపరేషన్లు నిర్వహించి పోలీసులకు దొరికిపోయినట్లు తెలిసింది. దాంతో పవన్ ముఠా తమ మకాం హైదరాబాద్‌కు మార్చింది. ఇక్కడ మూతపడుతున్న జననీ ఆసుపత్రిని.. ఆపరేషన్‌కు రూ.2.50 లక్షల చొప్పున ఇస్తామని చెప్పి తీసుకున్నారు. ఆ తర్వాత అరుణ, అలకనంద ఆసుపత్రులు కూడా దొరకటంతో పవన్ ముఠా అక్రమ ట్రాన్స్‌ప్లాంటేషన్ల దందాకు అడ్డు లేకుండాపోయింది. ఏడాదిన్నరలో 80కిపైగా అక్రమ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌లు నిర్వహించి దాదాపు రూ.48 కోట్లు కొల్లగొట్టినట్లు సమాచారం.

ఒకే ఆస్పత్రిలో పనిచేసిన పరిచయం

ముఠా సూత్రధారి పవన్ నెఫ్రాజలిస్టు అని పోలీసులు గుర్తించారు. కిడ్నీ మార్పిడి చేసే ప్రధాన డాక్టర్ రాజశేఖర్ పెరుమాళ్‌ది నెల్లూరు జిల్లా. 2022లో వీరిద్దరూ హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేసినప్పుడు స్నేహితులయ్యారు. ఆ తర్వాత పవన్ కిడ్నీ అక్రమ మార్పిడి దందాకు తెర తీయడంతో రాజశేఖర్ ముందుకొచ్చాడు. వీరిద్దరూ ఇంకొందర్ని కలుపుకొని 2023 నుంచి దందా కొనసాగించిట్లు విచారణలో తేలినట్లు సమాచారం.

8 గంటల్లో శవాన్ని మాయం చేశాడు

- తలపై బలంగా కొట్టి.. గొంతు నులిమి హత్య
- హెక్సా బ్లేడ్‌తో మృతదేహాన్ని ముక్కలుగా కోసి.. బకెట్‌లో హీటర్‌తో ఉడికించి ముద్దగా మార్చాడు
- మాంసపు ముద్దలను, ఎముకలను స్టవ్‌పై కాల్చి.. రోకలితో దంచి పొడి చేసి చెరువులో పారబోశాడు
- మీర్‌పేట హత్య కేసులో నిందితుడు గురుమూర్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- ఏ మాత్రం బాధ, పశ్చాత్తాపం లేని నిందితుడు



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, చిత్రంలో నిందితుడు గురుమూర్తి (ముసుగులోని వ్యక్తి)

హైదరాబాద్ సిటీ/కొత్తపేట/సరూర్‌నగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మీర్‌పేట మహిళ వెంకటమాధవి హత్య కేసును రాచకొండ పోలీసులు ఛేదించారు. ఆమెను భర్త గురుమూర్తే అతి కిరాతకంగా చంపి, ముక్కలు చేసి మృతదేహాన్ని మాయం చేసినట్లు తేల్చారు. సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలతో గురుమూర్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీ నగర్‌లోని రాచకొండ సీపీ క్యాంపు కార్యాలయంలో డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కాశిరెడ్డితో కలిసి సీపీ సుధీర్‌బాబు మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ కేసు వివరాలు వెల్లడించారు. అతి దారుణానికి ఒడిగట్టిన గురుమూర్తి ముఖంలో కించిత్ కూడా బాధ, పశ్చాత్తాపం కూడా లేవని సీపీ పేర్కొన్నారు. ఈ నెల 16న ఉదయం 8 గంటల సమయంలో గురుమూర్తి, వెంకటమాధవి మధ్య గొడవ జరిగింది. అప్పటికే కుటుంబ తగాదాలతో భార్యపై పగతో రగిలిపోతున్న గురుమూర్తి కోపోద్రిక్తుడై... ఆమె తలపై చేయితో బలంగా కొట్టి నెట్టేశాడు. దాంతో ఆమె తల గోడకు తగిలి స్పృహ తప్పిపడిపోయింది. తర్వాత ఆమెపై కూర్చొని గొంతు నులిమి చంపేశాడు. ఇద్దరు పిల్లలను అంతకుముందు రోజే బడంగ్‌పేటలోని తన సోదరి ఇంటి దగ్గర దింపి వచ్చారు. భార్య శవాన్ని ఆనవాళ్లు దొరక్కుండా మాయం చేయాలని గురుమూర్తి నిర్ణయించుకున్నాడు. మృతదేహాన్ని బాత్‌రూమ్ వద్దకు తీసుకెళ్లి హెక్సా బ్లేడుతో చేతులు, కాళ్లు, మొండెం, తల భాగాలను వేరు చేశాడు. వాటిని ముక్కలుగా కోసి బకెట్‌లో నీళ్లు పోసి పలు విడతలుగా హీటర్‌తో వేడి చేసి ముద్దగా మార్చాడు. ముద్దగా మారిన శరీర భాగాలను, ఎముకలను శుభకార్యాల్లో వాడే స్టవ్‌పై కాల్చాడు. బాగా నల్లగా కాలిన తర్వాత గునపం, రోకలిబండతో దంచి పొడి చేశాడు. ఆ పొడిని బకెట్‌లో వేసుకొని మీర్‌పేట పెద్ద చెరువులో పారేశాడు. ఉదయం 8 గంటలకు భార్యను చంపిన గురుమూర్తి రెండు గంటల పాటు మృతదేహాన్ని మాయం చేయడంపై కసరత్తు చేశాడు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు అంటే 8 గంటల పాటు ఒక్కడే శవాన్ని మాయం చేశాడు. కిందపడిన చిన్నచిన్న మాంసపు ముక్కలు, రక్తాన్ని బాత్‌రూంలో ఫ్లష్ ద్వారా డ్రైనేజీలోకి పంపాడు. అత్యంత అధునాతనమైన బ్లూరేస్ టెక్నాలజీతో గురుమూర్తి ఇంట్లో కంటికి కనిపించని మాంసపు ఆనవాళ్లను క్లూస్ టీమ్ గుర్తించింది. ఫోరెన్సిక్ ల్యాబొరేటరీలో పరీక్షల ద్వారా అవి వెంకటమాధవివేనని పోలీసులు నిర్ధారించారు.

రైతు భరోసా చిల్లర పంచాయితీనా?

రైతుల అప్పులు ముఖ్యమా?.. దావోస్ డప్పులు ముఖ్యమా?

మానసిక వైద్యుడికి చూపించుకో: సీఎంపై హరీశ్ విమర్శలు



హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా కోసం అన్నదాతలు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. రైతన్నల ఆరాటాన్ని చిల్లర పంచాయితీ అంటావా?.. రేవంత్ రెడ్డీ' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. 'గతంలో రైతుబంధును బిచ్చమన్నావ్.. ఇప్పుడు రైతు భరోసాను చిల్లర పంచాయతీ అంటున్నావ్.. మీ సెల్ఫ్ డబ్బాకు, వెకిలి సెటైర్లకు కాలం చెల్లింది. ఇప్పటికైనా కళ్లు తెరవాల'ని 'ఎక్స్' వేదికగా సీఎంకు సూచించారు. ప్రభుత్వం రైతు భరోసాను సంక్రాంతికి ఇస్తానన్న సంగతి తేలిపోయిందని, చబ్బీస్ (26) జనవరి చేదుమాత్రగా మారిందని, ఇప్పుడు మార్చి 31దాకా గడువు పెంచిందని విమర్శించారు. ఇదేమని జర్నలిస్టులు అడిగితే చిల్లర పంచాయితీ అని తక్కువ చేసి మాట్లాడుతున్నారన్నారు. సీఎంకు రైతుల అప్పులు ముఖ్యమా? దావోస్ డప్పులు ముఖ్యమా? అని ప్రశ్నించారు. 'నీ మాటలు ఎవరూ నమ్మడంలేదనే ఆందోళన నీలో పెరిగిపోయింది. నీకు 'అటెన్షన్ డిక్రీజింగ్ డిజార్డర్' మొదలైంది. మానసిక వైద్యుడిని సంప్రదించడం మంచిద'ని రేవంత్‌కు సూచించారు. 'మీ ప్రెస్ రిలీజులు, మీ మీడియా కవరేజులు, మీ ఈనో స్టోరీలు ఎవరూ నమ్మడం లేదని ప్రెస్‌మీట్ పెట్టావా?' అని ప్రశ్నించారు. పెట్టుబడుల కట్టుకథను నమ్మించేందుకు శతవిధాలా ప్రయత్నించి అట్టర్‌ఫ్లాప్ అయినట్లుగా సీఎం ప్రెస్‌మీట్ ఉందన్నారు. ఎప్పుడో అయిపోయిన దావోస్‌కు ఇప్పుడు ఈ దావత్ ఎందుకని ఎద్దేవా చేశారు. దావోస్‌లో జరిగే ఎంవోయూల అంశంలో ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క చెప్పింది నిజమా? తన మాటలు నిజమా? రేవంత్ రెడ్డి చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 301
బుధవారం | 29-1-2025
వెల (Price) : Rs. 6.50
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
వరంగల్

పిచ్చోడు.. తిక్కలోడు

'గుర్తింపు' రోగంతో బాధపడుతున్నడు.. వైద్యం చేయించుకుంటే రిలీఫ్ ఫండ్ ఇస్తా

- రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయని ఆ ఒక్కడికే బాధ
- ప్రజాధనం దోచుకెళ్లి విదేశాల్లో దాచిపెట్టిండు
- కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- 1.78 లక్షల కోట్ల ఒప్పందాలన్నీ అమలుచేస్తాం
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి ధీమా

ప్రకృతి వనంగా తెలంగాణ

- ఎకో టూరిజం ప్రోత్సాహానికి ప్రత్యేక పాలసీ
- టెంపుల్, హెల్త్ టూరిజంతో మరింత గుర్తింపు
- మరిన్ని పెట్టుబడులు, మరింత ఆదాయం: రేవంత్
- ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కు ప్రారంభం
- ఈ పార్కు హైదరాబాద్‌కు తలమానికం: చిరంజీవి
- తన సంపాదన అంతంతమాత్రమేనంటూ...
- మొక్కల కొనుగోలుపై మాట్లాడుతూ ఛలోక్తి

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఎలా ఇద్దాం?

- సరఫరా ఎలా చేయాలో అధ్యయనం చేయండి
- ఇసుక మాఫియాను అరికట్టే చర్యలు తీసుకోండి
- అధికారులతో ముఖ్యమంత్రి శ్వేత రెడ్డి
- నలుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు
- వారంలోపు నివేదిక సమర్పించాలని ఆదేశం

11


శంకర్‌పల్లిలో ఎక్స్‌పీరియం పార్క్ ప్రారంభ కార్యక్రమంలో రేవంత్, చిరంజీవి

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ పిచ్చోడు.. తిక్కలోడని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అసలు ఆయనకు శ్వేతపత్రం అంటే అర్థం తెలుసా? అని ప్రశ్నించారు. ఒప్పందాలు రహస్యంగా చేసుకుంటే, అప్రకటిత సమాచారం ఏమైనా ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలని అడుగుతారని గుర్తు చేశారు. దావో్‌స్‌లో తాము చేసుకున్న ఒప్పందాల వివరాలన్నీ ఇప్పటికే ప్రకటించామని, వాటిపై ఏమైనా అనుమానాలు ఉంటే నిజ నిర్ధారణ కమిటీ వేసుకుని, మీడియాను కూడా తీసుకొని వెళ్లి ఆయా కంపెనీలతో మాట్లాడాలని కేటీఆర్‌కు సూచించారు. ఏదో పదం బాగుంది కదా అని పదే పదే శ్వేత పత్రం అంటున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ గుర్తింపు సమస్యతో (అటెన్షన్ సీకింగ్ డిజార్డర్) బాధ పడుతున్నారని వ్యాఖ్యానించారు. సింగపూర్, దావోస్ పర్యటనల అనంతరం ఇటీవలే

మిగతా 11వ పేజీలో...

హైదరాబాద్ శివార్లలో
2 ఐటీ పార్కులు

- హైటెక్‌సిటీ తరహాలో ఏర్పాటు
- గత ఏడాది చేసుకున్న దావోస్ 18 ఒప్పందాల్లో 17 అమల్లో
- 10 పరిశ్రమలు 70% పూర్తయ్యాయి: శ్రీధర్‌బాబు

11



భూముల
విలువలకు రెక్కలు

100 నుంచి 400% పెంపు..! ఏప్రిల్ 1 నుంచి అమలు?

- ప్రాంతాలను బట్టి సవరణలు.. సగటున 60% వరకు పెంచే యోచన
- మార్కెట్ విలువల హేతుబద్ధీకరణతో అదనంగా 40% రాబడికి ప్రణాళిక

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల విలువలు పెరగనున్నాయి. బహిరంగ మార్కెట్‌కు, రిజిస్ట్రేషన్ శాఖ పుస్తక విలువలకు భారీ వ్యత్యాసం ఉంది. ఈ క్రమంలో భూములు, ఆస్తుల విలువలను హేతుబద్ధీకరించాలని సర్కారు నిర్ణయించింది. కొన్ని చోట్ల అవసరమైతే 100 నుంచి 400 శాతం వరకు పెంచాలని భావిస్తోంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పలు రకాల నివేదికలతో మార్కెట్ విలువల్లో హెచ్చుతగ్గులపై కసరత్తు చేసిన అధికారులు.. పలు సవరణ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కొత్త మార్కెట్ విలువలను ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. ఏటా భూముల విలువ పెంచాలని, అది కూడా శాస్త్రీయ పద్ధతిలో ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఆరేళ్ల తర్వాత భూముల విలువలు పెంచడానికి రంగం సిద్ధమైంది. ప్లాట్ల ధరలను ఆయా ప్రాంతాలను బట్టి 15-30 శాతం, స్థలాల విలువను ఒకటి నుంచి నాలుగు రెట్లు వరకు పెంచే అవకాశం ఉంది. భూముల విలువ అమాంతం పెంచితే రియల్‌ఎస్టేట్ రంగం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. దీంతో ఏ వర్గానికీ ఇబ్బంది లేకుండా శాస్త్రీయంగా మదింపు చేసి, విలువలు పెంచాలని సీఎం రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుతం

మిగతా 12వ పేజీలో...

11

రైతులకు సబ్సిడీతో
ట్రాక్టర్లు.. డ్రోన్లు

- మొత్తంగా 20 రకాల పరికరాలు
- పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం
- రూ.50 నుంచి 60 కోట్ల ఖర్చు
- ఒప్పందాలకు టెండర్ల ఆహ్వానం
- దాఖలుకు 7 వరకు అవకాశం



తెలుగమ్మాయి
తడాఖా

- అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్‌లో త్రిష అజేయ సెంచరీ
- ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్
- 3 వికెట్లతో భద్రాచలం యువతి ప్రతిభ
- స్కాట్లాండ్‌పై భారత్ ఘన విజయం



భారత్‌పై
సుంకాలు విధిస్తాం!

- చైనా సహా ఇతర దేశాలపై కూడా
- ఆయా దేశాలతో అగ్రరాజ్యానికి నష్టం
- అమెరికన్లకు ఆదాయ పన్ను రద్దు!
- రిపబ్లికన్ సదస్సులో అధ్యక్షుడు ట్రంప్
- ఆర్మీలో ట్రాన్స్‌జెండర్ల నియామకాలకు నో
- వైట్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ

2

'రైతుబంధు' రద్దుకు
సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర

ఎన్నికలప్పుడు మాత్రమే ఇస్తున్నారు

- స్థానిక ఎన్నికల తర్వాత పథకం రద్దు చేస్తారు
- రుణ మాఫీలో 25% కూడా పూర్తికాలేదు
- బోనస్ విషయంలోనూ మోసం చేశారు
- అన్నదాతలూ కాంగ్రెస్ పార్టీని నిలదీయండి
- 100% మాఫీ అయితే రాజకీయ సన్యాసం
- నల్లగొండ రైతు మహాధర్నాలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



రైతు మహాధర్నాలో మాట్లాడుతున్న కేటీఆర్

నల్లగొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధును రద్దు చేయాలని కుట్ర చేస్తున్నారు. అందుకే రైతుభరోసాను ఎన్నికలప్పుడు మాత్రమే ఇస్తూ రైతాంగాన్ని మోసం చేస్తున్నారు. స్థానిక ఎన్నికలయ్యాక రైతుబంధును రద్దు చేస్తారు" అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో మంగళవారం నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో రైతులు నాట్లు వేసే సమయంలోనే రైతు బంధు వచ్చేదని, కానీ రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఎన్నికలప్పుడు మాత్రమే రైతుబంధు ఇస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే 2023 యాసంగి కోసం రూ.7,600కోట్ల రైతుబంధు నిధులు ఇస్తుంటే, ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసి ఆపించిన రేవంత్‌రెడ్డి, ఆ డబ్బులనే పార్లమెంట్ ఎన్నికల ముందు విడుదల చేశారని విమర్శించారు. ఆ తర్వాత ఈ వానాకాలంలో రైతుబంధు

మిగతా 12వ పేజీలో...

DeepSeek-R1

చాట్‌జీపీటీకి
చైనా పోటీ!

సంచలనం సృష్టిస్తున్న 'డీప్‌సీక్' కృత్రిమ మేధ

- అతితక్కువ ఖర్చుతో అభివృద్ధి చేసిన చైనా ఐటీ ఇంజనీర్ లియాంగ్
- చాట్‌జీపీటీ, మెటా, జెమినై, క్లాడ్ వంటివాటికి దీటుగా పనితీరు
- ఓపెన్‌సోర్స్ విధానంలో.. ఉచితంగానే అందరికీ అందుబాటులోకి
- యాప్‌స్టోర్ డౌన్‌లోడ్స్‌లో చాట్‌జీపీటీని దాటి నంబర్ 1 స్థానానికి!
- చైనాను ఇబ్బంది పెట్టే ప్రశ్నలకు మాత్రం సమాధానమివ్వని వైనం
- 'డీప్‌సీక్' పనితీరును మెచ్చుకున్న ఓపెన్ ఏఐ చీఫ్ శామ్ ఆల్ట్‌మన్
- అమెరికన్ పారిశ్రామికవేత్తలు మేలుకోవాల్సిన సమయమిది: ట్రంప్
- డీప్‌సీక్ ప్రభావంతో 17 శాతం మేర పతనమైన ఎన్‌విడియా షేరు
- ఒక్కరోజే 20% ఆస్తిని కోల్పోయిన ఆ సంస్థ చీఫ్ జెన్సన్ హువాంగ్
- రూ.9.35 లక్షల కోట్ల మేర నష్టపోయిన టాప్-500 బిలియనీర్లు

2

అగ్గిపెట్టెల నుంచి ఐఫోన్ దాకా.. దేని నైనా చీప్ ఇమిటేషన్ తయారుచేస్తారని చైనావాళ్లకి మాచెడ్డ పేరుంది! కానీ, చైనీయులు తక్కువ ధరలోనే నాణ్యమైన ఉత్పత్తులు కూడా తయారుచేయగలరనే విషయం చాలా మందికి తెలియదు. అందుకు తాజా ఉదాహరణ.. డీప్‌సీక్ ఏఐ! చాట్‌జీపీటీ, మెటా ఏఐ, గూగుల్ జెమినై వంటి మోడళ్లనే గట్టిగా సవాల్‌చేస్తోందిది! ఏఐ అభివృద్ధికి దిగ్గజ సంస్థలు వందల కోట్ల డాలర్లు గుమ్మరిస్తుంటే.. చైనాలో 40 ఏళ్లు కూడా లేని ఒక వ్యక్తి తన హెడ్జ్ ఫండ్ వ్యాపారం కోసం దీన్ని అభివృద్ధి చేశాడు.

ప్రియుడితో ఉండగా చూసిన తండ్రి..

అవమానంతో ఇంటర్ విద్యార్థిని
బలవన్మరణం

- హనుమకొండ జిల్లా కేంద్రంలో ఘటన
- ఫెస్టివల్‌లో సీనియర్‌తో పరిచయం
- ఇటీవల స్వస్థలానికి వచ్చిన యువకుడు
- బాలికను కలిసేందుకు ఆమె ఇంటికి..
- గుర్తించిన పక్క నివాసంలో మేనమామ
- పట్టుబడడంతో యువకుడిపై దాడి!

12



..మరణం తర్వాత?

- ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు
- నాగ్‌పూర్‌లో 17 ఏళ్ల బాలిక ఆత్మహత్య
- ఆన్‌లైన్‌లో రాతి కత్తి కొనుగోలు
- మణికట్టుపై రెండు క్రాస్ మార్కులు సహా ఐదు తీవ్రమైన గాట్లు
- ఆపై గొంతు కోసుకొని బలవన్మరణం
- విదేశీ సంస్కృతులు, చావు గురించి కొన్నాళ్లుగా గూగుల్‌లో పరిశోధన
- బాలిక తండ్రి ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్..

2

మీ ఫోన్ ట్యాప్ అయింది..

- ఎవరెవరితో మాట్లాడారు?.. ఎవరిమీదనైనా అనుమానం ఉందా?
- 350 మందికి త్వరలో నోటీసులు.. వాంగ్మూలాలకు పోలీసుల కసరత్తు
- ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామం.. తిరుపతన్నకు బెయిల్‌తో అప్రమత్తం
- ముందస్తు బెయిల్ పిటిషన్ యోచనలో ప్రభాకర్‌రావు!



హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామం..! పలువురు ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, జర్నలిస్టులు, పారిశ్రామికవేత్తలతో పాటు త్రిపుర గవర్నర్ ఫోన్ కూడా ట్యాప్ అయిన వ్యవహారంలో పోలీసులు మరో అడుగు వేయబోతున్నారు. ఈ కేసులో వాంగ్మూలాల స్వీకరణకు దాదాపు 350 మంది బాధితులకు నోటీసులు జారీ చేయడానికి సన్నద్ధం అయ్యారు. వారినుంచి స్టేట్‌మెంట్ రికార్డుకు

మిగతా 9వ పేజీలో...


ఏసీబీకి పట్టుబడిన ఎస్సై సురేశ్, కానిస్టేబుల్ నాగరాజు

ఏసీబీ వలలో ఎస్సై, కానిస్టేబుల్

- రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసు..
- మిల్లు యజమానిని తప్పించేందుకు రూ.3 లక్షల డిమాండ్.. లక్షకు ఒప్పందం
- మళ్లీ డిమాండ్.. ఏసీబీ వద్దకు బాధితుడు
- సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఘటన

11

కోనేటి నీటిని..
మట్టి కుండల్లో తెచ్చి

మెస్రం వంశీయుల పూజలతో వైభవంగా నాగోబా మహాజాతర షురూ


ఆదిలాబాద్ జిల్లాలోని నాగోబా ఆలయానికి వస్తున్న మెస్రం వంశీయులు

12



దర్శనానికి వచ్చి
కత్తితో హల్‌చల్

- కొమురవెల్లిలో మహిళా అఘోరి వీరంగం
- ప్రధాన ద్వారం నుంచి దర్శనానికి పట్టుబట్టి
- కాదన్నారని అసహనం.. పలువురిపై దాడి
- ఓ వ్యక్తికి గాయాలు.. భక్తుల బెంబేలు
- పోలీసుల జోక్యంతో పరిస్థితి ప్రశాంతం

11

అంతా ఉచితమంటే పాలన ఎలా?



- కావేరి నీటిని ఉచితంగా ఇవ్వలేం
- జలమండలికి రుణాలు రావడం లేదు
- ఇప్పటికే ఏటా రూ.కోటి నష్టం వస్తోంది
- నీటి చార్జీలు పెంచక తప్పని పరిస్థితి
- కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్

2

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ



- సంగారెడ్డిలో జరిగిన మహాసభల్లో ఎన్నిక
- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా 14 మంది
- అనూహ్యంగా తెరమీదకు పాలమూరు వాసి
- తొలిసారిగా దళిత నేతకు దక్కిన అవకాశం
- వామపక్షాలను ఓట్లు, సీట్లతో పోల్చొద్దు: వెస్లీ

9

మాజీ ఎమ్మెల్యే కాటసాని

ఆక్రమణలపై హైడ్రా కొరడా

- అమీన్‌పూర్ పెద్దచెరువు భూమిలో నిర్మాణాల కూల్చివేత
- గతంలో కూల్చివేసిన చోటే మళ్లీ కబ్జాదారుల నిర్మాణాలు
- స్థానికుల ఫిర్యాదుతో కూల్చివేసిన హైడ్రా అధికారులు
- పద్మావతినగర్ రోడ్డు ఆక్రమణల తొలగింపు

3

17 రోజుల్లో 15 కోట్ల మంది

మహా కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు

నేడు మౌని అమావాస్య.. 10కోట్ల మంది వస్తారని అంచనా

మహాకుంభ్ నగర్, జనవరి 28: మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. ఈ నెల 13నుంచి ఇప్పటివరకు 17 రోజుల్లో 15 కోట్ల మందికి పైగా త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. బుధవారం మౌని అమావాస్యను పురస్కరించుకొని 10కోట్ల మందికి పైగా వస్తారని యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేసింది. ఈ పర్వదినం నాడు ఉదయం 6.45 గంటలకు హెలికాప్టర్ల నుంచి పూల వర్షం కురిపించాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 26 వరకూ కొనసాగే ఈ మహా కుంభమేళాలో 45కోట్ల మందికి పైగా తరలివస్తారని అంచనా. మరోవైపు, కుంభమేళాకు వచ్చేవారందరికీ అంతరాయం లేని కాల్స్‌తో పాటు మెరుగైన ఇంటర్నెట్ సేవలు అందించడానికి టెలికాం కంపెనీలు 92 కిలోమీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు వేశారు. 328 కొత్త టవర్లు ఏర్పాటు చేశారు.




అంతా ఉచితమంటే పాలన సాగేదెలా?

- కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్

బెంగళూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలు చేస్తున్న ఐదు ఉచిత గ్యారెంటీలతో కోట్లాది మందికి ప్రయోజనం కలుగుతోందని, ఇంకా ఉచితమంటే ప్రభుత్వాన్ని ఎలా నడపాలని కర్ణాటక డీసీఎం డీకే శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు పెంచాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇప్పటికే విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నామని, కావేరి నీటిని కూడా ఉచితంగా ఇవ్వమంటే ఎలా సాధ్యమని శివకుమార్ ప్రశ్నించారు. ఎంతోకొంత బిల్లు చెల్లించాలి కదా అన్నారు. జలమండలికి ఏటా రూ.వెయ్యి కోట్ల నష్టం వస్తోందని, నీటి చార్జీలు పెంచడం అనివార్యమని స్పష్టం చేశారు. నష్టాల్లో ఉన్న జలమండలికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించడం లేదని తెలిపారు.

లోకం తీరు



అక్రమ సంతానమైనా కూడా..

'ఆ తండ్రి'ని డీఎన్ఏ పరీక్షకు ఆదేశించలేం

- తన తండ్రి ఎవరో తేల్చాలన్న యువకుడి పిటిషన్‌పై సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 28: తాను ఫలానా వ్యక్తికి, తన తల్లికి పుట్టిన అక్రమ సంతానమని నమ్ముతున్నానని, అతను తన తండ్రో కాదో డీఎన్ఏ పరీక్ష ద్వారా తేల్చాలని ఒక యువకుడు పెట్టుకున్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇది మూడో వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత గోప్యత వ్యవహారమని, అతని అనుమతి లేకుండా డీఎన్ఏ పరీక్ష నిర్వహించడం కుదరదని స్పష్టం చేసింది. కేరళలోని కోచికి చెందిన మహిళ 1989లో వివాహం చేసుకుని, 1991లో ఒక కుమార్తెకు జన్మనిచ్చింది. 2001లో ఆమెకు కుమారుడు జన్మించాడు. 2003లో భర్తతో విడిపోయింది. 2006లో వారికి విడాకులు మంజూరయ్యాయి. వెంటనే ఆమె కోచి మున్సిపల్ అధికారులను కలిసి కుమారుడి పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంలో తండ్రి పేరు మార్చాలని కోరింది. భర్తతో ఉండగానే తాను వివాహేతర సంబంధంలో ఉన్నానని, ఆ సంబంధం వల్ల పుట్టిన సంతానమే ఈ అబ్బాయి అని చెప్పింది. 2007లో స్థానిక కోర్టు ఆ మూడో వ్యక్తికి, పిల్లాడికి డీఎన్ఏ పరీక్ష చేయాలని ఆదేశించింది. దీనిపై ఆ మూడో వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. పిల్లాడు కడుపులో పడిన సమయంలో భార్యాభర్తలు కలిసి లేరని నిరూపించగలిగితేనే మూడో వ్యక్తిని డీఎన్ఏ పరీక్ష చేసుకోవాలని ఆదేశించగలమని హైకోర్టు చెప్పింది. భార్యాభర్తలు కలిసి ఉంటే విడాకులు పొందిన 280 రోజుల్లోపు పుట్టిన పిల్లాడు కూడా ఆ తండ్రికి సక్రమ సంతానమే అవుతాడని సాక్ష్యాధారాల చట్టాన్ని ఉటంకిస్తూ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కుమారుడు మూడో వ్యక్తి నుంచి భృతి కోరుతూ 2015లో కుటుంబ న్యాయస్థానంలో పిటిషన్ వేశాడు. తనకు అనేక శస్త్ర చికిత్సలు అయ్యాయని, తన వైద్యం ఖర్చులు తల్లి భరించలేక పోతోందని పిటిషన్లో పేర్కొన్నాడు. తన వైద్య ఖర్చులకు, చదువుకు చట్టబద్ధమైన తండ్రి నుంచి కూడా ఎలాంటి సాయం అందడం లేదని ప్రస్తావించాడు. కుటుంబ న్యాయస్థానం తనయుడికి అనుకూలంగా తీర్పిచ్చింది. మూడో వ్యక్తి హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు కూడా భృతిని ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. దాంతో మూడో వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిల్లాడు కడుపులో పడిన సమయంలో సదరు మహిళతో.. భర్త, మూడో వ్యక్తి ఇద్దరూ కాంటాక్టులో ఉన్నారని భావించినా కుమారుడు మాజీ భర్తకు సక్రమ సంతానమే అవుతాడని సుప్రీం కోర్టు ఈ కేసులో స్పష్టం చేసింది.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 40 ఖాళీలు

హైదరాబాద్, జనవరి 28: వివిధ విభాగాల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూవోహెచ్) నోటిఫికేషన్ విడుదల చేసింది. గణితం, కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెడికల్ సైన్స్, ఫిలాసఫీ, ఉర్దూ, అప్లయిడ్ లింగ్విస్టిక్స్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, కమ్యూనికేషన్స్, డాన్స్, థియేటర్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్లలో మొత్తం 40ఖాళీలున్నాయి. ఫిబ్రవరి 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

భారత్‌పై సుంకాలు విధిస్తాం!

చైనా సహా ఇతర దేశాలపై కూడా.. డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన

- ఆయా దేశాలతో అగ్రరాజ్యానికి నష్టం జరుగుతోందన్న అమెరికా అధ్యక్షుడు
- అమెరికన్లకు ఆదాయపన్ను రద్దు!
- రిపబ్లికన్ సభ్యుల సదస్సులో వెల్లడి

వాషింగ్టన్, జనవరి 28: అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశాలపై సుంకాల బాంబు పేల్చారు. ముఖ్యంగా అగ్రరాజ్యంతో బలమైన వాణిజ్య బంధాన్ని కొనసాగిస్తున్న భారత్‌పై భారీ ఎత్తున సుంకాలు విధిస్తామని ప్రకటించారు. భారత్, చైనా, బ్రెజిల్ సహా ఇతర దేశాలపై భారీగా సుంకాలు విధించనున్నట్టు ట్రంప్ తెలిపారు. "ఆయా దేశాలు, పౌరులతో మనకు చాలా నష్టం జరుగుతోంది. అదేసమయంలో ఆ దేశాలు బాగుపడుతున్నాయి" అని వ్యాఖ్యానించారు. దేశంలోకి సంపద వచ్చేందుకు ఆయా దేశాలపై భారీగా సుంకాలు విధించాల్సిందేనని ఉద్ఘాటించారు. "ఇతర దేశాలు ఏం చేస్తున్నాయో చూడండి. చైనా సుంకాల రారాజు. ఈ జాబితాలోనే భారత్, బ్రెజిల్ సహా పలు దేశాలు ఉన్నాయి. ఈ విధానాన్ని ఇక మీదట కొనసాగకుండా చూడాలి. ఎందుకంటే అమెరికాను అన్ని విధాలా ముందు నిలపాలి. అమెరికా ఫస్ట్!" అని నొక్కి చెప్పారు. ఇక, అమెరికా ప్రజలపై ఆదాయ పన్ను భారాన్ని రద్దు చేయాల్సి ఉందని ట్రంప్ వ్యాఖ్యానించారు. "మన ప్రజలను ధనవంతులుగా, శక్తిమంతులుగా తీర్చిదిద్దే వ్యవస్థను పునరుద్ధరించాల్సిన సమయం ఇదే" అని అన్నారు. విదేశాలు, విదేశీ పౌరులపై సుంకాలు, పన్నులు వేయడం ద్వారా అమెరికా తనను తాను సుసంపన్నం చేసుకుంటుందని తెలిపారు. ఈ మేరకు ఫ్లోరిడాలో సోమవారం జరిగిన రిపబ్లికన్ సభ్యుల సదస్సులో ట్రంప్ ప్రకటించారు. "1913కు ముందు దేశంలో ఎలాంటి ఆదాయపన్ను లేదు. కేవలం సుంకాల వ్యవస్థే ఉంది. ఇదే అమెరికాను అత్యంత సుసంపన్న దేశంగా మార్చింది. 1913 నుంచే ఆదాయపన్ను ప్రవేశించింది" అని ట్రంప్ చెప్పారు. అమెరికాను సుసంపన్నం చేసేందుకు విదేశీ పౌరులపై పన్నులు విధిస్తామని పేర్కొన్నారు. "ఇతర దేశాలను సంపన్నం చేసేందుకు మన వారిపై పన్నులు విధించే బదులు.. మన వారిని సంపన్నం చేసేందుకు విదేశాలపై పన్నులు, సుంకాలు విధించాలి. ఇలా చేయడమే సరైంది కదా?!" అని వ్యాఖ్యానించారు. సుంకాలు, పన్నుల నుంచి మినహాయింపు కోరుకునే వారు ఇక్కడే ప్రాజెక్టులను పెట్టాలన్నారు.



ఫిబ్రవరిలో మోదీ వస్తున్నారు..

అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించిన భారత పౌరుల విషయంలో ఆ దేశం సరైన చర్యే తీసుకుంటుందని ఆశిస్తున్నట్టు అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. "అక్రమ వలసలపై భారత ప్రధాని మోదీతో చర్చించా. ఈ విషయంలో ఏది సరైన చర్యో భారత్ అలానే చేస్తుందని ఆశిస్తున్నా" అని వ్యాఖ్యానించారు. ఫిబ్రవరిలో మోదీ అమెరికాకు రానున్నట్టు చెప్పారు. ఆ నెలలో ఎప్పుడైనా ఆయన రావొచ్చని తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు బ్రేక్

అమెరికా సైనిక దళాల్లో ట్రాన్స్‌జెండర్లను నియమించే విధానానికి ట్రంప్ చెక్ పెట్టారు. తన ఎగ్జిక్యూటివ్ అధికారాలను ఉపయోగించి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. "ట్రాన్స్‌జెండర్లను సైనిక దళాల్లో నియమించడం ద్వారా గౌరవ ప్రదమైన, నిజాయితీ, క్రమశిక్షణతో కూడిన సైనికుల నిబద్ధతకు విఘాతం కలుగుతుంది" అని ట్రంప్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐరన్ డోమ్ క్షిపణి వ్యవస్థను నిర్మించనున్నట్టు ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా విదేశాలకు చేసే అన్ని రకాల సహాయాలను నిలిపివేస్తూ మరో ఉత్తర్వు ఇచ్చారు. అయితే, ఇజ్రాయెల్, ఈజిప్టులను వీటి నుంచి మినహాయించారు.

భారత్ అప్రమత్తం

భారత్ సహా ఇతర దేశాలపై భారీగా సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన నేపథ్యంలో మోదీ ప్రభుత్వం అప్రమత్తమైంది. అమెరికా వాణిజ్య విధానంలో మార్పులు వస్తే ఏం చేయాలన్న దానిపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ అంతర్గత సమావేశాలు నిర్వహించింది. ట్రంప్ ప్రకటనతో భారత ఎగుమతులపై ప్రభావం పడనుందని నిపుణులు తెలిపారు. కాగా, భారత్‌కు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 120 బిలియన్ డాలర్లకు చేరింది. ఇదిలా ఉండగా, అక్రమ వలసదారులు వస్తే భారత్ అనుమతించాలంటూ కాంగ్రెస్ పార్టీ ఇండియన్ ఓవర్‌సీస్ చైర్మన్ శ్యామ్ పిట్రోడా తాజాగా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు.

మరణం తర్వాత ఏం జరుగుతుంది?

- తెలుసుకునేందుకు మహారాష్ట్రలో 17 ఏళ్ల బాలిక ఆత్మహత్య

నాగపూర్, జనవరి 28: "మరణం తర్వాత ఏం జరుగుతుంది?" అని తెలుసుకునేందుకు ఓ 17 ఏళ్ల బాలిక ఆత్మహత్య చేసుకుంది. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఈ ఘటన జరిగింది. ఆ బాలిక ఓ ప్రైవేటు స్కూల్లో 12వ తరగతి చదువుతోంది. తండ్రి ఆర్బీఐలో ఉన్నతోద్యోగి.. రీజినల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. బాలిక తల్లి గృహిణి. ఈ కుటుంబం నాగపూర్‌లోని ఛత్రపతి నగర్‌లో ఉంటోంది. మృతురాలు ఆ తల్లిదండ్రులకు ఏకైక సంతానం కావడం గమనార్హం. పోలీసులు వెల్లడించిన వివరాలు, బాలిక ఫోన్లో లభ్యమైన సమాచారం ప్రకారం.. కొన్నాళ్లుగా బాలిక ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారింది. గూగుల్‌లో చావు గురించి, విదేశీ సంస్కృతుల గురించీ అదేపనిగా సెర్చ్ చేస్తోంది. ప్రత్యేకించి ఐరోపా ప్రజల సంస్కృతిపై ఆసక్తి ఎక్కువగా ఉన్న ఆమె, తన డైరీలో విదేశీ సంస్కృతుల గురించి సవివరంగా రాసుకుంది. చావు తర్వాత ఏం జరుగుతుందనేదానిపై వెతుకుతూ.. కొన్ని వారాలుగా ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలతో గడుపుతోంది. సోమవారం తెల్లవారుజామున 5:45 గంటలకు బాలిక పడకగదిలోకి ఆమె తల్లి వెళ్లిచూసేసరికి రక్తపు మడుగులో ఆమె మృతదేహం కనిపించింది. తల్లిదండ్రులు ఈ ఘటనపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారొచ్చి బాలిక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బాలిక.. కత్తితో తన మణికట్టు మీద రెండు క్రాస్ మార్కులతో సహా ఐదు గాట్లు పెట్టుకుంది. చివరికి గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు ఆమె కర్రపిడితో కూడిన రాతితో తయారుచేసిన కత్తిని వాడింది. ఈ తరహా కత్తులు స్థానికంగా లేకపోవడంతో ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి కొన్నట్లు సమాచారం.

చాట్‌జీపీటీకి చైనా పోటీ!

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'డీప్‌సీక్' కృత్రిమ మేధ

(సెంట్రల్ డెస్క్)

ప్రపంచమంతా వాషింగ్టన్‌డీసీలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవీ బాధ్యతలు స్వీకరించే వేడుకలపై దృష్టిసారించిన వేళ.. అదే రోజు (జనవరి 20న) శ్వేతసౌధానికి 12 వేల కిలోమీటర్లకు ఆవల.. చైనాలోని హాంగ్జౌ నగరంలో 'డీప్‌సీక్' అనే కృత్రిమ మేధ (ఏఐ) సంస్థ తన ఏఐ మోడల్ 'ఆర్1'ను ఆవిష్కరించింది! ఆ తర్వాత వారంరోజుల్లోనే అది ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయిపోయింది! చాట్ జీపీటీ, మెటా, జెమినై వంటి ప్రముఖ ఏఐ మోడళ్లకే సవాల్ విసిరే స్థాయిలో ప్రజాదరణ పొందింది. యాపిల్ యాప్‌స్టోర్‌లో చాట్‌జీపీటీని దాటేసి.. 'అత్యధికులు డౌన్‌లోడ్ చేసుకున్న ఉచిత యాప్'గా అగ్రస్థానంలో నిలిచింది. ఆ కథేంటో తెలియాలంటే.. ముందు ఈ 'డీప్‌సీక్'ను అభివృద్ధి చేసిన లియాంగ్ వెన్‌ఫెంగ్ (40) కథ తెలియాలి. దక్షిణ చైనాలోని గువాంగ్‌డాంగ్‌లో జన్మించిన లియాంగ్.. ఐటీ ఇంజనీరింగ్‌లో బాచిలర్స్ డిగ్రీ (2007), ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేశాడు. 2015లో అతడు హై ఫ్లయర్ అనే హెడ్జ్ ఫండ్ కంపెనీని ప్రారంభించాడు. అది కంప్యూటర్ ఆధారిత స్టాక్ ట్రేడింగ్ కంపెనీ. దానికి అవసరమైన వ్యూహాలు రూపొందించేందుకు లియాంగ్ కృత్రిమ మేధపై దృష్టి సారించాడు. ఏఐ రూపకల్పనకు అత్యంత శక్తిమంతమైన చిప్‌లు కావాలి కాబట్టి.. 2021లో పదివేలకు పైగా ఎన్‌విడియా హెచ్800 చిప్‌లను కొనుగోలు చేశాడు. ఆ సమయంలో లియాంగ్ చుట్టూ ఉన్నవాళ్లంతా అతణ్నో పిచ్చివాడి కింద జమకట్టారు. కానీ.. తాను చేయబోతున్నదేంటో లియాంగ్‌కు తెలుసు. అందుకే.. 'ఇది గేమ్ చేంజర్ కాబోతోంది' అని మాత్రమే వారికి చెప్పిన లియాంగ్ 2023 మే నెలలో డీప్‌సీక్ సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత ఏడాదిన్నరలోపే.. డీప్‌సీక్ కోడర్, లాంగ్వేజ్ లెర్నింగ్ మోడల్, డీప్‌సీక్-వీ2, డీప్‌సీక్ కోడర్-వీ2 ఇలా పలు మోడళ్లను అభివృద్ధి చేశాడు. 2025 జనవరి 10న డీప్‌సీక్ వీ3ని విడుదల చేశాడు. దానికి కొనసాగింపుగా.. తర్కంతో కూడిన క్లిష్టమైన ప్రశ్నలకు కూడా సమాధానాలు చెప్పే డీప్‌సీక్ ఏఐ మోడల్ ఆర్1ను జనవరి 20న ఆవిష్కరించాడు.

ఖర్చు తక్కువ.. సామర్థ్యంలో మేటి..

ఓపెన్ ఏఐ సంస్థ చాట్‌జీపీటీని అభివృద్ధి చేయడానికి 10 కోట్ల డాలర్ల దాకా (దాదాపు రూ.865 కోట్లు) ఖర్చయితే.. లియాంగ్‌కు డీప్‌సీక్‌ను అభివృద్ధి చేయడానికి జస్ట్ 60 లక్షల డాలర్లు (దాదాపు రూ.52 కోట్లు) అయ్యిందంతే!! కంప్యూటింగ్ సామర్థ్యాన్ని కూడా డీప్‌సీక్ చాలా తక్కువగా వాడుకుంటుంది. ఉదాహరణకు.. ఓపెన్‌ఏఐ, మెటా వంటివి 16వేలు అంతకంటే ఎక్కువ అధునాతన చిప్‌లతో కూడిన సూపర్‌కంప్యూటర్ల ద్వారా ఏఐ చాట్‌బాట్లకు శిక్షణ ఇస్తుంటే.. డీప్‌సీక్ కేవలం 2000 పాత చిప్‌లతో అంతే సమర్థంగా శిక్షణ ఇస్తోంది. కానీ.. పనితీరులో మాత్రం అది వివగతా ఏఐలతో సమానంగా ఉందని వినియోగదారులు ప్రశంసిస్తున్నారు. లాజికల్ రీజనింగ్ టెస్ట్ స్కోర్ ఫలితాల్లో డీప్‌సీక్.. చాట్‌జీపీటీని, క్లాడ్ ఏఐని 7 నుంచి 14% తేడాతో అధిగమించినట్టు చెబుతున్నారు. క్లిష్టమైన సమస్యల పరిష్కారంలో చాట్‌జీపీటీతో (78%) పోలిస్తే డీప్‌సీక్ (92%) బాగా పనిచేస్తున్నట్టు తెలిపారు.

ఖర్చు తగ్గించండి..

డీప్‌సీక్ జోరుపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఈ పరిణామాన్ని అమెరికన్ పరిశ్రమలకు మేలుకొలుపుగా భావించాలని హెచ్చరించారు. కృత్రిమ మేధ పోటీలో గెలుపుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఏఐ మోడళ్ల అభివృద్ధికి వందల కోట్ల డాలర్లు ఖర్చుచేయడం మాని తక్కువ ఖర్చుతో ఇవే సామర్థ్యాలను సాధించాలని సూచించారు. ఇక.. డీప్‌సీక్ అభివృద్ధి చేసిన ఆర్1 మోడల్ పనితీరు ఆకట్టుకునేలా ఉందని.. ఓపెన్‌ఏఐ చీఫ్ శామ్ ఆల్ట్‌మన్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ఈ రంగంలో కొత్తపోటీదారును కలిగి ఉండడం ఉత్సాహాన్నిస్తోందని ఆయన పేర్కొన్నారు.



చైనా ప్రధాని లీచాంగ్‌తో డీప్‌సీక్ ఏఐ సృష్టికర్త లియాంగ్ (కుడివైపు)

టెక్ దిగ్గజాల షేర్లు ఢమాల్..

ఒపెన్ ఏఐ, మెటా, గూగుల్ వంటి సంస్థలు వందల కోట్ల డాలర్లు ఖర్చు పెట్టి.. అత్యంత అధునాతన చిప్‌లు ఉపయోగించి తమ తమ కృత్రిమ మేధ మోడళ్లను అభివృద్ధి చేసినట్టు చెప్పుకొంటుంటే.. ఎప్పుడో నాలుగేళ్ల నాటి ఎన్‌విడియా చిప్‌లతో వాటికి పోటీనిచ్చే ఏఐ మోడల్‌ను చైనా కంపెనీ తయారుచేసిందన్న వార్త దావానలంలా వ్యాపించడంతో ఆయా కంపెనీల షేర్లు పతనమవడం ప్రారంభించాయి. ఎన్‌విడియా కంపెనీ షేరు ధర ఏకంగా 17 శాతం క్షీణించింది.. దీంతో ఒక్కరోజే ఆ సంస్థ దాదాపు రూ.52 లక్షల కోట్ల మేర మార్కెట్ విలువను కోల్పోయింది. ఆ కంపెనీ సహవ్యవస్థాపకుడు జెన్సన్ హువాంగ్ ఆస్తుల నికర విలువ రూ.1.74 లక్షల కోట్ల మేర తరిగిపోయింది. ఇది ఆయన మొత్తం ఆస్తిలో 20 శాతానికి సమానం. డీప్‌సీక్ దెబ్బకు నాస్‌డాక్ సూచీ 3.1 శాతం, ఎస్ అండ్ పీ ఇండెక్స్ 1.5% నష్టపోవడంతో టాప్-500 బిలియనీర్లు దాదాపు రూ.9.35 లక్షల కోట్లు నష్టపోయారు.

అది మాత్రం అడక్కు!

ప్రపంచంలో ఏ విషయం గురించి అడిగినా ఠక్కున చెప్పే డీప్‌సీక్ ఏఐ.. చైనాకు సంబంధించిన, ఆ దేశాన్ని ఇబ్బంది పెట్టే అంశాల గురించి అడిగితే మాత్రం... 'ఆ ఒక్కటి అడక్కు' అన్నట్టుగా ముడుచుకుపోతుంది. ఆ ప్రశ్నకు తనకు సమాధానం తెలియదంటుంది. ఉదాహరణకు.. అరుణాచల్ ప్రదేశ్ గురించి ఒక భారతీయుడు డీప్‌సీక్‌ను అడిగితే.. 'క్షమించండి. అది నా పరిధిలో లేని అంశం. మనం మరే ఇతర అంశం గురించైనా మాట్లాడుకుందాం' అని సమాధానం ఇచ్చింది. 'జిన్‌పింగ్ ఒక నియంతా?' అనే ప్రశ్నకు, 'తైవాన్ దేశం గురించి చెప్పు' అనే ప్రశ్నకు కూడా.. డీప్‌సీక్ అదే సమాధానం ఇవ్వడం గమనార్హం.

ఉచితంగా..

ఓపెన్‌ఏఐ, మెటా, గూగుల్ జెమినై, క్లాడ్ ఏఐ వంటివాటిని కొంతమేర మాత్రమే ఉచితంగా వాడుకోగలం. ఆధునిక వెర్షన్లు, ఫీచర్లు వాడుకోవాలంటే డబ్బు చెల్లించాల్సిందే. కానీ, డీప్‌సీక్ సంస్థ తన కృత్రిమమేధ మోడల్‌ను ఓపెన్‌సోర్స్ విధానంలో అందరికీ అందుబాటులోకి తెచ్చింది. అంటే.. వినియోగదారులు ఉచితంగా వాడుకోవడమే కాదు.. వ్యాపారసంస్థలు, పరిశోధకులు డీప్‌సీక్ కోడ్‌ను తమ అవసరాలకు అనుగుణంగా మార్చుకునే వీలు ఉంటుందన్నమాట. అయితే.. అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ డేటాకు మాత్రం డీప్‌సీక్ సంస్థ కొంత మొత్తాన్ని వసూలు చేస్తోంది. అదీ ఇతర ఏఐలతో పోలిస్తే చాలా తక్కువ. కాగా.. డీప్‌సీక్ యాప్ డౌన్‌లోడ్‌కు కోట్లాది మంది ప్రయత్నిస్తుండడంతో సర్వర్లు స్తంభించిపోతున్నాయి.

షరియా వద్దు... లౌకిక చట్టం కావాలి

ముస్లిం చట్టం ప్రకారమైతే మహిళకు వారసత్వ ఆస్తిలో మూడో వంతుపైనే హక్కు

- వారసత్వ చట్టమైతే మొత్తం పొందొచ్చు
- 'మత విశ్వాసం' లేకపోవడాన్ని కూడా హక్కుగా గుర్తించాలి
- సుప్రీంలో ముస్లిం మహిళ పిటిషన్

న్యూఢిల్లీ, జనవరి 28: ముస్లిం పర్సనల్ లా విషయమై సుప్రీంకోర్టులో ఆసక్తికరమైన కేసు నమోదయింది. తనకు షరియా చట్టం కాకుండా, భారతీయ వారసత్వ చట్టాన్ని వర్తింపజేయాలని కోరుతూ ఓ ముస్లిం మహిళ పిటిషన్ దాఖలు చేశారు. తాను ముస్లిం అయినప్పటికీ షరియా చట్టంపై విశ్వాసం లేనందున లౌకికవాద చట్టాన్ని వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కేరళలోని అళప్పుజకు చెందిన 'కేరళ మాజీ ముస్లింలు' (ఎక్స్ ముస్లిం ఆఫ్ కేరళ) సంస్థ ప్రధాన కార్యదర్శి సఫియా పి.ఎం. ఈ పిటిషన్ వేశారు. మంగళవారం దీనిపై ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. తాను అధికారికంగా ఇస్లాంను విడిచిపెట్టలేదని, కానీ విశ్వాసం లేదని సఫియా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. 'విశ్వాసం లేకపోవడాన్ని' కూడా మత స్వేచ్ఛగా గుర్తించాలని కోరారు. ముస్లిం పర్సనల్ లా అంటే ఇష్టం లేని వారికి భారతీయ వారసత్వ చట్టం-1925 వర్తించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. షరియా చట్టం ప్రకారం తండ్రి ఆస్తిలో కేవలం మూడో వంతు మాత్రమే మహిళలకు వస్తుందని తెలిపారు. అదే వారసత్వ చట్టం ప్రకారమయితే తన తండ్రి ఇంకా ఎక్కువ వాటా ఇచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. షరియా చట్టం ప్రకారం ముస్లిం మతం నుంచి బయటకు వస్తే తండ్రి ఆస్తిలో ఎలాంటి వాటా కూడా రాదని తెలిపారు. ఒకవేళ తాను అధికారికంగా ముస్లిం మతం నుంచి బయటకు వస్తే తన ఏకైక కుమార్తెకు ఎలాంటి ఆస్తి దక్కదని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితి వస్తే ఏమి చేయాలన్నదానిపై చట్టంలో నిబంధనలు లేవని కోర్టు దృష్టికి తెచ్చారు. తనకు ఎలాంటి మతం, కులం లేదంటూ అధికారిక ధ్రువపత్రాలు తీసుకొచ్చినప్పటికీ తన కుమార్తెకు ఆస్తి సంక్రమించే అవకాశంలేదని తెలిపారు. దాంతో భారతీయ వారసత్వ చట్టంలో ముస్లింలకు మినహాయింపులు ఇస్తూ ఉన్న నిబంధనల చెల్లుబాటును సవాలు చేయాల్సిన పరిస్థితి ఎదురయింది. ఆ మేరకు పిటిషన్‌ను సవరించి సమర్పించేందుకు సఫియాకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. కేంద్రం తరపున కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. మే 5తో ప్రారంభమయ్యే వారంలో తదుపరి విచారణ జరుపుతామని తెలిపింది.



విడాకులు.. మళ్లీ పెళ్లి

ఆస్తి చేజారకుండా ముస్లిం జంట ఉపాయం

షరియా చట్టాలను తప్పించుకునేందుకు ఓ ముస్లిం జంట తొలుత విడాకులు తీసుకొని, మళ్లీ వారే వివాహం చేసుకోవడం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా జరిగింది. తమ కుమార్తెలకు ఆర్థిక భద్రత కల్పించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని వారు చెబుతున్నారు. న్యాయవాది, నటుడు సి.షుక్కూర్, మహాత్మా గాంధీ యూనివర్సిటీ మాజీ ప్రొ చాన్సలర్ షీనాకు 29 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ముగ్గురూ ఆడపిల్లలే. మగ సంతానం లేదు. షరియా చట్టం ప్రకారం కేవలం ఆడ సంతానమే ఉంటే తల్లిదండ్రుల ఆస్తి మొత్తం వారికి చెందదు. కొంత తండ్రి తమ్ముడి పిల్లలకు ఇవ్వాల్సి వస్తుంది. ప్రస్తుత కేసులో ఆ ముగ్గురు కుమార్తెలకు మూడింట రెండొంతుల ఆస్తి మాత్రమే దక్కుతుంది. ఇది ఇష్టంలేని ఆ జంట తొలుత ఇస్లామిక్ చట్టాల ప్రకారం విడాకులు తీసుకున్నారు. మళ్లీ బుధవారం అన్ని మతాల వారికి వర్తించే ప్రత్యేక వివాహ చట్టం కింద కాసర్‌గోడ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పునర్వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లికి ముగ్గురు కుమార్తెలు కూడా హాజరయ్యారు. ఆ చట్టం ప్రకారం మొత్తం ఆస్తిని ముగ్గురు కుమార్తెలకు పంచిపెట్టే అవకాశం కలిగింది. ఇది అనైతిక చర్య అని ఫత్వా మండలి ఖండించింది. సంపద మొత్తం అల్లాకే చెందుతుందని, ఇస్లాం నిబంధనలను కాదని ఇలా చేయడం తగదని పేర్కొంది.

జైలు రిజిస్టర్‌లో కులం పేరును ఇంకా ఎందుకు తొలగించలేదు

- కేంద్రం, 11రాష్ట్రాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జైళ్ల మాన్యువల్‌లను మార్చాలని తాము ఇచ్చిన ఆదేశాల అమలుపై కేంద్రంతోపాటు ఆంధ్రప్రదేశ్ సహా 11 రాష్ట్రాలు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలిచ్చినప్పటికీ అలసత్వం వహించడంపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని జైళ్ల మాన్యువల్‌లు కుల వివక్షను ప్రోత్సహించేలా ఉన్నాయంటూ సుకన్య శాంత గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో బ్రిటిష్ కాలం నాటి జైళ్ల మాన్యువల్స్‌లో మార్పులు చేయాలని, జైలు రిజిస్టర్‌లో కులాన్ని తెలిపే కాలమ్ తొలగించాలని ఆదేశించింది. కుల వివక్షకు సంబంధించిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం మూడు నెలల్లోగా మార్చాలని తేల్చిచెప్పింది. అయితే.. మూడు నెలలు గడిచినప్పటికీ కేంద్రంతోపాటు ఏ రాష్ట్రం నుంచీ సమాచారం అందలేదు. ఈ నేపథ్యంలో.. కేంద్రంతోపాటు 11 రాష్ట్రాల నిర్లక్ష్యంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. మూడు వారాల్లో సమ్మతి నివేదికను అందజేయాలని ఆదేశించింది. ఇదే చివరి అవకాశమని తేల్చిచెప్పింది.

ఢిల్లీ ఎన్నికల వేళ డేరా బాబాకు మళ్లీ పెరోల్

చండీగఢ్, జనవరి 28: అత్యాచారం, హత్య కేసుల్లో జీవితకాల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రాం రహీమ్ సింగ్‌కు 30 రోజుల పెరోల్ మంజూరయింది. ఆయన మంగళవారం ఉదయం 5.26 గంటలకు హరియాణాలోని సునారియా జైలు నుంచి విడుదలయ్యాడు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాం రహీమ్‌కు పెరోల్ లభించడం గమనార్హం. గతంలో కూడా హరియాణా, పంజాబ్, రాజస్థాన్‌లలో జరిగిన స్థానిక ఎన్నికలు, ఉప ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలుమార్లు రాంరహీమ్‌కు 20 నుంచి 50 రోజులపాటు పెరోల్ లభించింది. లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ పెరోల్ మీద విడుదలయ్యాడు. గత ఐదేళ్లలో మొత్తం 14సార్లు రాం రహీమ్‌కు పెరోల్ లభించింది. డేరా బాబాగా పేరొందిన ఈయనకు పంజాబ్,రాజస్థాన్,హరియాణాల్లో భారీగా అనుచరులు ఉన్నారు.

పోలీసులు వాట్సప్ ద్వారా నోటీసులు పంపొద్దు

న్యూఢిల్లీ, జనవరి 28: కోర్టు వ్యవహారాల్లో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరుగుతున్నప్పటికీ విచారణకు సంబంధించిన నోటీసులను వాట్సప్ ద్వారా పంపించడం నిబంధనలకు విరుద్ధమని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అరెస్టు చేయడానికి ముందు విచారణ నిమిత్తం హాజరు కావాలంటూ పంపే నోటీసులు, సీఆర్‌పీసీలోని సెక్షన్ 41ఏ, బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 35 ప్రకారం పంపే నోటీసులకు ఎలక్ట్రానిక్ మాధ్యమాలను ఉపయోగించకూడదని తెలిపింది. కేవలం క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, భారతీయ నాగరిక్ సురక్షా సంహితలో పేర్కొన్న విధానాల్లోనే పంపాలని తెలిపింది. ఎలక్ట్రానిక్ మార్గాన్ని ప్రత్యామ్నాయ విధానంగా పరిగణించలేమంది.

సౌదీ రోడ్డు ప్రమాదంలో తెలంగాణ ప్రవాసీ సహా 15 మంది మృతి

» మృతుడు జగిత్యాల జిల్లా వాసి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సౌదీ అరేబియా దక్షిణాదిలోని జీజాన్ అనే ప్రాంతంలో ఈ నెల 27న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక తెలంగాణ ప్రవాసీ సహా మొత్తం 15 మంది అక్కడికక్కడే మరణించారు. ఈశాన్య ప్రాంతం జుబేల్‌లోని ఒక కంపెనీకి చెందిన 26 మంది వెళ్తున్న బస్సును ఎదురుగా వస్తున్న ఓ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 15 మంది మరణించగా.. వారిలో 9 మంది భారతీయులు ఉన్నారు. మృతుల్లో జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలానికి చెందిన కాపెల్లి రమేశ్ (32) ఉన్నారు. ఈ ప్రమాదంలో 11 మంది గాయపడగా.. వారిలో ఇద్దరు తెలంగాణ ప్రవాసీలు ఉన్నారు.

నీట్ సాధనకు 'కోటా' డిజిటల్ మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నీట్-2025కు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం 'కోటా' 2024, 2025 టెస్టు సిరీస్‌లు, సొల్యూషన్స్, స్టడీ మెటీరియల్, గ్రాండ్ టెస్టులు, ప్రాక్టీసు కోసం కోటా పూర్వ టెస్టులతో పాటు సొల్యూషన్స్, స్టడీ మెటీరియల్, ర్యాంక్ బూస్టర్స్ (డిజిటల్) బుక్‌లెట్స్ సిద్ధం చేసినట్లు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. ఫిజిక్స్ కెమిస్ట్రీ, బయాలజీ డిజిటల్ బుక్‌లెట్స్‌ను మొబైల్ వెర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందవచ్చని చెప్పింది. మరింత సమాచారం కోసం NEET 2025 అని 98490-16661 నంబరుకు వాట్సాప్ మెసేజ్ చేయాలని సూచించింది.

ఏపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని ఆక్రమణలపై

హైడ్రా కొరడా

అమీన్‌పూర్ పెద్దచెరువు భూమిలో నిర్మాణాల కూల్చివేత.. పద్మావతినగర్ రోడ్డు ఆక్రమణల తొలగింపు

పటాన్‌చెరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హైడ్రా బుల్డోజర్లు మరోసారి అమీన్‌పూర్‌లో ఆక్రమణలపై విరుచుకుపడ్డాయి. అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశాయి. ఇటీవల స్తబ్దుగా ఉన్న హైడ్రా మంగళవారం మళ్లీ జూలు విదిల్చింది. జీవవైవిధ్య చెరువుగా ప్రభుత్వం గుర్తించిన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని పెద్దచెరువులో ఆక్రమణలపై కొరడా ఝళిపించింది. పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూముల్లో పెద్దఎత్తున మట్టిపోసి చుట్టూ ప్రహరీని నిర్మించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆక్రమణలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. పెద్దచెరువు పక్కనే ఉన్న సర్వే నంబర్ 193, 194, 323లోని పద్మావతినగర్ కాలనీకి వెళ్లే రోడ్డును మూసివేసి ప్లాట్లలోకి వెళ్లకుండా కాటసాని వర్గీయులు దౌర్జన్యం చేస్తూ వస్తున్నారు. 24 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పద్మావతినగర్‌కు రోడ్డు లేకుండా చేయడంతో బాధితులు న్యాయ పోరాటం ప్రారంభించారు. గతంలో చెరువు కబ్జాతో పాటు పద్మావతినగర్ కాలనీ కబ్జాలపై హైడ్రా స్పందించింది. సుమారు 20 ఎకరాల చెరువు ఎఫ్‌టీఎల్ భూములుగా గుర్తించి, సర్వే చేసి హద్దులను నిర్ణయించారు. చెరువు పరిధి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలోకి వచ్చే భూమి చుట్టూ నిర్మించిన ప్రహరీని గతంలోనే కూల్చివేశారు. పద్మావతినగర్ కాలనీకి వెళ్లే రోడ్డును పునరుద్ధరించారు. పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ భూములను స్వాధీనం చేసుకున్నామని హైడ్రా ప్రకటన కూడా చేసింది. కొద్ది రోజులు మిన్నకుండిపోయిన ఆక్రమణదారులు.. గతంలో హైడ్రా కూల్చిన ప్రహరీని, వాచ్‌మన్ గదులను తిరిగి నిర్మించారు. పద్మావతినగర్‌కు వెళ్లే రోడ్డును ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ప్రహరీ కూడా నిర్మిస్తున్నారు. దీంతో బాధితులు మళ్లీ హైడ్రా కమిషనర్‌ను ఆశ్రయించారు. ఆయన ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.



అమీన్‌పూర్ పెద్దచెరువులో హైడ్రా కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు

కాటసాని వర్గీయులు బెదిరిస్తున్నారు

కాటసాని రాంభూపాల్‌రెడ్డి మనుషులు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పద్మావతినగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ రోడ్డును ఆక్రమించిన కాటసాని వర్గీయులతో 20ఏళ్లుగా పోరాడుతున్నామన్నారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శిష్ట రమేష్, శిష్ట లోహిత్, మౌనిరెడ్డి, పుల్లారెడ్డి తదితరులు తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

కుత్బుల్లాపూర్‌లో 8 గదుల కూల్చివేత

గాజులరామారం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చెరువులో అక్రమ నిర్మాణాలను గతంలో హైడ్రా కూల్చివేసిన చోటే మళ్లీ కొత్త నిర్మాణాలు చేపట్టడంతో కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు స్పందించారు. గాజులరామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్‌లో సర్వే నం.329లో కబ్జాదారులు ఇటీవల 8 గదులు నిర్మించారు. హైడ్రా అధికారులు వాటిని నేల మట్టం చేసి వెళ్లారు. అయితే కబ్జాదారులు మళ్లీ అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. స్థానికుల ఫిర్యాదుతో అధికారులు మంగళవారం వాటిని కూల్చివేశారు.



వివరాలు వెల్లడిస్తున్న నల్ల మల్లారెడ్డి విద్యా సంస్థల కార్యదర్శి నల్ల మల్లారెడ్డి

కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి కూల్చివేతలు

» నల్ల మల్లారెడ్డి, దివ్యనగర్ అసోసియేషన్ ఆరోపణ

పంజాగుట్ట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కొందరి ఫిర్యాదుతో హైడ్రా అధికారులు ఏకపక్షంగా తమ పట్టా భూముల్లోని ప్రహరీ గోడ, కాలనీలోని డివైడర్లు, ఇతర నిర్మాణాలను కూల్చివేశారని నల్ల మల్లారెడ్డి విద్యా సంస్థల కార్యదర్శి, వెంచర్ డెవలపర్ నల్ల మల్లారెడ్డి, దివ్య నగర్ ప్లాట్, హౌస్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపించారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు కొన్నామని, గ్రామ పంచాయతీలో తీర్మానం చేసి ప్రహరీ గోడ నిర్మించుకున్నామని తెలిపారు. 'నేను మాఫియా డాన్ కాదు. నా మీద ఒక్క కేసు లేదు. హైడ్రా అధికారులు నా పరువు తీశార'ని మల్లారెడ్డి పేర్కొన్నారు. దీనిపై పరువు, ఆస్తి నష్టం దావా వేస్తానని తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం పోచారం మునిసిపాలిటీ పరిధి కొర్రెముల, కాచవాని సింగారం గ్రామాల్లో 500 ఎకరాల్లో ఏర్పడిన 11 కాలనీల్లో 3,500ప్లాట్లు ఉన్నాయని, కొన్ని వెంచర్లలో 300 వరకు ఇళ్లు నిర్మించుకుని కాలనీ వాసులు నివాసం ఉంటున్నారని తెలిపారు. 1989 లో సింగరేణి, రైల్వే, తపాలా శాఖ, బ్యాంకు ఉద్యోగులు ఇక్కడ స్థలాలను కొన్నారని చెప్పారు. కొంతమంది ఫిర్యాదుతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఏకపక్షంగా వ్యవహరించారని, సెలవు రోజుల్లో కూల్చివేతలు చేపట్టవద్దన్న సుప్రీంకోర్టు నిబంధనలను పట్టించుకోలేదన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో ప్రహరీ గోడ, డివైడర్లు, గోడలను కూల్చివేశారని ఆరోపించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రజా సమస్యలు ఆలకిస్తున్న రామ్మోహన్ నాయుడు

మీ సమస్యకు... మా పరిష్కారం!

» ప్రజా సమస్యలపై 'అక్షర' శంఖారావం
» పరిష్కారమే అజెండాగా 'ఆంధ్రజ్యోతి' వినూత్న కార్యక్రమం
» ఏపీలో 24 కేంద్రాల్లో నిర్వహణ
» శ్రీకాకుళంలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

'మా అక్షరం.. మీ ఆయుధం' అంటూ పదునైన కథనాలతో కలమెత్తుతున్న 'ఆంధ్రజ్యోతి' ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'మీ సమస్య.. మా ద్వారా పరిష్కారం' అంటూ ప్రజాప్రతినిధులు, కీలక అధికారులకు - ప్రజలకూ మధ్య సంధానకర్తగా నిలిచింది. 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 24 కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్పొరేటర్, మేయర్ల నుంచి కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేల వరకు.. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నుంచి కలెక్టర్ వరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్వయంగా హాజరయ్యారు. అన్ని విభాగాల అధికారులు ఇందులో పాల్గొన్నారు. సామాన్య ప్రజలు, ప్రజాసంఘాల ప్రతినిధులు తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమానికి స్థానిక 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు సంధానకర్తలుగా వ్యవహరించారు. 'చూద్దాం.. చేద్దాం' అని కాకుండా ఆ సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తామనే విషయాన్ని అధికారులు, నేతలు అప్పటికప్పుడే ప్రకటించారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాకుళంలోని 31వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. సాయినగర్ కాలనీలో చాకలి చెరువును బాగుచేయకపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు చెప్పారు. స్పందించిన కేంద్ర మంత్రి.. వెంటనే ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి చాకలి చెరువును పరిశీలించారు. చెరువును బాగుచేసి, అభివృద్ధి చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. కడపలోని అశోక్‌నగర్ ప్రధాన రహదారితోపాటు మిగిలిన వీధుల్లో అడ్డదిడ్డంగా వేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెప్పడంతో సమావేశం ముగిసిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. స్పీడ్ బ్రేకర్లను పరిశీలించి.. అనవసరమైన వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఇలా అన్ని కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్దిష్ట హామీలు లభించాయి.

పదోన్నతుల ప్రక్రియలో వేగం పెంచండి

» అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ అధికారుల పదోన్నతుల ప్రక్రియలో వేగం పెంచాలని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పదోన్నతులపై మంగళవారం ఆయన అధికారులతో సమీక్షించారు. చీఫ్ ఇంజనీర్(సీఈ) నుంచి ఈఎన్‌సీ(ఇంజనీర్ ఇన్ చీఫ్)లుగా పదోన్నతి కల్పించే ఫైలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి, సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) నుంచి చీఫ్ ఇంజనీర్(సీఈ)గా పదోన్నతులు కల్పించే ఫైలు సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ)కి చేరిందని అధికారులు గుర్తు చేయగా... వెంటనే జీఏడీ ముఖ్యకార్యదర్శి బెనహర్ మహేష్‌దత్ ఎక్కాకు మంత్రి ఫోన్ చేశారు. డీపీసీ(శాఖ పదోన్నతుల కమిటీ) సమావేశం తక్షణమే నిర్వహించాలని నిర్దేశించారు. నీటిపారుదలశాఖలో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈఎన్‌సీ(జనరల్), ఈఎన్‌సీ(రామగుండం), ఈఎన్‌సీ(ఓఅండ్ ఎం) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం ఏడుగురు సీనియర్ చీఫ్ ఇంజనీర్లకు ఈఎన్‌సీలుగా పదోన్నతి కల్పించే అవకాశాలున్నాయి. వీరిలో నలుగురు ఈ ఏడాదిలోనే పదవీ విరమణ చేయనున్నారు. ఇక 9 చీఫ్ ఇంజనీర్(సీఈ), 23 దాకా ఎస్ఈ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. 26 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) పోస్టులు ఖాళీగా ఉండటంతో తక్షణమే పదోన్నతులు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



నడుచుకుంటూ వేదిక వద్దకు వెళుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఎమ్మెల్యేపై ట్రాఫిక్ ఏసీపీ దురుసు ప్రవర్తన

» ఎన్టీపీసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా అడ్డగింత

కోల్‌సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీలో మూడు యూనిట్ల విస్తరణకు మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఎన్టీపీసీ జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు నాయకులతో కలిసి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వచ్చారు. ఎమ్మెల్యే వాహనాన్ని రామగుండం ట్రాఫిక్ ఏసీపీ జాన్ నర్సింహులు అడ్డుకున్నారు. ఈ మార్గం గుండా వెళ్లేందుకు వీలులేదని అడ్డు చెప్పారు. ఎమ్మెల్యేగా ప్రజల తరపున తాను మాట్లాడాల్సి ఉందని, తనను వెళ్లనివ్వాలని పేర్కొన్నా వినలేదు. దీంతో వారిరువురి మధ్య వాగ్వాదం జరిగింది. గోదావరిఖని ఏసీపీ రమేశ్ జోక్యం చేసుకుని ఎమ్మెల్యేకు సర్దిచెప్పారు. పోలీసు అధికారులు వారించినా జాన్ నర్సింహులు వినిపించుకోలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు పోలీసు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అక్కడే వాహనం దిగి నేరుగా ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలను కూడా వేదిక వద్దకు రాకుండా అదుపులోకి తీసుకున్నారని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆరోపించారు. ఏసీపీ వైఖరిపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తానని, కలెక్టర్ కూడా విచారణ జరపాలని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ పేర్కొన్నారు.

ఇది పనికిమాలిన వ్యాజ్యం!

దీనిపై మరొక్క మాట మాట్లాడినా జరిమానా విధిస్తాం

» చంద్రబాబుపై సీఐడీ కేసులను సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్‌పై సుప్రీం ఆగ్రహం.. పిటిషన్ డిస్మిస్

న్యూఢిల్లీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో నాటి విపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుపై సీఐడీ నమోదు చేసిన కేసులను సీబీఐకి బదిలీ చేయాలంటూ పిటిషన్ వేయడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదో పనికిమాలిన వ్యాజ్యమని స్పష్టంచేసింది. దీనిపై మరొక్క మాట మాట్లాడితే జరిమానా విధిస్తామని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాదిని హెచ్చరించింది. చంద్రబాబుపై నమోదైన సీఐడీ కేసులను సీబీఐకి బదిలీ చేయాలని న్యాయవాది బాలయ్య గత నెల 20వ తేదీన నేరుగా సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిపై మంగళవారం జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న బి.వరాలేతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. సీఐడీ కేసులను సీబీఐకి అప్పగించాలని కోరడమేంటి.. ఒక పక్క విచారణ జరుగుతోంది కదా అని పిటిషనర్‌ను నిలదీసింది. ఇది పూర్తిస్థాయిలో తప్పుడు పిటిషన్ అంటూ మండిపడింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మణీందర్‌సింగ్ వాదనలు వినిపించడానికి సిద్ధమవడంతో జస్టిస్ బేలా త్రివేది స్పందిస్తూ.. మీలాంటి సీనియర్ న్యాయవాదులు ఇలాంటి పిటిషన్లను కూడా చేపడతారా అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇది విశ్వసనీయత, చట్టపరంగా అర్హత లేని పిటిషన్‌గా పేర్కొంటూ డిస్మిస్ చేసింది.

తండ్రి హత్య.. తల్లి జైలుకు.. అనాథలైన ఇద్దరు చిన్నారులు!

» ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన భార్య
» నిందితుడి గ్రామంలోని ఇంటికి మృతదేహాన్ని తరలించేందుకు బంధువుల ప్రయత్నం
» అడ్డుకున్న పోలీసులు.. రెండు గ్రామాల్లో టెన్షన్

భిక్కనూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భార్య, ఆమె ప్రియుడి చేతిలో దారుణ హత్యకు గురైన మాలే నారాయణ (43) కేసుకు సంబంధించి అటు.. హతుడి గ్రామం, ఇటు.. భార్య ప్రియుడి గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మృతదేహాన్ని నిందితుడి ఇంటి వద్దకు తీసుకెళ్లాలని బంధువుల ప్రయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు రెండు గ్రామాల్లోనూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రత కట్టుదిట్టం చేశారు. తండ్రి హత్యకు గురవడం.. తల్లి జైలుకెళ్లడంతో వారి పిల్లలిద్దరూ అనాథలయ్యారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పల్పనూర్‌లో మాలే నారాయణ హత్యకు గురయ్యాడు. హతుడిది కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం మల్లుపల్లి గ్రామం. నారాయణకు భార్య లక్ష్మి, కూతురు సాహిత్య (10), కుమారుడు సాత్విక్ (8) ఉన్నారు. లక్ష్మి కొన్నాళ్లుగా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లికి చెందిన రాకేశ్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. తమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన లక్ష్మి, రాకేశ్ కలిసి ఈ నెల 24న హత్నూర మండలంలోని పల్పనూర్ సమీపంలో నారాయణను కర్రతో కొట్టి.. గొంతు కోసి హత్యచేశారు. అనంతరం భర్త నారాయణ కనిపించడం లేదని పోలీసులకు లక్ష్మి ఫిర్యాదు చేసింది. పోలీసులు తమదైన శైలిలో విచారించగా అంతా బయటపెట్టింది. కాగా, నారాయణ మృతదేహాన్ని గ్రామస్థులు, ఆయన కుటుంబీకులు కలిసి నిందితుడు రాకేశ్ ఇంటి వద్దకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. భిక్కనూరు సీఐ సంపత్.. మల్లుపల్లి, రామేశ్వర్‌పల్లి గ్రామాల్లో భారీగా పోలీసులను మోహరించారు. సీఐ.. మృతుడి కుటుంబీకులకు నచ్చజెప్పి నారాయణ మృతదేహాన్ని మల్లుపల్లికి తరలించారు అయితే మృతుడి పిల్లలకు న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదని బంధువులు తేల్చిచెప్పారు. ఇరుగ్రామాల పెద్దల జోక్యం సహకారంతో మృతుడి పిల్లలకు న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో బంధువులు, నారాయణ అంత్యక్రియలను నిర్వహించారు. నారాయణ హత్యకు గురవడం, ఆయన భార్య జైలుకు వెళ్లడంతో పిల్లలు సాహిత్య, సాత్విక్‌కు వృద్ధురాలైన నాన్నమ్మ లక్ష్మే దిక్కయింది. నారాయణ కుటుంబానికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, ఆ పిల్లలను ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నాన్నమ్మ లక్ష్మితో నారాయణ ఇద్దరు పిల్లలు సాహిత్య, సాత్విక్

ప్రైవేటు సంస్థకు బాసర లడ్డూ తయారీ బాధ్యతలు

బాసర, జనవరి 28 : (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా బాసర సరస్వతి అమ్మవారి దేవస్థానంలో లడ్డూ తయారీ బాధ్యతలను ఆలయ అధికారులు ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. దేవస్థానం ఆధ్వర్యంలోనే ఇప్పటి వరకు ప్రసాదాల తయారీ కొనసాగింది. ఇప్పుడు ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఏడాది పాటు ఈ కాంట్రాక్టు ఉంటుందని అధికారులు తెలిపారు. కాంట్రాక్టు పొందిన సంస్థ మంగళవారం పనులను చేపట్టింది. అయితే గత 30 ఏళ్ల నుంచి ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న కార్మికులు లడ్డూల తయారీని ప్రైవేటు సంస్థకు అప్పగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా రాత్రికి రాత్రే పని నుంచి తొలగించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రత్యామ్నాయం చూపించాలని అధికారులను వేడుకున్నారు.



ఏబీవీ సస్పెన్షన్ కాలం క్రమబద్ధీకరణ

» వేతన, అలవెన్సుల బకాయిల చెల్లింపునకు ఏపీ ప్రభుత్వం ఆదేశాలు



అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో కక్షసాధింపులకు గురై, ఐదేళ్ల పాటు న్యాయ పోరాటం చేసిన మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వర రావుకు కూటమి ప్రభుత్వం ఉపశమనం కల్పించింది. తప్పుడు అభియోగాలు మోపి సస్పెన్షన్ విధించి, వేధించిన గత ప్రభుత్వ చర్యలను తోసిపుచ్చింది. సస్పెన్షన్ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. సస్పెన్షన్ సమయంలో విధులు నిర్వహించినట్లుగా గుర్తించి వేతన, అలవెన్సుల బకాయిలు చెల్లింపునకు మంగళవారం ఆదేశాలిచ్చింది. రాష్ట్ర కేడర్‌కు చెందిన అధికారి ఏబీవీపై కక్షసాధింపు చర్యలు చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఆయనపై తప్పుడు అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. 2019జూన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ ప్రభుత్వం ఏబీవీని పోస్టింగ్ నుంచి తప్పించిం ది. నిఘా విభాగం అధిపతిగా ఉన్నప్పుడు ఇజ్రాయిల్ నుంచి అధునాతన టెక్నాలజీ కొనుగోలులో అవినీతి జరిగిని 2020 ఫిబ్రవరి 2న సస్పెండ్ చేసింది. దీంతో ఏబీవీ న్యాయ పోరాటానికి దిగారు. దీంతో ఆయన సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ 2022 ఫిబ్రవరిలో కోర్టు తీర్పు వెలువరించింది. దీంతో ప్రింటింగ్ ప్రెస్ కమిషనర్‌గా నియమించిన జగన్ ప్రభుత్వం వారం తిరక్కుండానే రెండోసారి 2022జూన్ 28న సస్పెండ్ చేసింది. మరోమారు న్యాయ పోరాటానికి దిగిన ఏబీవీ 2024 మే 8న కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్)లో విజయం సాధించారు. దీంతో ఆయన పదవీ విరమణకు ముందు రోజు(2024 మే 30) జగన్ ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది.

రఘురామ హత్యకు.. పురమాయించింది ఎవరు?

» సునీల్‌కుమార్ మీకెలా పరిచయం?
» రఘురామపై చిత్రహింసల కేసులో తులసిబాబును ప్రశ్నించిన ప్రకాశం ఎస్పీ.. నోరువిప్పని నిందితుడు
» నేడు గుంటూరు కోర్టులో హాజరు

ఒంగోలు క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురి చేసిన కేసులో నిందితుడు కామేపల్లి తులసిబాబును దర్యాప్తు అధికారి అయిన ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ మంగళవారం రెండోరోజు కూడా విచారించారు. 'రఘురామను హత్య చేయాలని ఎవరు పురమాయించారు? అలా చేసినందుకు మీకు కలిగిన లాభమేంటి? అప్పటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ మీకెలా పరిచయం? నేరుగా ఆయన కార్యాలయంలోకి వెళ్లేంత చనువు ఎలా వచ్చింది' అని ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ నెల 8న తులసిబాబును ఒంగోలులో విచారించి అరెస్టు చేసినట్లు ఎస్పీ ప్రకటించడం.. అనంతరం గుంటూరు కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించడం.. ఈ కేసులో మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు కోర్టు ఆయన్ను పోలీసు కస్టడీకి ఇవ్వడం తెలిసిందే. రఘురామ గుండెలపై కూర్చుని హత్య చేసేందుకు యత్నించింది ఎవరో నిర్ధారించే పరేడ్ ఆదివారం గుంటూరులో జరిగింది. రఘురామరాజు స్వయంగా హాజరై గుర్తుపట్టారు. ఇక కోర్టు అనుమతితో సోమవారం ఒంగోలు పోలీసులు తులసిబాబును తమ కస్టడీకి తీసుకున్నారు. ఎస్పీ దామోదర్ ఎదుట హాజరుపరచగా.. రాత్రి 8.30 గంటల వరకూ ఆయన విచారణ జరిపారు. మంగళవారం ఉదయం తిరిగి జిల్లా పోలీసు కార్యాలయానికి విచారణ కోసం తీసుకెళ్లారు. అక్కడ ఎస్పీ పలు ప్రశ్నలు సంధించారు. రెండ్రోజుల్లో కలిపి 75 ప్రశ్నలు వేయగా.. తులసిబాబు నోరు విప్పలేదని తెలిసింది. 'గుంటూరు సీఐడీ కార్యాలయంలో ముఖానికి కర్చీఫ్‌లు కట్టుకుని రఘురామ గుండెలపై కూర్చొని దాడి చేస్తున్నప్పుడు వీడియో తీసింది ఎవరు? మీ వెంట వచ్చిన నలుగురు ఎవరు' అని ఎస్పీ అడిగినట్లు సమాచారం. అలాగే ఈ నెల 8న జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఆయన అనుచరులు చేసిన రగడపై ఎస్పీ సీరియస్ అయ్యారు. తులసిబాబును బుధవారం తిరిగి గుంటూరు కోర్టులో హాజరుపరచనున్నారు. పోలీసులు మరోసారి కస్టడీకి కోరే అవకాశముంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గతించని గతం

'ఆష్విట్జ్ మారణ హోమం తరువాత కవిత్వం రాయడం అనాగరికం' అన్నాడు జర్మన్ తత్వవేత్త థియోడర్ అడోర్నో. ఆయన భావమేమిటి? ప్రసన్న చిత్తంతో మననశీలుడైన కవి ఆష్విట్జ్ మృత్యుకూప యాంత్రీకృత, ఆత్మరహిత, పారిశ్రామిక పాశవికతను వ్యక్తం చేసేందుకు సరైన శబ్దాలను కనుగొనలేడు. కవిత్వం అనేది ఆనందప్రదమైన, రమణీయమైన మానసోల్లాస సృష్టి. నరమేధం బీభత్సాన్ని వ్యక్తీకరించేందుకు అది అననుగుణమైనది.

గత శతాబ్ది ప్రథమార్ధంలో జర్మనీని పాలించిన జాత్యహంకారులైన నాజీలు యూదు మతస్థులను సంపూర్ణంగా తుదముట్టించేందుకు చేసిన మహా అమానుషంలో భాగమే ఆష్విట్జ్ నిర్బంధ శిబిరం. ఐరోపాలో తాము ఆక్రమించిన అన్ని దేశాల నుంచి యూదులను ఆక్రమిత పోలెండ్‌లో ఏర్పాటు చేసిన ఆ నిర్బంధ శిబిరానికి తరలించి గ్యాస్ చాంబర్లలోకి పంపి హతమార్చారు. పదకొండు లక్షల మందికి పైగా యూదులను ఆ ఒక్క నిర్బంధ శిబిరంలోనే మట్టుపెట్టారు. ఆ మారణ హోమం మానవాళి చరిత్రలోనే మహాకిరాతకమైనది. 1945 జనవరి 27న సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం ఆష్విట్జ్‌ను నాజీల నుంచి విముక్తం చేసింది. ఐక్యరాజ్యసమితి నిర్ణయం ప్రకారం ప్రతి జనవరి 27ను అంతర్జాతీయ హోలోకాస్ట్ స్మారక దినంగా పాటిస్తున్నారు.

ఆష్విట్జ్ పాపం నాజీ జర్మన్లదే అయినా ఆ ముష్కరుల దుర్మార్గాలు తమ దృష్టికి వచ్చినప్పటికీ అమెరికా, బ్రిటన్ తదితర దేశాలు ఉపేక్షించాయి. 1945లో ఇంకెప్పుడూ అటువంటి రాక్షసత్వాన్ని చోటు చేసుకోనివ్వకూడదని సంకల్పం చెప్పుకున్నాయి. ఆ సంకల్పానికి కట్టుబడి ఉన్నాయా? 1975–79 మధ్య కంబోడియాలో ఖ్మేర్ రూజ్ కమ్యూనిస్టులు తమ ఆదర్శ రాజ్య స్థాపనకు 20 లక్షల మందికి పైగా ప్రజలను హతమార్చారు. ర్వాండాలో టుట్సీ, హూటు తెగల మధ్య అంతర్యుద్ధంలో పదిలక్షల మంది బలైపోయారు. 1995లో బోస్నియాలో వేలాది ముస్లింలు ఊచకోతకు గురయ్యారు. సూడాన్‌లో ఈ శతాబ్ది తొలి సంవత్సరాలలో ప్రజ్వరిల్లిన హింసాకాండలో రెండు లక్షల మందికి పైగా చనిపోయారు. ఈ మారణ కాండల వెనుక అగ్ర రాజ్యాల స్వార్థ ప్రయోజనాలు, గర్హనీయమైన నిర్లక్ష్యం ఉన్నాయని మరి చెప్పనవసరం లేదు. ఇప్పుడు గాజాలో జరుగుతోన్న మారణకాండే అందుకు మరో తిరుగులేని దృష్టాంతం. గాజాలో జరుగుతున్నది గ్యాస్ ఛాంబర్లు లేకుండా ఆష్విట్జ్ పునరావృతమేనని మౌంగ్ జార్నీ అనే మానవ హక్కుల ఉద్యమకారుడు తెగేసి చెప్పారు. అమెరికాతో పాటు జర్మనీతో సహా అనేక యూరోపియన్ దేశాలలో కరడు గట్టిన మితవాదులు, మితవాద రాజకీయ పక్షాలు అంతకంతకూ ప్రాబల్యం పొందడాన్ని గమనిస్తే ఆ భయంకర గతం గురించిన భయాలు ఇంకా గతించలేదని, గతించబోవని చెప్పక తప్పదు. ఆష్విట్జ్‌లో సంభవించిందేమిటో నిత్యం గుర్తు చేసుకుంటూ ఉంటేనే ఆ ఘోర చరిత్రకు చరమగీతం పాడడం సాధ్యమవుతుంది.

ఆష్విట్జ్ జర్మన్ల నేర కృత్యం కాదని జర్మన్ యూదు అయిన అడోర్నో గట్టిగా విశ్వసించాడు. పారిశ్రామిక నాగరికతలోని అమానవత్వమే ఆ మారణహోమానికి దారితీసిందని ఆయన భావించారు. నాజీల దుర్మార్గాలు బహిర్గతమైన తరువాత ఆ దుష్కృత్యాలకు తాము నైతికంగా బాధ్యులమని సామాన్య జర్మన్లు చిత్తశుద్ధితో భావించారు. తమ తాతల ఉదాసీనత మూలంగా జరిగిన ఘోరాలకు నేటి జర్మన్లు మనస్ఫూర్తిగా నైతిక బాధ్యత వహిస్తున్నారు. అపరాధ భావన అనేది వారి మనసుల్లోంచి తొలగిపోలేదు, పోదు కూడా. ఇంకా చెప్పాలంటే గోథే భాష, బీథోవెన్ సంగీతం, కాంట్ తాత్వికత వలే ఆష్విట్జ్ కూడా జర్మన్లతో ముడివడిపోయింది. ఆ మారణహోమం కఠోర వాస్తవాన్ని అంగీకరించడం ద్వారానే వారు మానవతకు, తమ అస్తిత్వానికి కొత్త బాటలు నిర్మిస్తున్నారు.

ఒక కొత్త ప్రపంచ అవ్యవస్థ సమస్త దేశాలను కలవరపరుస్తున్న ప్రస్తుత సందర్భంలో మన భారత గణతంత్ర రాజ్యం ఆ పరిస్థితులను మార్చివేయగలుగుతుందా? మన రిపబ్లిక్ ఆవిర్భావంలోనే కుల మతాలు, జెండర్ ఇతర అంతరాలకు అతీతంగా వయోజనులు అందరికీ ఓటు హక్కు కల్పించడమనేది ప్రజాస్వామిక చింతన, ఆచరణలో ఒక గొప్ప విప్లవాత్మక ముందంజ. ప్రాచీన గ్రీసులో థేలీజ్ అనే తత్వవేత్త దృగ్గోచర ప్రపంచమంతటికీ ఒక మూల పదార్థం ఉందని వివేచించి, వైజ్ఞానిక ఆలోచనా సరళికి నాందీ వాచకం పలకడం ద్వారా పాశ్చాత్య మేధో ప్రస్థానంలో సాధించిన మౌలిక పురోగతితో మన గణతంత్ర రాజ్య వ్యవస్థాపకుల ప్రజాస్వామిక భావ సాహసాన్ని పోల్చవచ్చు. అయితే మహోన్నత సంస్కృతీ నిర్మాతలయిన జర్మన్లు అస్తిత్వ ఆందోళనలతో అనుద్దేశపూర్వకంగా, నాజీ అనాగరికులకు అధికారమిచ్చి తమకు తామే హాని చేసుకున్నట్టుగా మనమూ మన పురా సామాజిక సంప్రదాయాల ప్రభావంతో మానవతా విరుద్ధమైన పోకడలు పోతున్నాం. జర్మన్ల అపరాధ భావనవలే ఈ వాస్తవాన్ని గుర్తించే నైతిక జాగృతి మనకు ఇప్పుడు అవసరం. తప్పు చేస్తున్నామనే భావనే కాకుండా ఆ దుశ్చర్యకు బాధితులవుతున్న వారి కలతలు, కష్టాలు తీర్చే కొత్త ప్రగతిశీల ఆలోచన కూడా ఆ నైతిక జాగృతిలో భాగంగా ఉండాలి. తద్వారా మాత్రమే మనం గతించని గతం నుంచి బయటపడి, ఒక కొత్త ప్రజాస్వామిక ప్రపంచానికి వేగుచుక్క కాగలుగుతాము.

కాలచక్రంలో ఢిల్లీ రాజకీయాలు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కాలం ఎంత వేగంగా మారుతోంది! గత అయిదేళ్లతో పోలిస్తే ఇప్పుడు దేశ రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో తీవ్ర మార్పులు వచ్చినట్లు కనపడుతోంది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ లోక్‌సభలో అత్యధిక స్థానాలు సాధించింది. అయినప్పటికీ దేశంలో ప్రత్యామ్నాయ శక్తులు బలంగా ఉండేవి. విచిత్రమేమంటే 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ కేవలం 240 సీట్లు సాధించి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వచ్చినా, ప్రత్యామ్నాయ శక్తులు రోజురోజుకూ బలహీన పడుతున్నాయి. అయిదేళ్ల క్రితం 2020 జనవరిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పౌరసత్వ చట్టంపై భారతీయ జనతా పార్టీని అత్యంత పదునైన భాషలో విమర్శించారు. భారత రాజ్యాంగ పీఠికలో ఏమి రాశారో చదివి మరీ వినిపించారు. ఆ రోజుల్లో కాంగ్రెస్ కూడా అంత బలంగా మాట్లాడేది కాదు. బీఆర్ఎస్ మాత్రమే కాదు, దేశంలో ప్రాంతీయ పార్టీలు ఎంతో కొంత బలంగా ఉన్నకాలమది. బీజేపీని ప్రాంతీయ పార్టీలే అడ్డుకుంటాయని, బీజేపీని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ విఫలమవుతోందని విమర్శలు తలెత్తుతున్న రోజులవి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, జార్ఖండ్, మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా కనిపించేవి.

ఈ అయిదేళ్లలో పరిస్థితులు ఎంతో మారిపోయాయి. ఒడిషాలో 24 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిజూ జనతా దళ్ అధినేత నవీన్ పట్నాయక్‌ను గద్దె దించి బీజేపీ పూర్తి మెజారిటీతో అధికారాన్ని చేజిక్కించుకుంటుందని ఎవరైనా ఊహించారా? మహారాష్ట్రలో ఒకప్పుడు శివసేనతో పొత్తు కోసం అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ ఆడ్వాణీ ఎంతగానో ప్రయత్నించి బాల్‌థాకరేను తమ వైపునకు తిప్పుకున్నారు. అదే శివసేన మోదీకి ఎదురు తిరిగి కాంగ్రెస్, ఎన్‌సీపీతో కలిసి 2019లో ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అప్పుడు బీజేపీకి మహారాష్ట్రలోని 280 సీట్లలో కేవలం 105 సీట్లే దక్కాయి. అయినప్పటికీ శివసేన, ఎన్‌సీపీలను బీజేపీ చీల్చి ఆ ప్రభుత్వాన్ని పడగొట్టి, శివసేన చీలికవర్గం నేత ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకు దోహదం చేసింది. గత ఏడాది ఎన్నికల్లో బీజేపీ స్వయంగా అత్యధిక సీట్లు సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, చీలిపోయిన ఎన్‌సీపీ, శివసేన పార్టీలు బీజేపీ పంచన చేరతాయని ఎవరు ఊహించారు? హరియాణాలో 2019లో ప్రాంతీయ పార్టీతో చేతులు కలిపి అధికారం ఏర్పాటు చేయాల్సి వచ్చిన బీజేపీ గత ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తుందని పలువురు రాజకీయ విశ్లేషకులు కూడా అంచనా వేయలేకపోయారు. పంజాబ్‌లో 2019 వరకు అకాలీదళ్ లేకుండా బీజేపీ ఒకనాడు పోటీ చేసే పరిస్థితులు ఉండేవి కావు. వాజపేయి, ఆడ్వాణీ ప్రయత్నాల వల్లే అకాలీదళ్ బీజేపీకి స్నేహహస్తం చాచింది. కాని ఇప్పుడు అకాలీదళ్ అంతరించిపోయే పార్టీల జాబితాలో కలిసిపోయే ప్రమాదంలో పడింది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి, లోక్‌సభలో ఒక్క సీటు కూడా సాధించలేని దుస్థితిలో పడుతుందని, తన పార్టీని జాతీయ పార్టీగా మార్చాలని కలలు కన్న కేసీఆర్ ఫాం హౌజ్‌కు పరిమితమవుతారని, ఆయన పిల్లలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటారని ఆ పార్టీ నేతలు కలలో కూడా ఊహించి ఉండరు. ఒకప్పుడు 22 మంది ఎంపీలను, 151 ఎమ్మెల్యేలను గెలిపించుకున్న వైసీపీ ఆంధ్రప్రదేశ్‌లో స్వయంకృతాపరాధాల వల్ల చిత్తుగా ఓడిపోయి మనుగడ కోసం పోరావలసి వస్తుందని, జగన్ కుడిభుజంగా గుర్తింపు పొందిన విజయసాయిరెడ్డి కూడా రాజకీయ సన్యాసం చేస్తారని ఆ పార్టీ నేతల్లో ఎవరు ఊహించారు?

ఈ నేపథ్యంలో ఢిల్లీలో 2013 నుంచీ ముఖ్యమంత్రిగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ భవిష్యత్ ఏమిటి అన్న విషయం గతంలో ఏనాడు లేని విధంగా చర్చ జరుగుతోంది. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తర్వాత బీజేపీని ఒంటరిగా ఢీకొంటున్న నేత అరవింద్ కేజ్రీవాల్. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు దక్కించుకున్నా, ఆరునెలల తర్వాత 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి పూర్తి మెజారిటీ తెచ్చిపెట్టిన నేత కేజ్రీవాల్. తన పథకాల్లో ప్రజల్లో ఆదరణ లభించడంతో తనకు తిరుగు లేదని భావించి ఒక దశలో ప్రధానమంత్రి పదవి కోసం కూడా కలలు కన్న కేజ్రీవాల్ ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. నాడు ఢిల్లీలో గెలుపుకోసం అమిత్ షా నిద్రాహారాలు మాని రాత్రింబగళ్లు పనిచేశారు. జామియా, జేఎన్‌యూలలో బీభత్స వాతావరణం నెలకొంది. షాహీన్ బాగ్‌లో నెలల తరబడి నిరసన ప్రదర్శనలు జరిగాయి. పౌరసత్వ చట్టం, 370 అధికరణ రద్దు, త్రిపుల్ తలాఖ్, రామమందిర నిర్మాణంపై తీవ్ర ప్రచారం జరిగింది. అయినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని తిరస్కరించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అధునాతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలు, మహిళలు బస్సెక్కితే ఉచితంగా ప్రయాణించేందుకు గులాబీ రంగు టికెట్, మొహల్లా వైద్యశాలలు.. వీటన్నిటితో ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ వైపే మొగ్గు చూపారు.

కాని 2020లో వచ్చిన ఫలితాలు ఇప్పుడు పునరావృతమవుతాయని చెప్పలేని పరిస్థితి ఢిల్లీలో నెలకొంది. 2019లో మాదిరి 2024లో కూడా బీజేపీ మరోసారి మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు సాధించింది. దీన్ని బట్టి ఢిల్లీ ప్రజలు జాతీయ స్థాయిలో నరేంద్రమోదీనే ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని రెండోసారి రుజువైంది. కాని అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని ఖచ్చితంగా చెప్పేందుకు ఆస్కారం లేదు. దేశంలో వివిధ ప్రాంతీయ పార్టీలను దెబ్బతీసేందుకు అనుసరించిన వైఖరినే బీజేపీ ఆమ్ ఆద్మీ పార్టీ పట్ల ప్రదర్శించినప్పటికీ, ఆమ్ ఆద్మీ పార్టీ కూడా స్వయంగా తనంతట తాను తన ప్రతిష్ఠ దిగజారిపోయే పనులు చేసిందనడంలో అతిశయోక్తి లేదు. టీఆర్ఎస్ మాదిరే ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ప్రజా పోరాటం నుంచి పుట్టిన పార్టీ. అవినీతికి వ్యతిరేకంగా జన లోక్‌పాల్ బిల్లుకోసం జరిగిన ఉద్యమమే ఈ పార్టీ ఏర్పడేందుకు దారితీసింది. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు ఆప్ సంచలనం. యువతీయువకులు 'నేను ఆమ్ ఆద్మీని' అని రాసి టోపీలు ధరించి గల్లీ గల్లీలో పాటలు పాడుతూ, సామాజిక సమస్యలపై నృత్యరూపకాలు ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకునేవారు. సామాన్య ప్రజలకోసం ఇంతగా ఆలోచించిన పార్టీ లేదని, అవినీతికి బద్ధ వ్యతిరేకమని ఆ పార్టీ గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యమంత్రి అయిన కొత్తలో కేజ్రీవాల్ ప్రజా సమస్యలపై కేంద్రంపై పోరాడేందుకు నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారు. దేశ వ్యాప్తంగా ఒకప్పుడు మాయావతి నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీ సృష్టించిన సంచలనమే ఆప్ కూడా సృష్టించింది. కేజ్రీవాల్‌తో చేతులు కలిపేందుకు ఎందరో మేధావులు అనేక రాష్ట్రాల్లో ముందుకు వచ్చారు. వారిలో లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ్, కోదండరామ్ వంటి వారు కూడా ఉన్నారు.



ఢిల్లీలో ఒకప్పుడు ఏకఛత్రాధిపత్యం వహించిన కాంగ్రెస్ ఆమ్ ఆద్మీ పార్టీ వల్ల అస్తిత్వం కోల్పోయింది. ఇప్పుడు బీజేపీ చేతిలో ఆప్ ఓడిపోతే తమకు మళ్లీ కోలుకునే అవకాశం దక్కుతుందని ఆ పార్టీ భావిస్తున్నట్లు కనపడుతోంది. ఢిల్లీలో బీజేపీ గెలిస్తే పంజాబ్‌లోనూ ఆప్ ప్రభుత్వానికి సమస్యలు రావడం ఖాయం. ఏమైనా వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి బీజేపీ కూటమికీ, కాంగ్రెస్ కూటమికి ముఖాముఖి హోరాహోరీ పోరు జరిగేందుకు క్రమంగా రంగం సిద్ధమవుతోంది.

2020లో ఒక రోజు కేజ్రీవాల్‌ను కలిసి ఆయన పట్ల ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఆసక్తి గురించి చర్చించాను. కాని ఆయన దృష్టి ఇతర అంశాలపై ఉన్నట్లు అర్థమైంది. ఆ తర్వాత కొంతకాలానికి బీఆర్ఎస్ నేతలతో ఆయన భవబంధాలు ఏర్పర్చుకోవడం, ఢిల్లీ మద్యం కుంభకోణం వెలుగులోకి రావడం జరిగింది. ఏ అవినీతి పునాదిగా ఆయన పార్టీ అవతరించిందో ఆ అవినీతి ఆయననే చుట్టుముట్టడం విషాదకరం. తనకంటూ విలాసవంతమైన భవంతిని నిర్మించుకోవడమే కాదు, ప్రభుత్వ పథకాల్లో కూడా వాటా కొట్టేయడం గురించి విజిలెన్స్ నివేదికల్లో బయటపడింది. మొహల్లా క్లినిక్‌లలో నకిలీ పేషంట్లను సృష్టించారని, జరగని వైద్య పరీక్షలను జరిగినట్లు చూపించారని, నాణ్యత లేని మందులు సరఫరా చేశారని ఈ నివేదికలు వెల్లడించాయి. ఒకప్పుడు ఎలాంటి మచ్చా లేని ఆమ్ ఆద్మీ పార్టీ ఎవరి నుంచి అవినీతిపై పాఠాలు నేర్చుకుంది? ఉద్యమాల నుంచి, అణగారిన వర్గాల నుంచి అవతరించిన పార్టీలకు కూడా అవినీతి చెదలు పట్టి హరించుకుపోయే పరిస్థితి ఏర్పడితే ప్రజలకు ఏ రాజకీయ పార్టీ పట్ల నమ్మకం ఏర్పడుతుంది? కేవలం ఉచితాలే ఈ పార్టీలను కాపాడతాయా?

ఏమైనా దేశంలో ఒంటరిగా ప్రాంతీయ పార్టీలు పోరాడే పరిస్థితి మాత్రం కనపడడం లేదు. ఇందుకు గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలే నిదర్శనం. అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులు కుదరకపోయినా జాతీయ స్థాయిలో ఏదో ఒక కూటమిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. లోక్‌సభలో ప్రస్తుతం ఎన్డీఏ కూటమిలో 293 మంది సభ్యులు ఉండగా, ఇండియా కూటమిలో 238 మంది సభ్యులు ఉన్నారు. ఏ కూటమికీ చెందనివారు కేవలం 11 మంది మాత్రమే ఉన్నారు. దేశ రాజధానిలో జరిగే ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించడాన్ని బీజేపీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటే కాంగ్రెస్ ప్రేక్షక పాత్ర వహించే స్థితిలో ఉంది. ఢిల్లీలో ఒకప్పుడు ఏకఛత్రాధిపత్యం వహించిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వల్ల అస్తిత్వం కోల్పోయింది. ఇప్పుడు బీజేపీ చేతిలో ఆప్ ఓడిపోతే తమకు మళ్లీ కోలుకునే అవకాశం దక్కుతుందని కాంగ్రెస్ భావిస్తున్నట్లు కనపడుతోంది. ఎందుకంటే ఒకప్పటి కాంగ్రెస్ ఓట్లనే ఆప్ కబళించిందని ఆ పార్టీకి తెలుసు. ఢిల్లీలో బీజేపీ గెలిస్తే పంజాబ్‌లో కూడా ఆప్ ప్రభుత్వానికి చాప కింద నీళ్లు ప్రవేశించే అవకాశాలున్నాయి. ఏమైనా వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి బీజేపీ కూటమికీ, కాంగ్రెస్ కూటమికి ముఖాముఖి హోరాహోరీ పోరు జరిగేందుకు క్రమంగా రంగం సిద్ధమవుతోంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ముఖ్యమంత్రి ఏడో గ్యారంటీ ఏమైంది?

ప్రజలను అణచివేసే స్వభావం గల రాజ్యానికి ఏ నీతి నియమాలు, నిబద్ధతలు ఉండవు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం గుట్ట మైనింగ్ తవ్వకాలను ఆపివేయాలని ఆ గ్రామ ప్రజలు ఈ నెల 20 నుంచి నిరవధిక రిలే నిరాహార దీక్షలకు పూనుకుని, ఆ శిబిరాన్ని ప్రొఫెసర్ హరగోపాల్ చేతుల మీదుగా ప్రారంభించాలని, ప్రసంగించాలని ఆహ్వానించారు. దీని కోసం బయలుదేరి వెళుతున్న హరగోపాల్‌ను కల్వకుర్తి సమీపంలో వెల్దండ పోలీసులు కారును అడ్డగించి అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు గాను స్పెషల్ పోలీసు బలగాలతో పాటు 50 మంది పోలీసులను డీఎస్పి పర్యవేక్షణలో మోహరించారు. అంతకుముందే వక్తగా వెళుతున్న నన్ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంతమంది పోలీసు బలగాలను మోహరించాల్సిన అవసరం ఏముంది?

గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వానికీ, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికీ తేడా ఏమీ లేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకపూర్వం గొప్ప గొప్ప వాగ్దానాలు చేసింది. పౌర ప్రజాస్వామిక హక్కులను కాపాడుతానని, పౌరహక్కులను నిలబెడతానని, ఇది నా 7వ గ్యారెంటీ అని ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట ఇచ్చి ఉన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. ఇప్పటికే బూటకపు ఎన్‌కౌంటర్లలో తెలంగాణలో 14 మంది చనిపోయారు. పోలీసు కస్టడీలో ముగ్గురు చనిపోయారు. పోలీసు హింసకు గురి అయినవాళ్ళు చాలామంది ఉన్నారు. అక్రమ అరెస్టులు, రిమాండులు జరుగుతూనే ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 300 మంది ప్రజా సంఘాల నాయకులపైన కేసులు నమోదు అయి ఉన్నాయి. 30 మందిని జైలుపాలు చేశారు.

గత ప్రభుత్వ హయాంలో విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ హరగోపాల్ ర్యాలీగా వస్తూ గన్‌పార్క్ వద్ద 14 సెప్టెంబర్ 2018న తెలంగాణ అమరులకు నివాళులు అర్పిస్తుండగా పోలీసులు దాడిచేసి, దురుసుగా ప్రవర్తించి, ఆయనపై చేతులు వేసి లాక్కుపోయి వానులో వేసి అరెస్టు చేశారు. అంతకు ముందు 2014లో ప్రొఫెసర్ హరగోపాల్ రాజకీయ ప్రత్యామ్నాయ వేదికను ఏర్పాటు చేశాడు. దాని ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేస్తే పోలీసులు హాలుకు తాళం వేశారు. కరోనా కల్లోల కాలంలో రెండుసార్లు ప్రొఫెసర్ హరగోపాల్ ఇంటి మీద జాతీయ దర్యాప్తు సంస్థ దాడిచేసింది. గంటల తరబడి ప్రశ్నించారు. అంతటితో ఆగక బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపా కేసులు కూడా బనాయించింది. వరుస ప్రభుత్వాలు నిరంతరం వేధిస్తూనే ఉన్నాయి. ఆగస్టు 19, 2023న తాడ్వాయి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న నక్సలైట్ల డైరీలో 152 మంది ప్రజా సంఘాల నాయకులతో పాటు హరగోపాల్ పేరు కూడా ఉందనే నెపంతో చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం 'ఉపా'తో పాటు దేశద్రోహం కేసులు కూడా బనాయించారు. అయితే ప్రభుత్వానికి తీవ్రమైన నష్టం వాటిల్లకముందే తేరుకొని హరగోపాల్ మీద, మరో ఐదుగురు మీద బనాయించిన కేసులు ఎత్తివేస్తున్నామని ప్రకటించారు. కాని ఇప్పటి వరకు ఆ కేసును చట్టపరంగా ఎత్తివేయలేదు. ఉద్యమకారులు, మేధావులతో అమర్యాదగా వ్యవహరించడంలో ప్రభుత్వాలు మితిమీరిపోతున్నాయి. తెలంగాణ పౌర సమాజంలో ఎంతో ముఖ్యమైన, విలువైన వ్యక్తులను వేధించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి. పోలీసులను కట్టడి చేయాలి. ఎల్లప్పుడూ ఒకే పార్టీ అధికారంలో ఉంటుందని గ్యారెంటీ లేదని చరిత్ర చెప్పిన సత్యం.

— లక్ష్మణ్ గడ్డం, అధ్యక్షులు, పౌర హక్కుల సంఘం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

పురుషాహంకార ఆలోచనాధోరణి మారడం లేదు

భార్య మొహం చూసుకుంటూ ఏ భర్త అయినా ఉన్నాడంటే పిచ్చోడైన అంటారు, లేదా అనుమానస్తుడు అయినా కావాలి. ఒకరి మొహాలు ఒకరు గడుపుతూ ఉంటే కుటుంబంలో అవసరాలు ఎలా తీరాలి? డబ్బు ఒకటే కుటుంబాన్ని నడపదు. అందరికీ తిండి కోసం వండాలి, ఇంటిని తీర్చిదిద్దుకోవాలి, శుభ్రం చేసుకునే పనులుంటాయి. పిల్లల పనులు, పండుగలు, పబ్బాలు, సరదాలు, శుభకరమైనవి, అశుభమైనవి ఇలా ఒకటా రెండా ఎన్ని పనులుంటాయి. ఈ పనులన్నీ ఎవరు చేయాలి? ఆడవాళ్ళు మాత్రమే చేయాలని, ఈ కాలంలో కూడా ఐటీ సంస్థల అధినేతలు అనుకుంటున్నారు. ఇటీవల ఎల్ అండ్ టి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ తన కింది ఉద్యోగస్తులను శనివారం మాత్రమే కాదు ఆదివారం కూడా పనిచేయించలేకపోతున్నందుకు బాధపడుతున్నాను, ఆదివారం ఇంట్లో కూర్చొని ఏం చేస్తారు, ఎంత సమయం భార్యల మొహాలు చూసుకుంటూ కూర్చుంటారు అని అన్నాడు. అంటే దీని అర్థం ఏమిటి? ఇంట్లో పనులన్నీ ఆడవాళ్ళు చేయాలనే కదా!

ఉద్యోగం పురుషుల లక్షణం కాబట్టి, ఇంటికి కూడా రాకుండా వారానికి 90 గంటలు పని చేసి తన సంస్థకు లాభాలు తీసుకురావాలట. ఎల్ అండ్ టి లాంటి మన సంస్థలు విదేశీ బహుళజాతి కంపెనీల పెట్టుబడులతో నడిచేవే. కానీ విదేశాల్లోని ఆ కంపెనీల్లో స్త్రీలు, పురుషులు ఎక్కువగానే ఉద్యోగాలు చేస్తూ అలాగే ఇంటికి రాగానే కూడా పనిని పంచుకుంటారు. అక్కడి ఆర్థిక విధానం అనివార్యంగా స్త్రీలు, పురుషులు పనిచేసే విధంగా రూపొందించబడింది. కానీ దేశ సంస్థలకు విదేశీ పెట్టుబడులు కావాలి కానీ, స్త్రీ పురుషులు సమానంగా కుటుంబంలో కూడా పనిచేయాలనే భావజాలం కనీసంగా కూడా అబ్బడం లేదు. అంటే వీళ్లకు కేవలం లాభాలు మాత్రమే కావాలి. పురుషాహంకార మైండ్‌సెట్ మారడం లేదన్నమాట. 90 గంటలు పని చేయడానికి కార్మిక హక్కులు ఉంటాయని కూడా గుర్తు లేదు. ఇక 90 గంటల పని అమలు చేయడమంటే కేవలం పురుషులకు మాత్రమే సాధ్యమవుతుంది. అంటే పరోక్షంగా మహిళలను ఉద్యోగాల నుండి దూరం చేయడమే అవుతుంది.

ఇప్పటికే అనధికారికంగా ఐటీ కంపెనీలలో 8 గంటలకు మించి పనిచేయడం వల్ల మానసిక ఒత్తిడి ఉద్యోగులపై ఎక్కువగా ఉన్నది. ఆ మేరకు కుటుంబాలలో అశాంతి కూడా పెరుగుతున్నది. ఇక 90 గంటల పనివల్ల పని వత్తిడితో పాటు కుటుంబ హింస కూడా మరింత పెరుగుతుంది. అనివార్యంగా మహిళలపైనే ఆ హింస పెరుగుతుంది. ఉద్యోగులపై పని భారం లేకుండా ఇష్టంగా నాణ్యత కలిగిన ఎనిమిది గంటల పని, సంస్థలనే కాదు కుటుంబాలను కూడా సంతోషంగా ఉంచుతుంది. శని ఆదివారాలు ఇంట్లో కూడా పని భారం లేకుండా సమానంగా భార్యాభర్తలు చేసుకొని సరదాగా గడిపితే తిరిగి సోమవారం ఉత్సాహంగా ఉద్యోగం చేసుకుంటారు. ఇలా కుటుంబాలు ఆరోగ్యంగానే కాదు ఆనందంగా కూడా ఉంటాయి.

— అనిత, చైతన్య మహిళా సంఘం

తొక్కిసలాట మరణాలకు కారణాలు ఏమిటి?

ఈ మధ్య ఒక పత్రికలో 'దేవుడి అరెస్టు' అని ఒక మాట చదివి మొదటి క్షణంలో ఆశ్చర్యపోయాను. రెండో క్షణంలో, అంతాశ్చర్యం ఎందుకూ? అంతే మరి, అనుకున్నాను. తన గురించి, మానవులు అలా ఎందుకు అనుకుంటారో దేవుడికి తెలీదా? వైకుంఠంలో నించి కిందకి చూడడా? 'వైకుంఠం! వైకుంఠం!' అనుకుంటూ ఎన్నెన్ని దండుల దండుల మానవులు ఆ వైకుంఠం గుడికి వస్తున్నారో, ఇంకా ఇంకా రావాలనుకుంటున్నారో, దేవుడు చూడడా? అందరూ పచ్చి భక్తులు! పండు భక్తులు! ఆడా, మొగా! సుఖంగా ఇళ్ళల్లో ఉండకుండా వైకుంఠం కోసమే, అందులో ఉన్న దేవుడి దర్శనం కోసమే బయల్దేరి, దారిలో తోటి భక్త జనం వత్తిళ్ళతో కాళ్ళు కదలక, ఎలాగో భక్తి గీతాలతో దేహాల్ని ఈడ్చుకుంటూ ముందుకే, దేవుడి కోసమే వస్తున్నారు కదా? ఆ భక్తులు కనపడడం లేదా దేవుడికి?

దేవుడికి ముందుగా కనబడేది, సాధారణ భక్తులు కాదు. వి.ఐ.పి, వి.వి.ఐ.పి భక్తులు! అంటే వెరీ వెరీ ఇంపార్టెంట్ పర్సన్స్! అలాంటి వారెవరంటే: రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, పెద్ద పెద్ద కోర్టుల జడ్జీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, వాళ్ళ కుటుంబాలూ, బంధుమిత్రులూ, అనుచరులూ, వగైరాలు! వీళ్ళందరూ ప్రత్యేక దర్శనాలకు అర్హులు. స్వామివారు, వీరిని ప్రత్యేక అతిథులుగా, ఆత్మీయ అతిథులుగా, ముఖ్య అతిథులుగా భావించి, దర్శన భాగ్యం కలిగిస్తారు. ఉన్నత హోదాల్లో లేని లక్షలాది సాధారణ భక్తులు మాత్రం క్యూలలో గంటల తరబడి నిలబడి వేచి చూడాలి. దేవుడి ముందు అందరూ సమానమే అంటారు గానీ, అది నిజం కాదు. కొందరు ఎక్కువ సమానులు, కొందరు తక్కువ సమానులు. 300 రూపాయల టిక్కెట్లు కొని ప్రత్యేక దర్శనం పొందేవారూ, 10 వేల రూపాయల టిక్కెట్లు కొని ప్రత్యేక దర్శనం పొందేవారూ, ఏ డబ్బూ లేకపోయినా, మంత్రుల, ఎమ్మెల్యేల సిఫార్సుల ఉత్తరాలతో, ప్రత్యేక దర్శనం పొందేవారూ– ఇలా భక్తుల్లో వర్గాలు! విశేషం ఏమిటంటే, ఇక్కడ కుల వివక్ష లేదు. వర్గ వివక్షే! డబ్బున్నవాడికే ప్రత్యేక దైవ దర్శన భాగ్యం!

భక్తిలో డబ్బు పాత్ర గురించి రమణ మహర్షి చెప్పిన అద్వైత వేదాంతానికి లొంగిపోక ముందు, చలం రాసిన చక్కని మాటలు చూడండి! "...మీ దేవుడు మీ డబ్బుకి దాసుడు. మీ నంగి పూజలకీ, స్వార్థ ప్రార్థనలకీ వశ్యుడు. దొంగ భక్త పరాధీనుడు." (శ్రీశ్రీ 'మహా ప్రస్థానా'నికి, 17-7-1940న చలం రాసిన యోగ్యతాపత్రం). అలాగే, ఒకప్పుడు కమ్యూనిస్టు కవిగా పేరొందిన గజ్జెల మల్లారెడ్డి అనే ఆయన కూడా, చక్కటి భావాన్ని కవితాత్మకంగా చెప్పాడు: "తెలుగునాట భక్తి రసం, తెప్పలుగా పారుతోంది! డ్రైనేజీ స్కీములేక, డేంజర్‌గా మారుతోంది!" (ఇంత గొప్ప కవిత్వం రాసినాయన కూడా, తర్వాత కాలంలో, ఆ డేంజర్‌లోనే పడ్డారని విన్నాను!)

ఇటీవలి వైకుంఠ ఏకాదశి సందర్భంగా, వేలాది మంది భక్తులు వైకుంఠ ద్వారం దగ్గిర చేరారు. హఠాత్తుగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు స్త్రీలు నేలకూలి ప్రాణాలు వదిలేశారు! ఆరుగురిలోగానీ, ఆ వేలమందిలో గానీ, హైకోర్టు జడ్జీలో, మంత్రులో, మరో రకం వి.ఐ.పీలో లేరు సుమా! (ఎందుకు లేరు? వాళ్ళూ ఉండాలి–అని కాదు నా ప్రశ్న!) ఎంత విషాదం! దేవుడు చూస్తూవుంటే ఎలా జరిగింది అది? పడిపోయిన భక్తురాళ్ళని దేవుడు చప్పున తన అభయహస్తాలతో లేవదియ్యలేడా? భక్తులు విశ్రాంతుల కోసం నడకలు ఆపి పడుకున్నారు నేల మీద– అనుకున్నాడా దేవుడు? వాళ్ళు పోతున్నారని గ్రహించి, అభయ హస్తంతో వాళ్ల కళ్ళు తెరిచేలాగ చెయ్యలేడా? అది నిజం కాదు, అన్నీ చెయ్యగలడు! దేవుడు పరమ శక్తిమంతుడు కదా? మరి, ప్రాణాలు పోతుంటే, ఆ ప్రాణాల్ని పట్టి వెనక్కి విసిరికొట్టలేడా? ఆరు కుటుంబాల తల్లుల, భార్యల, మరణాలా? ఏమైపోవాలి ఆ కుటుంబాలు? బిడ్డలేమవుతారు? సామరస్యంగా గడిపే దాంపత్యాలైతే, ఆ భర్త లేమవుతారు? దేవుడికి దైవత్వం ఎక్కడుంది? ఆ ఆరు మరణాలేనా? దాదాపు నలభైమంది భక్తులకు గాయాలట! దేవుడు అభయ హస్తం చాచితే, ఆ భక్తులు ఆస్పత్రి మొహం చూడవలసి ఉండేదా? ఏమిటిది? తనని చూడాలని చచ్చిపోడానికి కూడా సిద్ధపడతారు మనుషులు – అని తెలియడం లేదా? ఇది తెలిసే, వాళ్ళని రక్షించకుండా వదిలేశాడా? రాగానే పాదాభివందనాలు చేస్తారని కాళ్ళు చాచుకుని కూర్చున్నాడా? భక్తులకు, ఇళ్ళ నించీ బయల్దేరినప్పుడే తెలుస్తుంది, కిక్కిరిసే జనాల గుంపులోకి దూరబోతున్నామని! కించిత్తు జంకులేదు. చావకుండా ఉన్న జనాలూ, ఇళ్ళల్లోనే ఉన్న జనాలూ, ఏం చెప్పుకుంటున్నారో దేవుడికి తెలుసా? 'చచ్చిపోయిన వాళ్ళు అదృష్టవంతులు! ఎంత అదృష్టం ఉంటే, వైకుంఠ ద్వారం ముందు ప్రాణాలు వొదులుతారు!' అని.

ఇంతకీ, ఈ తొక్కిసలాటలో జరిగిన మరణాలకు కారణం ఎవరు? తోసుకొచ్చిన భక్తులా? వారికి అలాంటి నమ్మకం కలిగించిన దేవుడా? దీనికి జవాబు, ఇంకో సినిమా తొక్కిసలాట సంఘటన గురించి చెప్పుకున్నాక ఆలోచిద్దాం! ఆ మధ్య ఎర్ర చందనం దొంగల నాయకుణ్ణి హీరోగా చూపిన ఒక సినిమా చూడడానికి, ఆ హీరో అభిమానులు వేల సంఖ్యలో, ఒక సినిమా హాలుకి ఎగబడి పోయారు. ఆ సినిమాకి, ఆ సమయానికి, ఆ హీరో కూడా వస్తున్నాడనీ, సినిమా హాలుకి దగ్గిర్లోనే ఉన్నాడని తెలిసి, జనాలు గుంపులు గుంపులుగా తోసుకువెళ్ళారు. జనంలో తోపులాట! కదల్లేక కిక్కిరిసిన గుంపులు! ఒక తల్లి మరణం! పిల్లవాడికి ప్రాణాపాయం! కొందరికి గాయాలు! ఆ కిక్కిరిసిన గుంపుల్లో ఉన్న ప్రతీ ఒక్కరూ ఎలాంటి వారనుకోవాలి? నేలమీద ఒక మనిషి పడివుంటే, ఆమెని లేవదీసే గుణం లేకపోయినా, ఆమె మీద చెప్పులతో, బూట్లతో, తొక్కుకుంటూ వెళ్ళకూడదనే బుద్ధి అయినా ఉండదా? పాదాలకు స్పర్శలు లేవా? కాళ్ళు నేలమీద ఉన్నాయో, పడిపోయిన పిల్లవాడి మీద ఉన్నాయో, స్పృహ ఉండదా? తప్పు ఎవరిది? వెంటనే అనిపించేది ఏమిటంటే, ఆ సినిమా జ్వరం పట్టుకున్న జనాల గుంపుల్లో ప్రతీ ఒక్కరిదీ తప్పే అవదా? అసలు ఆ హీరో, మొదటి రోజే, ప్రేక్షకుల మధ్య కూచుని, చూడాల్సిన అవసరమూ, తొందరా ఎందుకు? కావాలంటే, విడుదలకు ముందు చూసుకోలేడా? ఎందుకంటే, ఆ సినిమా గురించి, అంతకు ముందుదాకా, ప్రీ–రిలీజు ఫంక్షన్ల పేరుతో, అనేక నగరాల్లో, జరిపిన బహిరంగ సభల ప్రచారాలు సరిపోవు. సినిమా హాల్లోకే హీరో కూడా వస్తున్నాడంటే, ఆ ప్రచారం తారాస్థాయికి ఎగిరి, తర్వాత ఒకటి రెండు రోజుల్లో, వేలల్లో, లక్షల్లో జనాలు ఆ సినిమాని చూస్తే, కోట్లలో కలెక్షన్లు వచ్చిపడతాయి. పెట్టిన పెట్టుబడికి మించి వంద రెట్లలో, వేల రెట్లలో లాభాలే లాభాలు! పెట్టుబడికి అసలు జరగాల్సింది లాభాల ప్రవాహం! కాబట్టి, ఈ తొక్కిసలాట మరణాలకి సినిమా పెట్టుబడికి ఉన్న లాభాల రంధే కారణం! అలాగే, వైకుంఠ ద్వార దర్శనం దగ్గిర తొక్కిసలాటకి కూడా భక్తిపేరుతో, ఆ దేవుణ్ణి పెట్టుబడిగా పెట్టి, ప్రభుత్వాలు నడిపే వ్యాపారమే కారణం!


పెట్టుబడికి అసలు జరగాల్సింది లాభాల ప్రవాహం. కాబట్టి, ఈ తొక్కిసలాట మరణాలకి సినిమా పెట్టుబడికి ఉన్న లాభాల రంధే కారణం. అలాగే, వైకుంఠ ద్వార దర్శనం దగ్గిర తొక్కిసలాటకి కూడా భక్తిపేరుతో, ఆ దేవుణ్ణి పెట్టుబడిగా పెట్టి, ప్రభుత్వాలు నడిపే వ్యాపారమే కారణం!



మొత్తం మీద, సినిమా తొక్కిసలాటకైనా, భక్తి తొక్కిసలాటకైనా, పెట్టుబడి అనేదే మూల కారణం! పెట్టుబడి అనేది ఎంతకైనా తెగిస్తుందని, 150 ఏళ్ళ కిందట, బ్రిటన్‌కి చెందిన డన్నింగ్ అనే కార్మిక నాయకుడు, ఇలా అన్నాడు: "తగినంత లాభం ఉంటే, పెట్టుబడి చాలా ధైర్యం గలది. నిశ్చయమైన 10 శాతం లాభం వుంటే, అది ఎక్కడైనా వ్యాపారం చేస్తుంది. నిశ్చయమైన 20 శాతం లాభం పెట్టుబడికి ఉబలాటాన్ని పెంచుతుంది. 50 శాతం లాభం అయితే సాహసాన్ని పుట్టిస్తుంది. లాభం 100 శాతం అయితే, పెట్టుబడి మానవీయ నియమాలన్నిటినీ కాలరాయడానికి సిద్ధపడుతుంది. 300 శాతం ఉంటే, పెట్టుబడి ఏ నేరం చేయడానికైనా సంకోచించదు. ఏ ప్రమాదానికీ వెనుదీయదు, దాని స్వంతదారుడికి ఉరిశిక్ష పడే అవకాశానికి కూడా!" – ఈ గొప్ప సత్యాన్ని మార్క్సు మనకి చెబుతూ, 'పెట్టుబడి' గురించి ఇలా అంటాడు: "ఒజ్యే అనే ఆర్థికవేత్త– 'డబ్బు అనేది పుట్టుకతో ఒక చెంప మీద రక్తపు మరకతో జన్మిస్తుంది' అంటుంది కానీ, పెట్టుబడి అనేది నఖశిఖ పర్యంతం, ప్రతీ రోమ కూపం నుంచీ రక్తమూ, మురికీ కారుతూ జన్మిస్తుంది!" (కాపిటల్–1, 31వ చాప్టరు చివరిలో).

కాబట్టి దేవుడినో, హీరోనో, ఇంకెవరినో అరెస్టు చేసి ప్రయోజనం లేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అరెస్టు చెయ్యాలి! దానికి తగిన జ్ఞానాన్ని పొందడమూ, ఆ సిద్ధాంతాన్ని, భక్తిలో, సినిమా మత్తులో మునిగిన జనాలకి వివరించడమూ చెయ్యాలి.

● రంగనాయకమ్మ





'నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్నవారిపై కొరడా ఝుళిపిస్తున్నారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేయకుండా అమెరికాలో మనుగడ కష్టం. మా తల్లిదండ్రులు అప్పు చేసి నన్ను అమెరికాకు పంపించారు. నా ఖర్చులకు నెలనెలా డబ్బులు పంపించే స్థోమత వారికి లేదు. నేనే పార్ట్‌టైమ్‌గా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఏడాది కాలంగా చదువుకుంటున్నా. ప్రస్తుతం తనిఖీలు ఎక్కువయ్యాయి.. పోలీసులకు దొరికితే డిపోర్టేషన్ (స్వదేశానికి పంపించటం) చేస్తున్నారు. అందుకే ఆ పార్ట్‌టైమ్ ఉద్యోగాన్ని తాత్కాలికంగా మానేశా. ఆర్థికంగా ఎలా అడ్జెస్ట్ అవుతుందోనని ఆందోళనగా ఉంది'

- శాన్ ఆంటోనియా రాష్ట్రంలో ఉండే వరంగల్ విద్యార్థి ఆవేదన

'ఐదారు రోజులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. దీంతో నేను, నా స్నేహితుడు పార్ట్ టైమ్ ఉద్యోగం మానేశాం. రెస్టారెంట్ యజమాని కూడా మమ్మల్ని ఉద్యోగంలోకి రావొద్దని చెప్పారు. రిస్క్ తీసుకుని వేరే కంపెనీలో జాబ్‌కు వెళ్లి మా స్టూడెంట్ వీసాను కోల్పోలేం. ఎప్పుడు ఏం జరుగుతుందో నని ఆందోళనగా ఉంది'

- డల్లాస్‌లో ఉండే మరో విద్యార్థి



● అమ్మో..రికా

మనోళ్లలో.. డిపోర్టేషన్ భయం!

ట్రంప్ ఆంక్షలతో అగ్రరాజ్యంలోని ఓరుగల్లు విద్యార్థుల్లో ఆందోళన

- చదువుతూ.. పార్ట్‌టైమ్ చేసే వారికి గండమేనని ప్రచారం
- నింబధనల ప్రకారం క్యాంపస్‌లో వారంలో 20గంటలే జాబ్ చేసుకునే అవకాశం
- పార్ట్‌టైం జాబ్స్ చేయకుండా అమెరికాలో ఉండటం కష్టమంటున్న విద్యార్థులు
- ఉమ్మడిజిల్లా నుంచి చదువుల కోసం అమెరికాకు ఐదారు వేల మందికి పైగా పయనం
- తగిన పత్రాలు లేకుండా.. అక్రమంగా ఉంటున్నవారిలో గుబులు

యువత డాలర్ డ్రీమ్స్‌పై ట్రంప్ పిడుగు పడుతోంది. అమెరికాలో చదువుకుంటూ.. పార్ట్‌టైమ్ జాబ్‌పై నెట్టుకొస్తున్న వారికి డిపోర్టేషన్ (స్వదేశానికి పంపడం) భయం వెంటాడుతోంది. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ ఇమ్మిగ్రేషన్‌పై కొరడా ఝుళిపిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఉన్నత చదువుల కోసం వెళ్లిన వారు ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడి నుంచి సుమారు 6వేల మందికిపైగా అమెరికాకు వెళ్లినట్టు అంచనా ఉండగా.. వీరిలో చాలామంది చదువుతూనే పార్ట్‌టైమ్ జాబులు చేసుకుంటున్నారని సమాచారం. అయితే ఎఫ్ 1 వీసాపై యూఎస్‌లో వారానికి 20గంటలే పార్ట్‌టైమ్ చేసుకోవాలని.. అది కూడా వారి క్యాంపస్‌లోనేనని నిబంధన ఉంది. కానీ చాలామంది విద్యార్థులు గ్రాసరీస్టోర్స్, బంకులు, రెస్టారెంట్లతో పాటు వివిధ కంపెనీల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలపై ఆధారపడ్డారని.. ఇప్పుడు కొత్త అధ్యక్షుడి నిర్ణయాలతో వారిని భయం వెంటాడుతోందని తెలుస్తోంది. 7

- వరంగల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి



- నేడు బల్దియాలో కౌన్సిల్ సమావేశం
- సమస్యల పరిష్కారంపై చర్చ జరిగేనా?
- ఎజెండాలోని అంశాలను సభ్యులకు వివరించిన అధికారులు
- డివిజన్లలో అభివృద్ధిపై గళం విప్పనున్న కార్పొరేటర్లు

అభివృద్ధికి దారి చూపేనా?

వరంగల్ కార్పొరేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ప్రకటించినా విడుదల చేయడంలో తాత్సారం జరగడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ఇంకా నగరంతోపాటు విలీన గ్రామాలలో చాలాకాలంగా సమస్యలు స్వైరవిహారం చేస్తున్నా- పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అధికారులకు ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో పదులసార్లు ఫిర్యాదులు అందించినా అధికారులు స్పందించక పోవడంతో కాలనీల సమస్యలు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం జరిగే వరంగల్ నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం దీనికి పరిష్కారం చూపాల్సి ఉంది. దీనిపై సభ్యులు, పాలకవర్గం ఏం చర్చ చేస్తారో ఆసక్తిగా ఉంది.

కౌన్సిల్ సమావేశం

గత డిసెంబరు 31న జరగాల్సిన కౌన్సిల్ సమావేశం బుధవారం బల్దియా కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో జరగనుంది. మేయర్‌తో పాటు మంత్రి, ఎక్స్ అఫీషియో సభ్యులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు సమావేశంలో పాల్గొంటారని బల్దియా అధికారులు ఐదు రోజుల ముందుగానే సభ్యులకు సమాచారం అందించారు. ఉదయం 11.30 గంటలకు బల్దియా కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షత కౌన్సిల్ సమావేశం జరుగనుంది. ఈ యేడు బల్దియా పరిధిలో చాలా వింగ్‌లలో అభివృద్ధి అటకెక్కింది. ప్రధానంగా అజంజాహిమిల్లు కార్మిక భవనం భూమికి బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుమతి ఇవ్వడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఇదే అదునుగా బీఆర్ఎస్ కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యపై పాలకవర్గంపై దుమ్మెత్తి పోయనున్నారు. అదే విధంగా చాలాకాలంగా పలు విభాగాలకు పూర్తి స్థాయి అధికారులు లేక పోవడం, ఇన్‌చార్జ్‌ల పాలనలో అవినీతి రాజ్యమేలుతోందనే ప్రచారం ఉంది. ఖాళీగా ఏర్పడిన వింగ్ అధికారులను నింపాలని ప్రతిపక్ష కార్పొరేటర్లు నిలదీస్తారని తెలిసింది.

ఎజెండా అంశాలు ఇలా..

కౌన్సిల్ సమావేశంలో ఎజెండా అంశాలు ఐదు రోజుల కిందటే కార్పొరేటర్‌లకు అందజేశారు. ఎజెండా అంశాలతో పాటు ఒక్కో కార్పొరేటర్‌కు ఒక విలువైన సెల్‌ఫోన్ అందించారు. తాయిలాలు పుచ్చుకున్న కార్పొరేటర్లు నిలదీస్తారా? లేక మిన్నకుంటారా? అనేది వేచి చూడాల్సి ఉంది. అయితే కౌన్సిల్‌లో గతంలో చేసిన పనులకు బిల్లుల చెల్లింపు, సిబ్బంది లేక పనులు కుంటుపడుతున్నాయని తెలిసింది. వీటిపై చర్చ జరగనుంది. అలాగే 250మంది శానిటేషన్, టెక్నికల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల నియామకంపై చర్చ జరుగనుంది. ఇంకా ప్రజారోగ్య విభాగం అన్నపూర్ణ పథకం ద్వారా అందించే రూ.5 భోజనం కొనసాగింపు, వరద బాధితులకు సహాయంపై చర్చిస్తారు. అర్బన్ మలేరియా విభాగంలో పని చేస్తున్న 90 మంది కార్మికులకు రోజుకు రూ.42 చొప్పున ఆరు నెలలకు రూ.69లక్షల చెల్లింపు, స్వచ్ఛ ఆటో ఓనర్ కం డ్రైవర్లకు మూడు మాసాల అగ్రిమెంట్ పొడిగింపు జరుగుతుంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.4,170కోట్ల నిధులపై చర్చ జరుగుతుంది. బల్దియా ఆవరణలోని పరిపాలన భవనం కోసం ఇటీవల ప్రభుత్వం కేటాయించిన రూ.32కోట్లు విడుదలపై ఎజెండా అంశాలు చర్చించనున్నారు. అయితే ఈ యేడు చివరి సాధారణ సర్వసభ్య సమావేశం కావడంతో బల్దియా నిధులు తిరిగి వెళ్లిపోతే అభాసుపాలవుతారని తెలిసి ప్రతీ డివిజన్‌కు రూ.30లక్షలతో అభివృద్ధి చేయాలని నిధులు విడుదల చేసినట్టు కొందరు కార్పొరేటర్లు చెబుతున్నారు. 66 డివిజన్‌లలో జరిగే అభివృద్ధి పనులకు టెండర్ల ఆహ్వానం, సమష్టి కృషితో పాలనపై మాట్లాడనున్నారు.

నగరంలో సమస్యలు ఇలా..

బల్దియా పరిధిలో ప్రతీ వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయి. ఒకరి భూమి ఒకరు ఆక్రవించడం, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం, రోడ్లు, కాలువలు కబ్జా చేసి ఆక్రమించడంలాంటివి ఎదురవుతున్నాయి. దీనిపై ప్రధానంగా చర్చ జరపాల్సి ఉంది. ఇంకా నగరంలోని 66 డివిజన్లలో వీధి దీపాల సమస్య ఉంది. నగరంలో చాలాచోట్ల లైట్లు వెలగడం లేదు. ప్రధానంగా కొందరు అనుభవం లేని కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు అలసత్వంవల్ల నగరంలో చాలాచోట్ల తాగునీరు వృథాగా పోతోంది. కాంట్రాక్టర్లు సరిగా మరమ్మతు పనులు చేయకపోవడం వల్ల సుమారు 50 శాతం నీరు వృథాగా పోతోంది. ఇంకా నగరంలో చాలా చోట్ల బల్దియా అధికారులు ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారు. రోడ్లు, మురుగు దొడ్లు, డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదు. రోడ్లు శుభ్రం చేయడానికి దిగుమతి చేసిన అధునాతన వాహనాలు మూలకుపడ్డాయి. ఇంకా చాలాకాలనీలలో అర్బన్ మలేరియా సిబ్బంది నిర్లక్ష్యం వల్ల వందకు పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. దోమల మందు, ఫాగింగ్ చేయకపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొన్నిచోట్ల ప్రజలు విషజ్వరాల బారిన పడి ప్రాణాలను సైతం పోగొట్టుకున్నారు.



సీఎంను కలిసిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై కదలిక



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- 31న ఆస్పత్రి నిర్మాణం, వైద్య సేవలపై అధికారులతో సీఎం సమీక్ష
- కడియం శ్రీహరి నేతృత్వంలో సీఎంను కలిసిన ఓరుగల్లు ఎమ్మెల్యేలు
- మడికొండ డంపింగ్ యార్డు గురించి వివరించిన ప్రజాప్రతినిధులు

7

వన్యప్రాణులను దత్తత తీసుకోవాలి

రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



జంతువుల దత్తతకు సంబంధించిన వివరాలు మంత్రికి తెలుపుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

న్యూశాయంపేట, జనవరి 28 (ఆంధ్ర జ్యోతి): వన్యప్రాణులను దత్తత తీసుకోవడాని కి జంతు ప్రేమికులు ముందుకు రావాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కోరారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న కాకతీయ జులాజికల్ పార్కులోని నీల్గాయ్, సాంబర్‌డీర్, చౌసింగ, అడవి దున్నను మంత్రి కొండా సురేఖ దత్తత తీసుకున్నారు. ఈ మేరకు ఫారెస్ట్ రేంజ్ ఆ ఫీసర్ మయూరి మంగళవారం మంత్రి కొండా సురేఖను హనుమకొండలోని మంత్రి నివాసంలో కలిసి దత్తతకు సంబంధించి న వివరాలు తెలిపారు. వెంటనే మంత్రి కొండా సురేఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కు రూ.2లక్షలు చెల్లించి ఈ నాలుగు జంతువులను యేడాది పాటు దత్తత తీసుకున్నారు. యేడాదికి ఒక్కో జంతువుకు రూ.50వేల చొప్పున ఈ నాలుగు జంతువుల దత్తత తీసుకున్నట్లు రేంజ్ ఆఫీసర్ మయూరి తెలిపారు. ఈసందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. వ్యక్తులు, సంస్థలు, సంఘాలు వారి వారి సామర్థ్యాన్ని బట్టి చిన్న చిన్న పక్షులు, తాబేళ్లు మొదలు పులుల వరకు 3 నెలలు, 6 నెలలు, సంవత్సరం చొప్పున దత్తత తీసుకోవాలన్నారు.

ఏప్రిల్‌లో కాజీపేట బస్టాండ్‌కు శంకుస్థాపన

- ఎకరం స్థలంలో సీఎంతో భూమి పూజ చేయిస్తాం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాజీపేట వాసుల చిరకాల వాంఛ అయిన బస్టాండ్‌ను ఏప్రిల్ మొదటివారంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనల చేపడుతామని, అందుకు అన్ని చర్యలు చేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. కాజీపేట బస్టాండ్ స్థలాన్ని మంగళవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఏడీఆర్ఎం ఎం.గోపాల్, ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణితో కలిసి స్థలపరిశీలన చేశారు. ముందుగా కాజీపేట వీఐపీ లాంజ్‌లో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఏడీఆర్ఎం ఎం.గోపాల్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం స్థలాన్ని పరిశీలించారు. కాజీపేట రైల్వే ఇంగ్లీష్ మీడియం (మిక్స్‌డ్ హైస్కూల్) స్థలాన్ని దాదాపు ఖరారు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గత పాలకులు కాజీపేట అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. కేవలం కాజీపేటను ఓట్ల రాజకీయాలకు వాడుకుని వదిలేశారన్నారు తాను ఎమ్మెల్యే అయినప్పట్నుంచి కాజీపేట అభివృద్ధిపై ప్రత్యేక చొరవతీసుకుని ఎన్నోసార్లు రైల్వే జీఎం, డీఆర్ఎంను కలిసి విన్నవించానన్నారు. కాజీపేట ఆర్వోబీని ఏప్రిల్ మొదటివారంలో పూర్తి చేసి అందరికీ అందుబాటులోకి తెస్తామన్నారు. డిగ్రీ కళాశాల, వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్ నగరాన్ని సీఎం రేవంత్‌రెడ్డి రెండో రాజధానిగా చేయడానికి కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. బస్టాండ్ నిర్మాణ పనులు త్వరలో చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బావుసింగ్, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్‌లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, అబూబక్కర్, నాయకులు ఎం.డి. అంకూస్, అజ్గర్‌తో పాటు స్థానిక నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు.



బస్టాండ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, మేయర్

నేడు హనుమకొండలో సీపీఐ వందేళ్ల వార్షికోత్సవ సభ

న్యూశాయంపేట, జనవరి28 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ వందేళ్ల వార్షికోత్సవ సభ బుధవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం భిక్షపతి సీపీఐ జిల్లా నాయకులతో కలిసి వార్షికోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం భిక్షపతి మాట్లాడుతూ.. ఉదయం 11:30 గంటలకు బాలసముద్రంలోని ఏకశిలాపార్కు నుంచి ప్రదర్శన ప్రారంభమవుతుందని అనంతరం హరిత కాకతీయ హోటలలో సభ ఉంటుందన్నారు. ఈ వార్షికోత్సవ సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ శాసనసభాపక్ష నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావులు హాజరవుతారని, జిల్లా పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాసంఘాల నాయకులు వార్షికోత్సవ సభకు హాజరై విజయవంతం చేయాలని భిక్షపతి కోరారు.



జాతీయస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ టోర్నీకి ఎంపికైన సహస్ర ను అభినందిస్తున్న డీవైఎస్‌వో అశోక్

జాతీయస్థాయి క్రికెట్ టోర్నీకి సహస్ర

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2వ తేదీ నుంచి హరియానా రాష్ట్రంలోని పంచకుల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జాతీయస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ టోర్నీకి హనుమకొండ జిల్లా క్రీడా సమాఖ్య (డీఎస్ఏ)కు చెందిన సహస్ర ఎంపికైంది. ఇటీవల ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ టోర్నీలో సహస్ర పాల్గొని ఆల్ రౌండర్ ప్రతిభ కనబర్చి జిల్లా నుంచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ప్రస్తుతం సహస్ర హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో మూడేళ్లగా డీఎస్ఏ కోచ్ అఫ్జల్ పర్యావేక్షణలో క్రికెట్‌లో శిక్షణ పొందుతోంది. ఈ మేరకు జాతీయస్థాయి క్రికెట్ టోర్నీకి ఎంపికైన సహస్రను మంగళవారం హనుమకొండ డీవైఎస్‌వో అశోక్ డీఎస్ఏ కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ క్రికెట్ కోచ్ మహ్మద్ అఫ్జల్, జిమ్నాస్టిక్స్ కోచ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఎన్‌జీవోలకు నిధులకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ, జనగామ జిల్లాలో కొత్తగా ఏర్పాటైన, గిరిజన ప్రజలకు సేవలు అందిస్తూ ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రభుత్వేతర సంస్థలకు నిధులు మంజూరుకు కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హనుమకొండ, జనగామ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన సంస్థల నుంచి నూతన ఎన్‌జీవో ఆన్‌లైన్ అప్లికేషన్ అండ్ ట్రాకింగ్ సిస్టమ్ https://ngo.tribal.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ దరఖాస్తుల ను ఆన్‌లైన్‌లో స్వీకరించడానికి సంబంధిత పోర్టల్‌లో జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు అందుబాటులో ఉంటుంది అని తెలిపారు. కనుక గిరి జనులకు సేవచేయాలనుకునే ప్రభుత్వేతర సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. దరఖాస్తు అనంతరం ఆప్రతిని హనుమకొండ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందచేయాలని కోరారు.

ఎంజేపీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతీరావు పూలే బాలుర బాలికల గురుకుల విద్యాలయాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ మోతె రాజు కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 18 బాలుర, 18 బాలికల పాఠశాలల్లో 5వ తరగతికి ప్రతి పాఠశాలకు 80 సీట్ల చొప్పున భర్తీ చేసేందుకు ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 23వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నాలుగవ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 1 సెప్టెంబరు 2012 నుంచి 31 ఆగస్టు 2016 లోపు ఇతర కులాల విద్యార్థులు 1 సెప్టెంబరు 2014 నుంచి 31 ఆగస్టు 2016లోపు పుట్టి ఉండాలని తెలిపారు. కులం, నివాసం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలతో సమీప మీ సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రాష్ట్ర వర్సిటీలపై కేంద్ర ముసాయిదాను వ్యతిరేకించాలి

కుర్తా అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ సదానందం, వడ్డె రవీందర్

కేయూ క్యాంపస్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వర్సిటీలపై కేంద్రం రూపొందించిన ముసాయిదాలోని అంశాలన్నీ తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని, వాటిని వ్యతిరేకించాలని కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం (కుర్తా) అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ ఎ.సదానందం, ప్రొఫెసర్ వడ్డె రవీందర్ పిలుపునిచ్చారు. మంగళవారం కేయూ సెనెట్‌హాల్‌లో కుర్తా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ సదానందం, ప్రొఫెసర్ రవీందర్‌లు మాట్లాడారు. యూజీసీ ఇటీవల రూపొందించిన వర్సిటీల ముసాయిదాపై చర్చించారు. వైస్ చాన్స్‌లర్ల నియామకాల్లో కేంద్రం తీరు ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు మెరిట్‌తోపాటు పరిశోధనల అనుభవం కల్గిన ప్రొఫెసర్లను వీసీగా నియమించాలని డిమాండ్ చేశారు. వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో పాత నిబంధనలను సవరిస్తూ జాతీయ స్థాయి నెట్ పరీక్షను మినహాయింపు సరికాదన్నారు. పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు న్యాయం చేస్తూనే నెట్ ఉత్తీర్ణతను కొనసాగించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ పెంపుతో పాటు నూతన నియామకాలు చేపట్టాలని అన్నారు. కేంద్రం, రాష్ట్రాలు బడ్జెట్‌లో విద్యకు, వర్సిటీలకు నిధులను పెంచాలని అన్నారు.

కుర్తా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎంపిక

సెనెట్ హాల్‌లో మంగళవారం జరిగిన కుర్తా జనరల్ బాడీ సమావేశంలో కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ప్రొఫెసర్ ఎ.సదానందం, ప్రొఫెసర్ వడ్డె రవీందర్,



కుర్తా నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న ఎన్నికల అధికారి ప్రొఫెసర్ కృష్ణయ్య

కోశాధికారిగా ప్రొఫెసర్ గుగులోత్ వీరన్న, వైస్‌ప్రెసిడెంట్‌గా ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టు స్వామి, జాయింట్ సెక్రటరీగా ప్రొఫెసర్ చింత సమ్మయ్య, కార్యవర్గ సభ్యులుగా ప్రొఫెసర్ కందకట్ల సుధాకర్‌లు తిరిగి రెండేళ్లకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ ప్రొఫెసర్ ఎం.కిష్టయ్య వ్యవరించారు. రెండేళ్ల అకౌంట్స్‌ను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తి, ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ప్రొఫెసర్ ఎం.కిష్టయ్య, ప్రొఫెసర్ టి.పాపిరెడ్డి, ప్రొఫెసర్ ఎ.సీతారాంనాయక్, ప్రొఫెసర్ ఎస్.జగన్నాథస్వామి, ప్రొఫెసర్ కె.పురుషోత్తం, ప్రొఫెసర్ చింతకింది రాజేశం, ప్రొఫెసర్ బి.సంజీవరెడ్డి, ప్రొఫెసర్ సీహెచ్. సంజీవ, ప్రొఫెసర్ ఎన్.రామస్వామి, ప్రొఫెసర్ ఇ.రాజనరేందర్, ఇంద్రాసేనారెడ్డి, ప్రొఫెసర్ ఊరడి శ్రీనివాస్, ప్రొఫెసర్ సక్రియా ప్రొఫెసర్ పి.సమ్మాలాల్, తదితరులు పాల్గొన్నారు.

భార్యపై అనుమానంతో హత్య

మూడు రోజుల క్రితం కత్తితో దాడి చికిత్స పొందుతూ మృతి

కేసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : భార్యపై అనుమానంతో గొడవపడి కత్తితో దాడి చేయగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం వెంకటగిరికి చెందిన వాంకుడోత్ సుగుణ (30)మృతి చెందినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న సుగుణ భర్త రఘు మద్యం సేవించి అనుమానంతో తరచూ భార్యతో గొడవపడుతుంటాడు. ఈనెల 25న మధ్యాహ్నం భార్యతో రఘు వివాదం పెట్టుకొని క్షణికావేశంలో కర్రతో సుగుణ తలపై కొట్టి, కూరగాయలు కోసే కత్తితో పొట్టలో పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన సుగుణను అదే రోజు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందింది. సుగుణ తండ్రి కున్సోత్ హట్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు రఘుపై హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కళాకారిణి కుంట శాంతికి నంది అవార్డు



కుంట శాంతి

వరంగల్ సిటీ, జనవరి28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమ, ప్రజా కళాకారిణి కుంట శాంతి బంగారు నంది అవార్డుకు ఎంపికయ్యారు. ప్రిన్సెస్ ఉమెన్స్ బ్యూటీ సొసైటీ, ప్రిన్సెస్ బ్యూటీ మాషం స్టూడియో వీబీఎంఎస్ ప్రెసిడెంట్ తాళ్ల సునితారాజ్, వైస్ ప్రెసిడెంట్ ఊర్వశి పటేల్ ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శాంతి మాట్లాడుతూ.. గ్రామాల్లో కలల పట్ల ఆసక్తి కనబరుస్తూ డప్పు కళాకారిణిగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నాన్నారు. మద్యపాన నిషేధం, వరకట్న దురాచారం, బాల్య వివాహాలు, మహిళల పట్ల జరుగుతున్న దురాగతాలపై అనేక ప్రదర్శనలు ఇచ్చానన్నారు.

బీసీ ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

రాంనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్‌పీడీసీఎల్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మీయ సమ్మేళనం మంగళవారం హనుమకొండలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, కొడెపాక కుమారస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ఫిబ్రవరి 2వ తేదీన హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజీలో జరిగే బీసీల యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ కార్యదర్శి నీలారపు రాజేందర్, నాగెల్లి సదానందం, పి.సత్యనారాయణ, రంగు సత్యనారాయణ, నాగబెల్లి ప్రసాద్, సుమారు 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థి అనుమానాస్పద మృతి

వరంగల్ క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. నయీంనగర్ వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న హుజురాబాద్‌కు చెందిన సాయి చంద్రిక ఆత్మహత్య చేసుకోగా విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ తెలిపారు.

మెరుగైన విద్యుత్‌ను అందించాలి

రాంనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన వైద్యాన్ని అందించడంలో విద్యుత్ కాంట్రాక్టర్లు ప్రధాన భూమిక పోషించాలని సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టు అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో సీఎండీ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి.సదానందం, ఎస్‌కె.మజీద్, పర్వతాలు, శ్రీనునాయక్, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, ఇసాక్, జలీల్, వెంకటేశ్వర్‌రావు, నరసింహారావు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణలో నానోథెరనోస్టిక్స్ కీలక భూమిక

- వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి
- ప్రారంభమైన నానోథెరనోస్టిక్స్‌పై వర్క్‌షాపు



వరంగల్ నిట్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి నానోథెరనోస్టిక్స్ వర్క్‌షాపును ప్రారంభిస్తున్న దృశ్యం

హనుమకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వ్యాధుల నివారణలో నానోథెరనోస్టిక్స్ కీలక భూమిక పోషిస్తుందని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ అన్నారు. వరంగల్ నిట్‌లో మంగళవారం రసాయన శాస్త్రం ఆధ్వర్యంలో 'నానోథెరనోస్టిక్స్- మౌలిక సూత్రాల నుంచి వైద్య ప్రయోజనాల దిశగా' అనే అంశంపై ఎనిమిది రోజుల వర్క్‌షాపు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనేక వ్యాధుల నిర్ధారణ, నివారణలో నానోథెరస్టిక్స్ ప్రస్తుతం విరివిగా వినియో గం అవుతోందని అన్నారు. వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలో ఇది నానోథెరనోస్టిక్స్ ఒకటి అన్నారు. విదే విద్యాసంస్థలతో సహకారాన్ని పెంపొందించడంలో విద్య, పరిశోధనల అనుసంధాన అభివృద్ధి పథకం (స్పా ర్క్) ప్రాధాన్యతను ఆయన వివరించారు. అంతర్జాతీయ సంబంధాలు, పూర్వవిద్యార్థుల వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వరంగల్ నిట్‌లో జరుగుతున్న స్పార్క్, గేయిన్ కార్యకలాపాల గురించి వివరించారు. రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.సంతోష్ రసాయన శాస్త్ర విభాగంలో జరుగుతున్న అంతర్జాతీయ పరిశోధనల గురించి తెలియ చేశారు. వర్క్‌షాపు నిర్వాహకులు ప్రొఫెసర్ సీహెచ్ రఘు, ప్రొఫెసర్ పీవీ శ్రీలక్ష్మి వర్క్‌షాప్ లక్ష్యాలను వివరించారు. నానోమెడిసిన్ రంగంలో ప్రఖ్యాత నిపుణుడు, కెనడాలోని ఓటావ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సురేశ్ గద్దె ఈ వర్క్‌షాపులో ప్రత్యేక వక్తగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

పద్మ అవార్డులు.. బీజేపీ అవార్డులు కావు

- గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట, జనవరి28 (ఆంధ్రజ్యోతి): పద్మ అవార్డులు బీజేపీ అవార్డులు కావని, పద్మ అవార్డుల విషయంలో ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. పద్మ అవార్డులలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందని, అవార్డుల ప్రకటనలో ఫెడరల్ స్ఫూర్తి లోపించిందన్నారు. జాతీయ అవార్డులైన పద్మ అవార్డులను దేశంలో వివిధ రంగాలలో సేవ చేసిన వారికి అవకాశం కల్పించాలని, రాజకీయంగా చూడకూడదన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చూపిన విధంగానే పద్మ అవార్డుల ప్రకటనలో కూడా వివక్ష చూపిందని విమర్శించారు. జానపద కళలు, సాహిత్య రంగంలో చేసిన సేవలకు గుర్తుగా గద్దర్‌కు పద్మ అవార్డు ప్రకటించాల్సి ఉంటే బాగుండేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గద్దర్ పాటలు ప్రజలను ఉర్రూతలూగించాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా పద్మ అవార్డుల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు మునిగాల భిక్షపతి, జక్కు రాజుగౌడ్, సిరబోయిన కరుణాకర్, నిమ్మల మనోహర్, వెంకట్రాజం, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఈజీఎస్ ఈసీ మృతి

జిల్లాలో ఈజీఎస్ సిబ్బందిలో తీవ్ర విషాదం



జగదీష్‌బాబు (ఫైల్)

బచ్చన్నపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి-భువనగిరి జిల్లా ఆలేరు రైల్వేస్టేషన్‌లో సోమవారం రాత్రి రైలు ఢీ కొన్న సంఘటనలో బచ్చన్నపేట ఈజీఎస్ కార్యాలయంలో ఇంజనీరింగ్ కన్సల్టెంట్ (ఈసీ)గా విధులు నిర్వర్తిస్తున్న కొఠారి జగదీష్‌బాబు (41) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగదీష్‌బాబు హైదరాబాద్‌లోని ఖార్ఖానాలో నివాసముంటూ ప్రతి రోజు రైలులో ఆలేరు వరకు, అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై బచ్చన్నపేటకు వచ్చిపోతుంటాడు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని వెళతుండగా ఆలేరు రైల్వే స్టేషన్‌లో తాను ఎక్కాల్సిన ఇంటర్‌సిటీ రైలు వస్తుండడంతో ఒకటో ప్లాట్‌ఫాంను దాటి రెండో ప్లాట్‌ఫాం వైపు వెళతున్న క్రమంలో సికింద్రాబాద్ నుంచి వరంగల్ వైపు వెళతున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. దీంతో మాంసం ముద్దలు ఎగిరిపడగా, మంగళవారం ఉదయం వరకు బయటకు మృతుడి వివరాలు తెలియరాలేదు. పలు ఆధారాలతో గుర్తింపు అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని భువనగిరి రైల్వేస్టేషన్ ఇన్‌చార్జి కృష్ణారావు తెలిపారు. ఈ దుర్ఘటన జిల్లాలోని ఈజీఎస్ వర్గాల్లో తీవ్ర విషాదం నింపింది. మృతుడికి భార్య స్రవంతి, ఇద్దరు కూతుళ్లున్నారు. జనగామ డీఆర్డీవో వసంత, బచ్చన్నపేట ఎంపీడీవో మల్లికార్జున్, ఏపీవో కృష్ణ, జిల్లాకు చెందిన ఈజీఎస్ టీఏలు, సీవోలు, ఎఫ్ఏలు మృతదేహానికి నివాళులు అర్పించారు. అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందించారు.

గుజరాత్‌లో హసన్‌పర్తి యువకుడి మృతి

నేవీ కోస్టు గార్డు ఉద్యోగం చేస్తూ క్వార్టర్స్‌కు వస్తుండగా ప్రమాదం



వంశీకృష్ణ

హసన్‌పర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో హసన్‌పర్తికి చెందిన లైన్‌మెన్ ఆకుల రాజేందర్ కుమారుడు వంశీకృష్ణ (31) మంగళవారం మృతి చెందినట్లు అక్కడి నేవీ అధికారులు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్థానికుల కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన ఆకుల రాజేందర్ - సునీత దంపతుల కుమారుడు వంశీకృష్ణ గుజరాత్ రాష్ట్రంలో కోస్టు గార్డు ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం కోస్టుగార్డు విధులు ముగించుకొని తన స్కూటీపై తిరిగి క్వార్టర్స్‌కు వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం వేగంగా ఢీ కొట్టడంతో జరిగిన ప్రమాదంలో వంశీకృష్ణ తల రోడ్డు డివైడర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు అక్కడి నేవి అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. అయితే వంశీకృష్ణ పార్థీవ దేహానికి పోస్టుమార్టం అనంతరం బుధవారం ప్రత్యేక అంబులెన్స్‌లో హసన్‌పర్తికి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వంశీకృష్ణ మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఎరువుల కొరత లేకుండా చేయడమే లక్ష్యం

జనగామ జిల్లా వ్యవసాయాధికారి రామారావు నాయక్



యూరియా కొనుగోళ్లను ప్రారంభిస్తున్న డీఏవో రామారావు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల కొరత రాకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని జనగామ జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా విక్రయ కేంద్రంను ఆయన ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా ఎరువుల విక్రయం నిర్విరామంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి, ఏడీఏ వసంతసుగుణ, మండల వ్యవసాయ అధికారి చంద్రన్‌కుమార్, జిల్లా వ్యవసాయ టెక్నికల్ అధికారి నిర్మల, డీసీసీబీబ్యాంకు మేనేజర్ మహబూబీ, సీఈవో మగ్దుమ్‌అలీ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ప్రశాంతం

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతగా జరిగింది. మంగళవారం వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 5 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం పూట నిర్వహించిన మొదటి సెషన్‌లో 1243 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1208 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం పూట నిర్వహించిన రెండవ సెషన్ పరీక్షలో 1133 మందికి గాను 1124 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 97.7 శాతం మంది ద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

రేపు పిల్లల కోసం గుండె వైద్యశిబిరం

పోచమ్మమైదాన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలోని ఎంజీఎం ఆస్పత్రిలో ఈ నెల 30వ తేదిన ఆర్‌బీఎస్‌కే, డైక్, అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్న 0-18 ఏళ్లలోపు పిల్లలకు ఉచితంగా టూడీఎకో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఎంజీఎంలోని పిల్లల ఓపీ విభాగం పైన డైక్ సెంటర్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంజీఎంలో గుండెపోటుతో రోగి మృతి



శ్రీనివాస్

వరంగల్ మెడికల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ న్యూశాయంపేట ప్రాంతానికి చెందిన పిక్కల శ్రీనివాస్ (43) అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం మంగళవారం ఉదయం ఎంజీఎం ఆస్పత్రికి వచ్చాడు. ఓపీ టికెట్ తీసుకొని పక్కనే ఉన్న ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌లో నీళ్లు తాగడానికి వెళ్లి అక్కడే పడిపోయాడు. అక్కడే ఉన్న కొందరు గుర్తించి వెంటనే ఎంజీఎం ఎమర్జెన్సీ క్యాజువాలిటీకి తరలించగా వైద్యులు చికిత్స చేస్తుండగానే శ్రీనివాస్ మృతి చెందాడు. గుండెపోటు రావడంతోనే శ్రీనివాస్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరులు పిల్లలు ఉన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6000	4600
పల్లికాయ (పచ్చిది)	5100	3100
కందులు	6521	4460
పెసళ్లు	7133	2800
పత్తి	6940	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14000	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	15200	11500
యూఎస్341ఏసీ	-	-
యూఎస్ 341 కొత్తది	15500	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



అమ్మో..రికా

మనోళ్లలో.. డిపోర్టేషన్ భయం!

ట్రంప్ ఆంక్షలతో అగ్రరాజ్యంలోని ఓరుగల్లు విద్యార్థుల్లో ఆందోళన

- చదువుతూ.. పార్ట్‌టైమ్ చేసే వారికి గండమేనని ప్రచారం
- నింబధనల ప్రకారం క్యాంపస్‌లో వారంలో 20గంటలే జాబ్ చేసుకునే అవకాశం
- పార్ట్‌టైం జాబ్స్ చేయకుండా అమెరికాలో ఉండటం కష్టమంటున్న విద్యార్థులు
- ఉమ్మడిజిల్లా నుంచి చదువుల కోసం అమెరికాకు ఐదారు వేల మందికి పైగా పయనం
- తగిన పత్రాలు లేకుండా.. అక్రమంగా ఉంటున్నవారిలో గుబులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అమెరికా.. యువతకు కలల శ్వేతసౌధం. ఆ దేశంలో ఉన్నత చదువులు పూర్తిచేసి.. అక్కడే స్థిరపడితే.. 'డాలర్ డ్రీమ్స్' నెరవేరుతాయని, తమకు బంగారు భవిష్యత్ ఉంటుందని చాలామంది భావిస్తారు. ఈ క్రమంలోనే ఎంతో మంది అమెరికా బాట పడుతున్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమ్యాటిక్స్‌తో పాటు మెడిసిన్ లాంటి కోర్సుల్లో డిగ్రీలు, పీజీల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సుమారు ఆరువేల మందికి పైగా విద్యార్థులు అగ్రరాజ్యం వెళ్లినట్టు అంచనా. వారిలో అధికశాతం మంది చదువుకుంటూనే పార్ట్‌టైం జాబ్ చేసుకుంటూ నెట్టుకొస్తున్నారు. అలాంటి వారికి ఇప్పుడు డిపోర్టేషన్ (స్వదేశానికి పంపడం) భయం పట్టుకుంది. అమెరికాకు వెళ్లే విద్యార్థుల్లో చాలా మంది ఎఫ్-1 వీసాపైనే ఉన్నారు. ఈ వీసాపై వెళ్లినవారు వారానికి 20గంటలు మాత్రమే పార్ట్‌టైమ్ జాబ్ చేసుకోవచ్చు. అదికూడా వారి క్యాంపస్‌లోనే. ఈ నిబంధనలను అతిక్రమిస్తే అమెరికా దౌత్య విధానం ప్రకారం వారిని ఆ దేశం నుంచి బయటకు పంపించేయవచ్చు. ఇటీవల అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్ ఇమ్మిగ్రేషన్‌పై కొరడా ఝుళిపిస్తుండటం.. సరైన పత్రాల్లేకుండా అక్రమంగా తమ దేశంలో ఉంటున్న వారిని కూడా గుర్తించి వారివారి దేశాలకు పంపిస్తుండటం లాంటి చర్యలతో మన విద్యార్థులు దిగులు చెందుతున్నారు.

అమెరికా వైపే ఓరుగల్లు యువత..

ఉన్నత చదువుల కోసం యువత అమెరికా బాట పడుతున్నారు. చదువుతూనే పార్ట్‌టైమ్ జాబ్ చేసుకోవచ్చనే ఆలోచనతో పాటు అమెరికాలో స్థిరపడితే భవిష్యత్‌కు తిరుగుండదన్న ఆశతో చాలా మంది ఉన్నత చదువుల కోసం అమెరికాకు పయనమవుతున్నారు. కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా తదితర దేశాలతో పోలిస్తే అమెరికా వీసా కోసం క్యూ కట్టే యువతే ఎక్కువగా ఉంటున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు ఆరువేల మందికి పైగా విద్యార్థులు చదువుల కోసం అమెరికా వెళ్లినట్టు అంచనా కాగా.. గ్రేటర్ వరంగల్ పరిధిలోని వారే అధికంగా ఉన్నారు. వీరితో పాటు జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, భూపాలపల్లి, ములుగు తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసమని అగ్రరాజ్యం బాట పడుతున్నారు. అమెరికాకు వెళుతున్నవారిలో ఎక్కువ శాతం ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం వెళ్లినవారే ఉన్నారు. ఇన్నాళ్లు సాఫీగా సాగినప్పటికి ట్రంప్ రెండోసారి అమెరికా దేశానికి అధ్యక్షుడైన తరువాత ఇమ్మిగ్రేషన్‌పై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. విదేశీ విద్యార్థుల వీసా నిబంధనలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో అమెరికాలో చదువు కోసం వెళ్లిన విద్యార్థుల్లో ఆందోళన కనిపిస్తోంది.

ట్రంప్ ఆంక్షలు.. విద్యార్థుల్లో డిపోర్టేషన్ భయం

అమెరికాకు వెళ్లే విద్యార్థుల్లో చాలామంది ఎఫ్-1 వీసాపైనే ఉన్నారు. ఈ వీసాపై వెళ్లినవారు వారానికి 20గంటలు మాత్రమే పార్ట్‌టైమ్ చేసుకోవచ్చు. అదికూడా వారి క్యాంపస్‌లోనే పార్ట్‌టైమ్ జాబ్స్ చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనను అతిక్రవిుస్తే అమెరికా దౌత్య విధానం ప్రకారం వారిని దేశం నుంచి బయటకు పంపించేయవచ్చు. గతంలో ఈ నిబంధన ఉన్నప్పటికి పెద్దగా ఎవరు పట్టించుకోలేదు. అయితే ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ ఇవిుగ్రేషన్‌పై కొరడా ఝులిపిస్తున్నారు. అక్రమంగా అమెరికాలో ఉంటున్న.. పత్రాలు సరిగ్గా లేకున్నా ఇక్కడే ఉంటున్న వారిని కూడా గుర్తించి వారి స్వదేశాలకు పంపిస్తున్నారు. అమెరికాలో ట్రంప్ వలసవాదులను ఏరివేసేందుకు ప్రత్యేకంగా బలగాలను రంగంలోకి దింపారు. మెక్సికో వలసవాదులే ట్రంప్ లక్ష్యమైనప్పటికి నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న ప్రతి ఒక్కరిపై అక్కడి అధికారులు ఫోకస్ చేస్తున్నారని అమెరికాలో చదువుతున్న మన విద్యార్థులు వాపోతున్నారు. 'పోలీసుల తనిఖీలు పెరిగాయి. దొరికితే మీ లైఫ్ స్పాయిల్ అవుతుంది. మా సంస్థకు 50వేల డాలర్ల వరకు జరిమానా విధిస్తారు. మా వ్యాపార లైసెన్స్‌లు రద్దు చేస్తారు. మీకు ఇలా చెప్పటం బాధగానే ఉంది, కానీ పరిస్థితులు కుదుట పడేవరకు పనిలోకి రావద్దు' అంటూ ఆయా కంపెనీల మేనేజర్లు ఫోన్లు చేసి విద్యార్థులకు చెప్పేస్తున్నారట. దీంతో ఏం చేయాలో తోచక చాలా మంది విద్యార్థులు ఇంటికే పరిమితం అవుతున్నారు. కాగా, ట్రంప్ ఆంక్షల మధ్య అమెరికాలో వరంగల్ విద్యార్థులకు ఆర్థిక కష్టాలు మొదలయ్యాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా డాలర్ డ్రీమ్‌తో అమెరికాలో అడుగు పెట్టిన పేద, మధ్యతరగతి పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు దిగులు చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ట్రంప్‌కు ఫోన్‌చేసి శుభాకాంక్షలు చెప్పడంతో పాటు స్నేహహస్తం చాటిన క్రమంలో ట్రంప్ తన నిర్ణయాల్లో మన దేశ విద్యార్థులకు సడలింపునిస్తారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

పార్ట్‌టైమ్ జాబ్స్‌తోనే చదువు..

అమెరికా వీసా లభిస్తే చాలు.. ఎలాగోలా జీవితంలో స్థిర పడిపోవచ్చనే ధీమా విద్యార్థుల్లో ఉంది. తల్లిదండ్రులు కూడా ఇలాగే ఆలోచిస్తున్నారు. పిల్లలను అమెరికాకు పంపిస్తే చాలు.. అక్కడ ఏదో ఒక పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకుని తన కాళ్ల మీద తాను నిలబడుతాడనే ఆశతో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ నుంచి వెళుతున్న విద్యార్థుల్లో చాలామంది ఉదయం తరగతులు కాగానే, సాయంత్రం పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకుంటున్నారు. అందరికి వారివారి క్యాంపస్‌లో ఉద్యోగాలు లభించవు కాబట్టి అక్కడి విద్యార్థులు పెట్రోల్ బంకులు, రిటైల్ స్టోర్స్ రెస్టారెంట్లు, గ్రోసరి స్టోర్స్, లిక్కర్ మార్ట్, హోటల్స్, షాపింగ్ మాల్స్ తదితర వాటిల్లో అనధికారికంగా పని చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో గంటకు సుమారు ఏడెనిమిది డాలర్ల వరకు పార్ట్‌టైమ్ వేతనం లభిస్తుంది. అంటే సుమారు గంటకు రూ.750వరకు సంపాదన ఉంటుందని ఓ విద్యార్థి తెలిపారు. ఇలా రోజుకు ఆరు గంటల వరకు జాబ్ చేస్తు రోజుకు సుమారు రూ.5వేల వరకు ఆదాయం వస్తుంది. ఇలా వచ్చిన డబ్బులతోనే చాలమంది విద్యార్థులు వారి చదువులు, ఇతర ఖర్చులకు వాడుకుంటున్నారు. చదువుతో పాటు పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకునే అవకాశం ఉండటంతోనే చాలమంది అమెరికా చదువుపై క్రేజీ పెంచుకుంటున్నారని ఓ ఎన్ఆర్ఐ అభిప్రాయపడ్డారు.





నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి


సూపర్ స్పెషాలిటీ అస్పత్రిపై కదలిక

- 31న అస్పత్రి నిర్మాణం, వైద్య సేవలపై అధికారులతో సీఎం సమీక్ష
- కడియం శ్రీహరి నేతృత్వంలో సీఎంను కలిసిన ఓరుగల్లు ఎమ్మెల్యేలు
- మడికొండ డంపింగ్ యార్డు గురించీ వివరించిన ప్రజాప్రతినిధులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కుగా ఉన్న వరంగల్ ఎంజీఎం అస్పత్రిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. 24 అంతస్తుల్లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ అస్పత్రిని పూర్తి చేసేందుకు ఈ నెల 31న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష ఏర్పాటు చేశారు. 'అడ్డంకులు తొలిగేదెన్నడో' అనే శీర్షికన ఈ నెల 18వ తేదీన సూపర్ స్పెషాలిటీ అస్పత్రి పనుల స్థితిగతులపై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. అలాగే గతంలో కూడా సూపర్‌స్పెషాలిటీ అస్పత్రిని పూర్తి చేసి పేదలకు వైద్యసేవలు అందించేందుకు చొరవ చూపాలని పలుమార్లు కథనాలను ప్రచురించిన విషయంతెలిసిందే. దీంతో మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో పరకాల, భూపాలపల్లి, పాలకుర్తి, వర్ధన్నపేట, డోర్నకల్ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, యశస్వినిరెడ్డి, నాగరాజు, రామచంద్రునాయక్ తదితరులు మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఎంజీఎం పరిస్థితిని వివరించటంతో పాటు అనుబంధంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ అస్పత్రిని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 31వ తేదీన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో సూపర్ స్పెషాలిటీ అస్పత్రిపై సమీక్ష ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రాంపూర్ యార్డు దుస్థితి, ఏడు గ్రామాల ప్రజల అవస్థలపై కడియం శ్రీహరి, ఇతర ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. డంపింగ్ యార్డు పొగ వల్ల గాలి, తాగునీరు కలుషితమవుతోందని, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు శ్వాసకోశ సమస్యలకు గురవుతున్నారని వివరించారు. వెంటనే డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు వరంగల్ నగరంలో చేపట్టబోయే భూగర్భ డ్రెయినేజీ కి సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేయటంతో పాటు త్వరగా పనులు చేపట్టాలని, వరంగల్ ఔటర్ రింగు రోడ్డుకు సంబంధించిన అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించాలని కోరారు.

ఎమ్మెల్యేల విజ్ఞప్తికి స్పందించిన సీఎం సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్‌ఘనపూర్‌ను మునిసిపాలిటీగా మార్చినందుకు సీఎంకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఈ బృందంలో లేకపోవటం చర్చనీయాంశంగా మారింది.



చరిత్ర

శిలాశాసనం ఉన్న ఉర్సుగుట్ట


శిథిలమవుతున్న శిలాకావ్యం

- రక్షణకు నోచుకోని ఉర్సుగుట్టపై ఉన్న 'సిద్ధోద్వహం'
- శిలపై ప్రేమకావ్యం రచించిన నృసింహ కవి
- దెబ్బతింటున్న పురాతన సంపద
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖలు

హనుమకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగర శివార్లలోని చారిత్రక ఉర్సుగుట్టపై ఉన్న శిలాకావ్యం సరైన రక్షణ లేక దెబ్బతింటోంది. ఈ శిలపై చెక్కిన ఈ ప్రబంధానికి విశిష్టమైన చారిత్రక నేపథ్యం ఉంది. ఇలాంటి కావ్య శాసనం భారత దేశంలోనే మరెక్కడా కనిపించదు. దీనినే ఉర్సు గుట్టశాసనంగా పిలుస్తారు. వరంగల్‌లోని చారిత్రక విశేషాల్లో, శిల్ప సంపదలో ఇదొక్కటి. సిద్ధోద్వహం పేరుతో ప్రసిద్ధి చెందిన ఈ శిలా కావ్యాన్ని కాకతీయుల కాలం నాటి గొప్ప సంస్కృత కవి విశ్వేశ్వర పండితుని పుత్రుడు నృసింహకవి దీనిని లిఖించనట్టుగా చెబుతారు. ఇదొక ప్రేమ కావ్యం. ఒక రోజు సిద్ధుడు తన ప్రియురాలు పక్కపై లేనిది చూసి విరహవేదనతో వెతుకుతూ పోతాడు. సిద్ధునకు తన ప్రియురాలి ప్రథమ సమాగమం ఆమె చెలులతో నాట్య కలాపంలో ఉండగా.. తండ్రి పిలుపు రావడంతో ఆమె అంతఃపురానికి వెళుతుంది. ఇది తెలుసుకొని సిద్ధుడు తన విరహాన్ని చెప్పి వర్తమానం పంపుతాడు. దాంతో మరుసటి రోజు రాత్రి తన భవనంలోకి ఎవరి కంటపడకుండా రావలసిందిగా కిన్నెర బదులిస్తుంది. సిద్ధుడు భవనంపైకి ఎక్కుతుండగా పట్టుబడి జైలుకు వెళతాడు. కొన్ని రోజుల తర్వాత కిన్నెర తండ్రి అతనిని యక్షునిగా తెలుసుకొని తన కుమార్తెను ఇచ్చి వివాహం చేస్తాడు. ఇది సంక్షిప్తంగా వీరి ప్రేమ కథ. ఈ కావ్యంలో సూర్యాస్తమయం, విరహం వర్ణనలు, వివాహానంతరం సంభోగ శృంగార వర్ణనలు రసోత్తరంగా ఉంటాయి. ఈ శాసన కావ్యం చివర విశ్వేశ్వర పండితుని పుత్రుడు నరసింహార్షి కవి విరచింతగా పేర్కొనబడి ఉంది. ఇందులో 60 శార్దూల విక్రీడిత వృత్తాలు, 2 స్రగర్ధలు మొత్తం 62 శ్లోకాలున్నాయి.

ఈ కావ్యానికి కవి పేరు సూచించలేదు. అయినా దీనిలోని కథా సందర్భాలను బట్టి ఈ శిలా ప్రబంధం సిద్ధోద్వాహం పేరుతో ప్రముఖ శాసన పరిష్కర్త డాక్టర్ పీవీ పరబ్రహ్మశాస్త్రి పరిష్కరించారు. ఈ శిలాకావ్యాన్ని 1968లో రాష్ట్ర పురావస్తు శాఖ సిద్ధోద్వాహం పేరుతో ప్రచురించింది. ప్రచురణతోనే పురావస్తుశాఖ సరిపెట్టుకుంది కానీ ఈ శిలాకావ్యాన్ని పరిరక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కేంద్ర పురావస్తుశాఖ సైతం విస్మరించింది. దీనితో ఈ కావ్య శాసనం క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటున్నది. విచ్చలవిడి క్వారీ వల్ల ఉర్సు గుట్ట ఇప్పటికే సగానికిపైగా తరిగి పోయింది. దీనిపై ఉన్న ఈ వారసత్వ సంపద క్రమంగా దెబ్బతింటోంది. ఇప్పటికైనా ఈ అపురూప కావ్యశాసనాన్ని కాపాడాలని నగర వాసులు, చరిత్రకారులు కోరుతున్నారు.

ఎవరీ నృసింహ కవి..



నృసింహకవి చెక్కిన శిలా కావ్యం

నృసింహకవి కాకతీయుల కాలంలో గొప్ప సంస్కృత పడింతుడు. ఆయన సిద్ధోద్వాహంతో పాటు కాదంబరి కళ్యాణం అనే నాటకాన్ని కూడా రాశారు. కాదంబరి కావ్య కథను ఎనిమిది అంకాలుగా తీర్చిదిద్దాడు. ఇందులో మహాస్వేత పుండరీకుల ప్రేమకథ అంతర్నాటకంగా చెప్పడం విశేషంగా కనిపిస్తుంది. కాకతీయుల కాలంలో అనేక మంది సంస్కృత కవులు ఉన్నారు. సాధారణంగా కావ్య రచన ఆనాడు అందుబాటులో ఉండే తాళపత్రాలుపై రాసేవారు. కాకతీయుల కాలంలో రాళ్లపై శాసనలు చెక్కడం విస్తృతంగా కనిపిస్తుంది. ఇదే క్రమంలో కవులు సైతం తమ రచనలను రాయడానికి శిలలనే ఎన్నుకున్నారనడానికి ఈ సిద్ధద్వాహమే ప్రత్యక్ష ఉదాహరణ.

ఎండాకాలం రాక ముందే ఎడారి

మానేరు ఎండిపోయింది. ఎండాకాలం రాకముందే ఎడారిగా మారింది. మల్హర్ మండలం తాడిచర్లలోని మానేరు ప్రతీ వర్షాకాలంలో నీటితో కళకళలాడుతుంది. ఫిబ్రవరి వరకూ నీటి ప్రవాహం కనిపిస్తూ ఉంటుంది. అలాంటి మానేరు రెండేళ్లుగా జనవరి ఆరంభం నుంచే బోసిపోతోంది. ఎగువ ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు కావడం, చెక్‌డ్యామ్‌ను నిర్మించడంతో దిగువకు నీరు రాక ఈ పరిస్థితి ఉంటోంది. ఇక ఈసారి కూడా ఎండాకాలం రాకముందే చుక్కనీరు లేకుండా ఎడారిగా మారింది. మరోవైపు నీటి ప్రవాహం లేక పరివాహక రైతులు పంటలకు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. - మల్హర్, ఆంధ్రజ్యోతి



తాడిచర్ల వద్ద ఎడారిని తలపిస్తున్న మానేరు

అల్లం మురబ్బా.. రబ్బా..

- కాసింత తీపి.. కాసింత కారం
- నోరూరిస్తున్న పాత కాలం తీపి చిక్కి
- 40ఏళ్లుగా విక్రయిస్తున్న చిరువ్యాపారులు





మాదాసి ప్రకాశ్


జూలైవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అల్లం మురబ్బా... అల్లం మురబ్బా. ఉదయం పార్కుల్లో, రద్దీగా ఉండే నాలుగు కూడళ్లలో.. అప్పుడప్పుడు... వీధుల్లో.. ఈ పదం వినిపిస్తుంది. చిరువ్యాపారి స్టీల్ ప్లేట్‌లో అందంగా పేర్చుకొని అమ్ముతుండడం మనకు తరుచూ కనిపించే దృశ్యం. ఇదొక పాతకాలపు చిక్కి. ఔషధ గుణాలున్న దీనిని తింటే ఆరోగ్యానికి మంచిదని ఇప్పటికీ చాలా మంది కొనుగోలు చేస్తుంటారు. ముఖ్యంగా వృద్ధులు ఎక్కువగా కొంటుంటారు. అల్లం మురబ్బా అమ్మకం వృత్తిగా జీవిస్తున్నవారు ఇప్పటికీ నగరంలో ఉన్నారు.

40 ఏళ్లుగా అమ్మకం

40 సంవత్సరాలుగా అల్లం రబ్బాను అమ్ముతున్నవారు అక్కడక్కడ కనిపిస్తారు. అలాంటి వారిలో ఒకరు మాదాసి ప్రకాశ్. ఆయన వయస్సు 64 సంవత్సరాలు. వరంగల్ కాశీబుగ్గలో నివాసం ఉండే ప్రకాశ్‌కు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. ముగ్గురికీ పెళ్లిళ్లయ్యాయి. గత 40 ఏళ్లుగా అల్లం మురబ్బాను అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయన రోజు ఉదయం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో అల్లం మురబ్బాతో దర్శనమిస్తారు. అల్లం మురబ్బా. రబ్బా అంటూ తిరుగుతూ వాకింగ్ చేసే వారికి అమ్ముతుంటారు. ఇక్కడే కాదు ...వరంగల్, హనుమకొండ బస్టాండ్లు, కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్లు, పార్కులు, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో కాలినడకన తిరుగుతూ విక్రయిస్తుంటాడు. ప్రకాశ్ ఒక్కడే కాదు చాలా మంది అల్లం రబ్బా అమ్ముతూ పొట్టపోసుకోవడం కనిపిస్తుంది. అయితే రోజు తాను 70 వరకు అల్లం మురబ్బాను విక్రయిస్తానని ప్రకాశ్ చెబుతున్నారు. చెక్కరతో తయారు చేసిన అల్లం మురబ్బాను రూ.10, బెల్లంతో తయారు చేసిన అల్లం మురబ్బాను రూ. 20కి అమ్ముతానని, రోజంతా ఎండనకా, వాననకా కాళ్లరిగేలా తిరిగి అవిస్తే దీని వల్ల సుమారు రూ. 1000 వరకు వస్తాయని చెబుతున్నారు. తయారీ ఖర్చు పోను నికరంగా రూ.400 నుంచి రూ.500 వరకు మిగులుతుందని, తాను ఈ అల్లం రబ్బాను రూ.1ధర ఉన్నప్పటి నుంచి అమ్ముతున్నానని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం మారిన కాలంతో గతంలో ఎక్కువ మంది అల్లం రబ్బా అంటే ఇష్టపడేవారు తగ్గారని ఆయన చెబుతున్నారు.

అల్లం మురబ్బా అంటే.. ప్రయోజనాలేంటంటే..

అల్లం ముక్కలను చక్కెరలో లేదా బెల్లంలో ఉడికించి తయారు చేసిన ఇంటి చిక్కి. దీనిలో అల్లం కలపడం వల్ల కొంచెం తీపిగా.. కొంచెం కారంగా ఉంటుంది. అల్లం ముక్కలను చిన్నచిన్న ముక్కలుగా కోసి నీటిలో ఉడికిస్తారు. అందులో కొంత శొంఠి, విరియాలను కూడా కలుపుతారు. ఆ తర్వాత వాటిని చెక్కెర లేదా బెల్లంతో కలిపి మళ్లీ ఉడికిస్తారు. నీరు ఆవిరి అయి పాకం చిక్కబడిన తర్వాత ఒక ప్లేట్‌లో పోసి చల్లారుస్తారు. ముక్కలుగా కోసి నిల్వ చేస్తారు. ఈ అల్లం మురబ్బా తినడం వల్ల పలు ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉండే అల్లం వల్ల జలుబు, దగ్గు లాంటి సమస్యలను తగ్గుతాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఆహారం జీర్ణం కావడానికి తోడ్పడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కొన్ని రకాల క్యాన్సర్లను నిరోధించడంలో సహాయపడుతుంది. రోజుకు ఒకటి రెండు ముక్కలు అల్లం రబ్బాను తీసుకోవచ్చు. నేరుగా తినవచ్చు. లేదా టీలో కలిపి తాగవచ్చు. అయితే అల్లం మురబ్బాను అధికంగా తీసుకోవడం కూడా మంచిది కాదని చెబుతున్నారు.



సూర్యాస్తమయం.. సుందర దృశ్యం..

సూర్యాస్తమయ సమయాన.. అరువర్ణధారియైన ఆ సూరీడు ధగ ధగ మెరుస్తూ కొండల చాటు నుంచి అదృశ్య మవుతున్న వేళ.. వేటకు వెళ్లిన పక్షులు గూళ్లకు చేరుతున్న సుందర దృశ్యమిదీ. మంగళవారం హనుమకొండ అమ్మవారిపేట చెరువు వద్ద కనపించిన ఈ ప్రకృతి రమణీయ దృశ్యం పర్యావరణ ప్రేమికులను కట్టిపడేసింది.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్‌ఫొటో గ్రాఫర్, హనుమకొండ

క్రీడలతోనే యువతకు సంపూర్ణ ఆరోగ్యం

కేయూ క్యాంపస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే యువత సంపూర్ణ ఆరోగ్యంగా ఎదుగుతారని కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యుడు బి.సురేశ్‌లాల్ చెప్పారు. ఏబీవీపీ నేతృత్వంలో రెండు రోజులుగా వర్సిటీ క్రీడామైదానంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న పోటీలను మంగళవారం ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ ముఖ్యఅతిథిగా హాజరై టాస్ వేసి ప్రారంభించారు. క్రీడలతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. యువతతోనే దేశాభివృద్ధి సాధ్యం అవుతోందన్నారు. యువత ఏకాగ్రతతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. లక్ష్యం ఏర్పరుచుకుని ముందుకు సాగాలని సూచించారు. డ్రగ్స్‌తో జీవితాలను చిత్తు చేసుకోవద్దని హెచ్చరించారు. మహానుభావులు అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కేయూ ఇన్ చార్జి నిమ్మల రాజేశ్, రాష్ట్ర నాయకులు అంబాల కిరణ్, ప్రెసిడెంట్ సాయి , గేమ్స్ కన్వీనర్ గట్టు ప్రశాంత్, కో కన్వీనర్ సంయుక్త, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూజిత క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మంత్రి సురేఖకు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గం

మంత్రిని కలిసిన టీయూడబ్ల్యూజే కార్యవర్గం

రాంనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను, సీపీ అంబర్ కిశోర్‌లను మంగళవారం టీయూడబ్ల్యూజే (హెచ్ -143) నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది. జర్నలిస్టుల సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, అర్షం రాజ్‌కుమార్, కోశాధికారి పొగాకుల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఆరెల్లి కిరణ్, సత్యానారాయణ, గోకారపు శ్యామ్, సిరిమల్లె సదానందం, బొడిగె శ్రీనివాస్, దొమ్మటి శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులు మైదం సుధాకర్, బొమ్మగాని ఆదర్శ్, పోడిశెట్టి కరుణాకర్, అల్వాల నరేందర్, స్వర్గం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు రద్దు చేయాలి

కమిషనర్‌కు ప్రజాసంఘాల నాయకులు వినతి పత్రం అందజేత

వరంగల్ కార్పొరేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అజంజాహి మిల్లు కార్మికుల యూనియన్ కార్యాలయం భూమిని ఆక్రమించి బల్దియా నుంచి అక్రమంగా కాసం పుల్లయ్య షాపింగ్ మాల్ యజమానులు తీసుకున్న అనుమతులను రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకులు మంగళవారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతి పత్రం సమర్పించారు. వరంగల్ హంటర్‌రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వివాదంలో ఉన్న భూమిని ఆక్రమించినట్లు వినతిలో పేర్కొన్నారు. ఇంకా వరంగల్ బట్టల బజార్, వరంగల్ చౌరస్తా, పిన్నవారి వీధి, సంతోషిమాత ప్రాంతంలో మున్సిపల్ చట్టాలను తుంగలో తొక్కి బహుళ అంతస్తులు నిర్మిస్తున్న యజమానులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ప్రజాసంఘాల నాయకులు గంగుల దయాకర్, కొణతం కృష్ణ, ఆకెన వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల లక్ష్మణ్, బి.రమాదేవి, కాంపెల్లి ప్రవీణ్, గొసికొండ రాజు, గుడికందుల క్రాంతికుమార్ తదితరులు ఉన్నారు.

రేపు ఫార్మసీ విభాగంలో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జనవరి 30న కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం నేతృత్వంలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ తెలిపారు. మంగళవారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రిన్సిపాల్ ప్రసాద్‌లు సదస్సు గోడ పత్రికను ఆవిష్కరించారు. సదస్సు వివరాలను వెల్లడించారు. 'రీసెంట్ అడ్వాన్స్ ఇన్ ఫార్మస్యూటికల్ సైన్సెస్-2025' అనే అంశంపై జరిగే సదస్సుకు న్యూఢిల్లీలోని యూజీసీ, అసోషియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా సహకారంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీవోఎస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ జే.కృష్ణవేణి, ప్రొఫెసర్ వై.నరసింహారెడ్డి, డాక్టర్ షయేదా, డాక్టర్ స్వరూపరాణి, డాక్టర్ బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో రోడ్డు భద్రతపై వర్క్‌షాప్

హనుమకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'వరంగల్ నిట్‌లో రోడ్డు ప్రమాదం జరగకుండా అరికట్టడంలో ఎదురయ్యే సవాళ్లు - దేశంలో సురక్షితమైన రోడ్డు భద్రతా వ్యవస్థ రూపకల్పన' అనే అంశంపై మంగళవారం వర్క్‌షాప్ జరిగింది. వరంగల్ నిట్, టుండ్ యూనివర్సిటీ (స్వీడన్) సంయుక్తంగా చేపట్టిన ప్రాజెక్టులో బాగంగా ఈ వర్క్‌షాపును నిర్వహించారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ స్పార్క్ పథకం కింద పథకానికి నిధులను సమకూర్చుతోంది. ఈ ప్రాజెక్టుకు వరంగల్ నిట్ సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కేవీఆర్ రవిశంకర్, ప్రొఫెసర్ బి.కడాలి రఘురాం సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు రవాణా అధికారులు డీసీపీ డాక్టర్ పుష్పాల శ్రీనివాస, ఆర్అండ్‌బీ ఈఈ సురేష్, భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), ట్రాఫిక్ పోలీసు విభాగం, క్యూబ్ హైవే కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ విద్యార్థుల ఫీజులు తగ్గించాలి

కేయూ క్యాంపస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ భారీగా పెంచిన పీహెచ్‌డీ విద్యార్థుల ఫీజులను తగ్గించాలని స్కాలర్స్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి తమ సమస్యలపై స్కాలర్స్ నేతలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేయూ జేఏసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత కత్తెరపల్లి దామోదర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాచర్ల శరత్‌చంద్రలు మాట్లాడుతూ.. యేటా పీహెచ్ అడ్మిషన్ రెన్యువల్ అపరాధ రుసుం ఫీజుల 20 శాతానికి తగ్గించాలని, టాపిక్ చేంజ్ ఫీజు రూ.200కు తగ్గించాలన్నారు. థిసెస్ సబ్‌మిషన్ ఫీజులను రూ.12,500కు తగ్గించాలని అన్నారు. కాల పరిమితి ఫీజులను తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ అర్బన్‌జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అరూరి రంజిత్, విద్యార్థి విభాగం నేతలు కలకోట సుమన్, కందికొండ తిరుపతి, కొనుకటి ప్రశాంత్, పిన్నింటి విజయ్ కుమార్, జెట్టి రాజేందర్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మడికొండ ఎస్సై రాజ్‌కుమార్

మడికొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మడికొండ శివారులోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వద్ద మంగళవారం కార్మికులకు స్థానిక ఎస్సై రాజ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ జయరాజ్, పోలీసులు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, 100 డయల్, 1930 డయల్ ప్రాముఖ్యత, మత్తుపదార్థాలు సేవించడం వల్ల జరిగే అనర్థాలను కార్మికులకు వివరించి అవగాహన కల్పించారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన జాతీయ అధ్యక్షుడు అనిల్‌కుమార్



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న అనిల్‌కుమార్

వడ్డెపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేసి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్‌కుమార్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు.. వేల గొంతులు మహా సాంస్కృతిక ప్రదర్శనకు మద్దతుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు దామెర కరుణ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు డప్పులతో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొంగర అనిల్‌కుమార్, దామెర కరుణ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంశం న్యాయబద్ధమైనదేనని, రాష్ట్రాలు అమలు చేయవచ్చని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు నిచ్చిందని చెప్పారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిగా వర్గీకరణను అమలు చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని, జాప్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ ప్రదర్శనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన జాతీయ ఉపాధ్యక్షుడు డీఎస్. ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసారపు సారయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరు సమ్మయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వస్కుల ఉదయ్‌కుమార్, రాష్ట్ర జిల్లా నాయకులు గుర్రం శ్రావణి, ఎలిషా, లక్కాల సత్యకుమారి, తాళ్లపెల్లి రాజశేఖర్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ తదితరులు పాల్గొన్నారు . లింగాల ఇమానియల్ కళా బృందం ఆట పాటలతో అలరింప చేశారు.

ప్రణాళికతో చదివితే ఒత్తిడి దూరం

డీఎంహెచ్‌వో అప్పయ్య



పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లం అప్పయ్య

మడికొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ముందస్తు ప్రణాళిక ప్రకారం చదివితే పోటీ పరీక్షలను ఎదుర్కొన్నపుడు ఎలాంటి మానసిక ఒత్తిడి ఉండదని డీఎంహెచ్‌వో ఎ. అప్పయ్య ఉద్బోధించారు. మంగళవారం మడికొండలోని బాలికల గురుకులంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అప్పయ్య పాల్గొని ఐఐటీ, జేఈఈ, మెయిన్స్, నీట్ పరీక్షలను ఎదుర్కొడానికి విద్యార్థులకు ముందస్తు ప్రణాళిక గురించి అవగాహన కల్పించారు. మెంటల్ హెల్త్ ప్రోగ్రాం మానసిక నిపుణుడు డాక్టర్ ప్రహసిత్ వివిధ మానసిక పరమైన ఒత్తిడిని ఎలా జయించాలో విద్యార్థులకు వివరించారు. మానసిక ఆరోగ్య పరమైన సలహాల కోసం 14416 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కడిపికొండ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీదేవి, డాక్టర్ సంతోష్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి, సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్ వెంకటస్వామి, సిస్టర్లు కుమారి, లోరా, రూపవతి, రోజి, విజయ కుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిట్ ఫండ్ చైర్మన్‌పై

కేసు నమోదు

హసన్‌పర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కేయూ పోలీసు స్టేషన్ పరిధి గోపాల్‌పూర్ శివారులోని ఓ ప్రైవేటు కంపెనీ చైర్మన్‌తో పాటు అతడి వద్ద పనిచేసే మరో వ్యక్తి వడ్డె రాజుపై కేసు నమోదు చేసినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ రవిందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన ధర్మల ప్రతాప్.. గోపాల్‌పూర్‌లోని ఓ ప్రైవేటు చిట్‌ఫండ్‌లో 2020లో యేడాది పాటు రూ.5లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాడు. యేడాది తరువాత డబ్బులు ఇవ్వకుండా మరో యేడు వాయిదా వేసి 2 శాతం వడ్డీ ఇచ్చినట్లు బాధితుడు తెలిపాడు. తిరిగి మళ్లీ గడువు ముగిసిన తరువాత డబ్బులు ఇవ్వమంటే ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతూ వాయిదాలు వేసి ఇబ్బందులకు గురిచేసినట్లు బాధితుడు తెలిపారు. ఈ క్రమంలోనే ఈ నెల 27న బాధితుడు డబ్బుల కోసం గోపాల్‌పూర్‌లోని ప్రైవేటు చిట్‌ఫండ్ చైర్మన్‌ను కలిసినట్లు తెలిపారు. దీంతో చిట్‌ఫండ్ చైర్మన్.. అతడి అనుచరుడు డబ్బులు ఇవ్వకుండా నానా బూతులు తిట్టడమే కాకుండా బెదిరింపులకు పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

అనుమతుల్లేని స్కూళ్లను మూసివేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న శ్రీచైతన్య స్కూళ్లను మూసివేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఈవో వాసంతికి అనుమతుల్లేని శ్రీచైతన్య పాఠశా లలపై ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతుల్లేకుండా శ్రీచైతన్య బోర్డులు పెట్టి మరీ పాఠశాలలను నిర్వహిస్తున్నారని, అలాంటి అనుమతుల్లేని పాఠశాలలను గుర్తించి మూసివేయాలని రాజేష్ డిమాండ్ చేశారు. సంఘం టౌన్ సెక్రెటరీ రాకేష్, అరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ తెలంగాణ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు కొలిపాక సంగీత డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని కలిసి ప్రాతినిధ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఇంగ్లిష్ సబ్జెక్టులో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం గురువారం సాయంత్రం 4గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన కోరారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గద్దర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ప్రతినిధులు

వడ్డెపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధనౌక దివంగత గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, తెలంగాణ సమాజానికి, ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని గద్దర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ జిలుకర శ్రీనివాస్, కో కన్వీనర్ గాజాల గోవర్ధన్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను ఖండిస్తూ గద్దర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో గద్దర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు కొండ్ర నర్సింగరావు, దూడెల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ఇద్దరికి పదోన్నతి

కేయూ క్యాంపస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కేయూలో ఇద్దరూ సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లులుగా పదోన్నతి కల్పి స్తూ మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్మసీ కళాశాల సీనియర్ అసిస్టెంట్ డీసీఎం రాజు, లా కళాశాల సీనియర్ అసిస్టెంట్ ఆర్.స్వరూపరాణిలకు ఉత్తర్వులను అందజే సి అభినందించారు. వారిని పలువురు ఉద్యోగ సంఘాల నేతలు అభినందించారు.

ఎన్‌సీసీ జవాన్లకు కంప్యూటర్ ఉపయోగకరం

కేయూ క్యాంపస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ జవాన్లకు కంప్యూటర్ పనిచేసుకోవడం సులభమని కేయూరిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి చెప్పారు. మంగళవారం కేయూ కంప్యూటర్ సైన్స్ విభాగంలో 'ఇంటెన్సివ్ ప్రోగ్రాం ఫ్రం ఎక్సెల్ టై పవర్ బీఐ ఫర్ ఎన్‌సీసీ' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి హాజరై 'ఆటోమేషన్ టాస్క్ విత్ మాక్రోస్' అనే అంశంపై విస్తృత ఉపన్యాసం చేశారు. రోజువారి పనుల్లో కంప్యూటర్ ప్రోగ్రాంలలో మాక్రోలను వినియోగించడంవల్ల వ్యవహారాల రికార్డింగ్ సాఫీగా జరుగుతోందని అన్నారు. దోషాల నివారణ, నిర్ణయాలు సరిగా జరుగుతాయని చెప్పారు. జీతభత్యాల చెల్లింపునకు ఉపయోగపడుతుందన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి బి.రమ, అధ్యాపకురాలు డాక్టర్ సలోని పాతిమా, ఎన్‌సీసీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు సంకీర్తనా మండలి శోభాయాత్ర



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బచ్చు రాధాకృష్ణ

వడ్డెపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యేక పర్యవేక్షణలో వికాస తరంగిణి హనుమకొండ- వరంగల్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉదయం 9 గంటలకు సంకీర్తనా మండలి శోభాయాత్రను నిర్వహించనున్నట్లు వికాస తరంగిణి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఉపాధ్యక్షుడు డాక్టర్ చాడా సుభాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డిలు మాట్లాడారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వరకు 10 వేల మందితో నిర్వహించే నృత్యగాన కచేరి, శోభాయాత్రను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభిస్తారని పుర ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వికాస తరంగిణి ప్రతినిధులు ప్రొఫెసర్ ప్రభాకర్‌రెడ్డి, సుందర్‌రావు, తిరుమల్‌రావు, ఎలగందుల రాజేందర్, మాలాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరి సభను జయప్రదం చేయాలి

వడ్డెపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 2న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో మధ్యాహ్నం 2 గంటలకు బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు నాయీ బ్రాహ్మణులంతా తరలి వచ్చి విజయవంతం చేయా లని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కోడెపాక రాజేందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కస్తూరి సతీష్ పిలుపు నిచ్చారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయాలకతీతంగా నాయీ బ్రాహ్మణులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్, నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు సింగారపు రమేష్, ఒల్లాజి రమేష్, కొత్తగట్టు రవి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించి డీఏను ప్రకటించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించి డీఏలను ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లాలోని వివిధ పాఠశాలలు, కేజీబీవీలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని సత్వరమే చెల్లించాలన్నారు. అలాగే ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి వి. రాంబాబు, ఎంఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్, నాయకులు విద్యాసాగర్, వీరబ్రహ్మేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ విద్యార్థులకు ఉద్యోగాలు

హసన్‌పర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులకు ప్రముఖ బహుళజాతి కంపెనీలో ఉద్యోగ అవకాశాలు లభించినట్లు కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెమినార్ హాలులో మంగళవారం జరిగిన ప్రాంగణ నియామకాల ప్రత్యేక క్యాంపస్ డ్రైవ్‌లో టాప్ మల్టీనేషనల్ ఐటీ ప్రొఫెషనల్ సర్వీసెస్ కంపెనీ ప్రైస్‌వాటర్ హౌస్ కూపర్స్‌లో రూ.4.2 లక్షల ప్యాకేజీతో ఐదుగు విద్యార్థులు, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కంపెనీలో రూ.3.65 లక్షల ప్యాకేజీతో 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. 2024-2025 బ్యాచ్ సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ సీఎస్ఎం, సీఎస్ఈ, సీఎస్ఎస్, సీఎస్ఓ, ఐటీ, ఈసీఈ, ఈసీఐ, ట్రిపుల్‌ఈ గ్రూపులకు చెందిన 17 మంది విద్యార్థులు బహుళజాతి కంపెనీలో సంవత్సరానికి రూ.4.65లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లుగా ఎంపికకావడం పట్ల కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్స్ ప్రొఫెసర్ వై.పురందర్, టీపీఓ డాక్టర్ టి.చంద్రబాయి, కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్ ఇ.కిరణ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.ప్రభాకరాచారి, అప్టిట్యూడ్ ట్రైనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు జి.ధనూష్, డి.శరత్, పి.సిధూర, పి.అరుణకుమారితో పాటు డీన్‌లు, హెడ్‌లు, బోధనబోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నెలకొన్న ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఎస్టీయూ భవన్‌లో జాక్టో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరు నెలలుగా ఈకుబేర్‌లో బిల్లులన్నీ పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్ డీఏలను మంజూరు చేసి, కొత్త పీఆర్సీని అమలు చేయాలన్నారు. అంతకుముందు వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. పర్వతరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.నందానంద్‌గౌడ్, పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చెన్నయ్య, ప్రధానకార్యదర్శి ఎం.చంద్రయ్య, జాక్టో భాగస్వామ్య పక్షాల నాయకులు కృష్ణుడు, శ్రీనివాస్, అంజయ్య, దానయ్య, హేమచంద్ర, డాక్టర్ సదయ్య, రాంబాబు, నాగరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రవీందర్

పుస్తకాల పంపిణీ

మడికొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని బాలుర గురుకులంలోని విద్యార్థులకు మంగళవారం వినూత్న లయన్స్ క్లబ్ కో ఆర్డినేటర్ రేవూరి రమణారెడ్డి బుక్స్, పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. బి.కుమారస్వామి, ఉపాధ్యాయులు, జయశ్రీ, డేవిడ్, రాజ్‌కుమార్, రాజిరెడ్డి, ఇందిర, ఎవాంజి లీన్ పీడీ రమేశ్, పీఈటీ నిరంజన్ పాల్గొన్నారు.

మంద కృష్ణకు శుభాకాంక్షలు

హసన్‌పర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగను మంగళవారం సివిల్ కాంట్రాక్టర్లు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన వారిలో బొక్క కుమార్, జన్ను సతీష్, సుదర్శన్, సీహెచ్. నర్సయ్య, మామిడి రవీందర్, అమర్, అశోక్, జి. నర్సయ్య తదితరులున్నారు.

బీజేపీ నియంతృత్వ విధానాలను తిప్పికొట్టాలి

కేయూ క్యాంపస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్య కాషాయికరణ, కేంద్రంలోని బీజేపీ నియంతృత్వ విధానాలను తిప్పికొట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు పిలుపునిచ్చారు. మంగళవారం కేయూ మొదటి గేటు ఎదుట పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 4, 5 తేదీల్లో పీడీఎస్‌యూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు భద్రాచలంలో జరుగుతాయని వెల్లడించారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సర్కార్ విద్య రంగ సమస్యలను విస్మరించిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రూ.7500కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు బకాయిలున్నాయని చెప్పారు. యూజీసీ ముసాయిదా వర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నాయన్నారు. వర్సిటీల్లో బోధన, బోధనేతర నియమకాలు చేపట్టాలని అన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకురాలు కావ్య, జిల్లా నేతలు వినయ్, పృథ్వీరాజ్, అనూష, సంగీత, పవన్ కల్యాణ్, గణేశ్, జ్యోతి, శ్రీజ, సాధన, మానస, స్వాతి, చందన తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర కౌన్సిల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరసింహారావు తదితరులు

ఉద్యమంలో భాగస్వాములు కావాలి

మడికొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 66 డివిజన్ల నుంచి సేకరించిన చెత్తను తీసుకువచ్చి మడికొండ, రాంపూర్ శివారులోని డంపింగ్ యార్డులో వేయడంతో లక్షల మెట్రిక్ టన్నుల చెత్త కొండలుగా పేరుకుపోయిందని, పేరుకుపో యిన చెత్తను కాలుస్తుండటంతో కార్చిచ్చులా మారి వెలువడుతున్న పొగ, విషవాయువులు మడికొండ, రాంపూర్, ఎలుకుర్తి తదితర చుట్టు ప్రక్కల గ్రామాలను కమ్మేస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోక పోవడంతో బాధితులు ఉద్యమబాట పట్టారు. అందులో భాగంగా మంగళవారం స్థానిక 46, 64 డివిజన్ల కార్పొరేటర్లు మునిగా ల సరోజన, ఆవాల రాధికారెడ్డిని కలిసి ఉద్యమంలో భాగస్వాములై తమవంతు బాధ్యతగా డంపింగ్ సమస్య పరిష్కారానికి కలిసి రావాలని కోరారు.

నృత్యంలో కొత్త ధోరణులకు శ్రీకారం చుట్టినవారొకరు, అంతరించిపోతున్న కళారూపానికి నవతరంలో ప్రాచుర్యం కల్పిస్తున్న వారు మరొకరు, మత్తుమందుల బారి నుంచి యువతను కాపాడడానికి పాటుపడుతున్న ఒక మహిళ, సంగీత రంగంలో ప్రయోగశీలి, గ్రామస్వరాజ్యం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం పరితపిస్తున్న గాంధీయవాది... ఈ ఏడాది పద్మ పురస్కారాలను అందుకోనున్న కొందరు విశిష్ట మహిళల పరిచయాలివి.

వికసిత పద్మాలు

కథక్‌లో విప్లవ కెరటం



"నృత్యం ఒక సజీవమైన కళారూపం. దానిలో నిరంతరం మార్పులు వస్తూనే ఉండాలి. అలాంటి మార్పులను మనం స్వాగతించాలి" అంటారు కుముదినీ రజనీకాంత్ లాఖియా. కథక్ నృత్యంలో 'రెబల్' అనే పేరు ఆమెకు ఉంది. ఈ సంగతి ఎవరైనా ప్రస్తావిస్తే "నేనెప్పుడూ సంప్రదాయాన్ని ఉల్లంఘించలేదు. అయితే ప్రజలను ఆకట్టుకోవడానికే పరిమితం కాకుండా సంప్రదాయ పరిధిలోనే మరింత కొత్తదనాన్ని వెతకడానికి ప్రయత్నిస్తూ ఉంటాను" అని చెబుతారామె. సమకాలీన కథక్ నృత్యానికి మార్గదర్శిగా ఖ్యాతిపొందిన 94 ఏళ్ళ కుముదిని 1930లో ముంబయిలో జన్మించారు. ఆమె తల్లి లీల శాస్త్రీయ గాయని. కుముదినిని ఏడేళ్ళ వయసులో కథక్ శిక్షణలో ఆమె తల్లి చేర్చారు. లాహోర్, అలహాబాద్, తదితర ప్రాంతాల్లో పలువురు గురువుల వద్ద కుముదిని నృత్యాన్ని అభ్యసిస్తూనే చదువు కొనసాగించారు. ఆ తరువాత నాటి ప్రసిద్ధ నర్తకుడు రామ్‌గోపాల్ బృందంతో కలిసి ప్రదర్శనలు



ఇవ్వడం ప్రారంభించారు. 1967లో 'కదంబ్ నృత్య, సంగీత పాఠశాల'ను ఏర్పాటు చేసి వేలమందిని కళాకారులుగా తీర్చిదిద్దారు. అదితి మంగళ్ దాస్, సంధ్యా దేశాయ్, ఇషిరా పరీఖ్, వైష్ణవి త్రివేది తదితర ప్రముఖ కథక్ నర్తకులు ఆమె శిష్యులే. రజనీకాంత్ లేఖియాతో వివాహమయ్యాక... అహ్మదాబాద్‌లో కుముదిని స్థిరపడ్డారు. అక్కడే తన స్కూల్ కార్యకలాపాలను కొనసాగించారు. నృత్యనిర్దేశకురాలిగా అనేక వినూత్నమైన, సామాజికమైన అంశాలతో ప్రదర్శనలకు రూపకల్పన చేశారు. అప్పట్లో ఆమె చేసిన ప్రయోగాలు కథక్ నృత్యంలో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికాయి. అయితే తీవ్రమైన ప్రతిఘటనను కూడా ఆమె ఎదుర్కోవాల్సి వచ్చింది. "పురాణ కథలను విడిచిపెట్టి, సాంఘిక సమస్యలను ఎంచుకున్నందుకు విమర్శకులు నా మీద విరుచుకుపడ్డారు. అదే విమర్శకులు పాతికేళ్ళ తరువాత... 'కుముదిని కథక్ నృత్యానికి రక్షకురాలు' అంటూ పొగిడారు. అంటే నేను వాళ్ళ కన్నా పాతికేళ్ళు ముందున్నాననే కదా అర్థం! అప్పట్లో నేను చేసిన ప్రయోగాలు నా గురువులకు కూడా నచ్చలేదు. "ఇది కథక్ కాదు" అనేవారు. తరువాత వాళ్ళే కాదు, ప్రతి ఒక్కరూ అదే మార్గాన్ని అనుసరించారు. కానీ వాటికి మూలకర్త నేననేది ఎక్కడా ప్రస్తావించలేదు. అయితే అనుకరణ కన్నా గొప్ప ప్రశంస మరేం ఉంటుంది?" అంటారు కుముదిని. 'సంగీత నాటక అకాడమీ అవార్డ్', 'కాళిదాస సమ్మాన్'తో సహా ఎన్నో పురస్కారాలను ఆమె అందుకున్నారు. 1987లో 'పద్మశ్రీ', 2010లో 'పద్మభూషణ్' అందుకున్న కుముదినికి ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం 'పద్మవిభూషణ్'ను ప్రకటించింది.



సంగీతమే సర్వస్వం

కామాక్షి ఓమనకుట్టి అమ్మకు గతం, వర్తమానం, భవిష్యత్తు... అన్నీ సంగీతమే. తండ్రి మలబార్ గోపాలన్ నాయర్ గొప్ప సంగీత విద్వాంసుడు. తల్లి, అన్న శాస్త్రీయ సంగీతంలో నిపుణులు. అదే బాటలో బాల్యం నుంచే సంగీతం అభ్యసించారు ఓమనకుట్టి. అయితే ఆమె ప్రభుత్వ ఉద్యోగి అయితే బాగుంటుందనుకున్నారు తల్లితండ్రులు. వారి మాటను గౌరవిస్తూ జువాలజీలో డిగ్రీ చేస్తూనే... తన అభిరుచికి అనుగుణంగా 'గాన ప్రవీణ' కోర్సులో చేరారు. రెండిటిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. వెంటనే ఆమెకు తిరువనంతపురం ప్రభుత్వ మహరాజా కాలేజీలో మ్యూజిక్ లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ తరువాత సంగీతంలో డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పిహెచ్‌డి చేశారు. ఉద్యోగ జీవితంలో అంచెలంచెలుగా ఎదిగి... కేరళ విశ్వవిద్యాలయంలో సంగీత విభాగాధిపతిగా వ్యవహరించారు.



బోధన, పరిశోధన తనకు రెండు ప్రాణాలంటారు ఓమనకుట్టి. కొన్ని వందల పరిశోధన పత్రాలను ఆమె వెలువరించి, ఆ రంగానికి విలువైన సేవలు అందించారు. స్వాతి తిరునాళ్ కీర్తనలకు ప్రాచుర్యం కల్పించడానికి అపారమైన కృషి చేశారు. కేవలం స్వాతి తిరునాళ్ కృతులతో 300కు పైగా కచ్చేరీలను ప్రపంచవ్యాప్తంగా చేశారు. త్యాగరాజ పంచరత్న కృతుల తరహాలో... 2015లో 500 మంది విద్యార్థులతో తిరువనంతపురంలో 'స్వాతి పంచరత్న కీర్తనల'తో ఒక కార్యక్రమం నిర్వహించారు. మానవులు, జంతువుల మనస్తత్వం మీద సంగీతం చూపే ప్రభావాన్ని తెలుసుకోవడానికి ఆమె తీవ్ర కృషి చేశారు. అందులో భాగంగా 'సంగీత భారతి' అనే సంస్థను స్థాపించి, మ్యూజిక్ థెరపీలో పరిశోధనలు చేపట్టారు. అలాగే ఆ సంస్థ ద్వారా వర్ధమాన సంగీత కళాకారులకు సాధికారమైన సంగీత శిక్షణ కూడా అందజేశారు. మ్యూజిక్ థెరపీలో ఆమె చేస్తున్న ప్రయోగాలను గుర్తించిన తిరువనంతపురంలోని పంకజ కస్తూరి ఆయుర్వేదిక్ వైద్య కళాశాల' అధికారులు... సంగీతం ద్వారా వైద్య చికిత్స అందించడంలో సహకరించడం కోసం తమ సంస్థలో 'సీనియర్ మోస్ట్ ఫ్యాకల్టీ'గా ఓమనకుట్టిని నియమించారు. ప్రముఖ నేపథ్య గాయనులు కె.ఎస్. చిత్ర, బి.అరుంధతి తదితరులెందరో ఆమె శిష్యులు. ఆమె సోదరులు ఎం.జి.రాధాకృష్ణన్, ఎం.జి.శ్రీకుమార్ మలయాళంలో ప్రముఖ గాయకులు, సంగీత దర్శకులు. కేంద్ర ప్రభుత్వం తనకు పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడంపై స్పందిస్తూ "ఈసారి పద్మశ్రీకి నన్ను పరిగణనలోకి తీసుకుంటారని ఆశించలేదు. ఎందుకంటే గతంలో నా పేరు నామినేట్ అయినా ఆ అవార్డు రాలేదు. ఇప్పుడు అందుకోబోతున్నందుకు సంతోషంగా ఉంది. 'స్వాతి మ్యూజిక్ అవార్డ్', 'చెంబై అవార్డ్' లాంటి అసంఖ్యాకమైన అవార్డులు నేను స్వీకరించాను. ఈ గౌరవం వాటన్నిటిలోనూ ప్రత్యేకంగా నిలుస్తుంది. సంగీత అభ్యాసాన్ని, బోధనను జీవితాంతం కొనసాగించాలనే నా కోరికను ఇది మరింత బలోపేతం చేసింది" అన్నారు ఓమనకుట్టి.

అమ్మ మనసు

మత్తుమందులకూ, మద్యానికి బానిసలై చిన్న వయసులోనే రాలిపోతున్న వారిని చూసిన జుమ్దే యోమ్గామ్ గావిన్ మాతృ హృదయం చలించిపోయింది. ఆ మహమ్మారుల నుంచి వారికి విముక్తి కలిగించాలనే తపన ఆమెను నిలువనివ్వలేదు. తన లాంటి మరో పదిమంది తల్లులతో కలిసి 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్' పేరుతో 2013లో అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఆలో పట్టణంలో ఒక ఎన్జీవోను ఆమె స్థాపించారు. ఆ తరువాత దాని పేరును 'మదర్స్ విజన్'గా మార్చారు. ప్రభుత్వోద్యోగిగా పని చేస్తూనే... ఈ సంస్థ కార్యకలాపాలను కొనసాగించారు. మత్తుపదార్థాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యాసంస్థల్లో పిల్లలకు అవగాహన కలిగించడం, సామాజిక, చర్చా సమావేశాలను ఏర్పాటు చేయడంతోపాటు డ్రగ్స్ బాధితులకోసం 'డిఅడిక్షన్, ఆఫ్టర్ కేర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ముప్ఫై పడకలు ఉన్న ఈ కేంద్రం ద్వారా 700 మందికి పైగా ఆ వ్యసనాల నుంచి బైటపడ్డారు. దీనితో పాటు రెండువేల మంది మహిళలకు ఒకేషనల్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, వారి ఆర్థిక స్వావలంబనకు దోహదం చేశారు. స్థానిక మహిళలు, సంఘాలు, జిల్లా అధికారుల సాయంతో... అప్పర్ సియాంగ్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో విస్తృతంగా ఉన్న మార్జువానా, ఓపియం సాగును నిర్మూలించారు. డ్రగ్స్, మద్యానికి వ్యతిరేకంగానే కాకుండా ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహనను పెంచడం కోసం 'మదర్స్ విజన్' విస్తృతంగా పని చేస్తోంది. మహిళలకు జీవనోపాధి అవకాశాల పెరుగుదలకోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. "మత్తు పదార్థాలకు బానిసలైన వారిని వాటి నుంచి బయటకు తీసుకురావడం అనేది క్లిష్టమైన, అనేక సవాళ్ళతో కూడుకున్న అంశం. బాధితులు, వారి కుటుంబాలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు కలిసి పని చేసినప్పుడే అది సాధ్యమవుతుంది. బాధితులను ముందుగానే గుర్తించి, వారికి సమగ్రమైన చికిత్స అందించడం, చికిత్సానంతర సహాయాన్ని అందించడం కీలకం అవుతుంది" అని చెబుతున్న జుమ్దే జిల్లాపరిషత్ సభ్యురాలుగా కూడా సేవలందించారు. కిందటి ఏడాది ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ రిఫార్మ్స్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్' (ఐఎస్ఆర్‌హెచ్‌ఇ) నుంచి 'భారత్ విభూషణ్' పురస్కారాన్ని ఆమె స్వీకరించారు.



తాజాగా కేంద్ర ప్రభుత్వం తనకు 'పద్మశ్రీ'ని ప్రకటించడంపై స్పందిస్తూ "ఈ పురస్కారం నాకు ఎంతో సంతోషాన్నిస్తోంది. నిజాయితీతో కూడిన మంచి ప్రయత్నాలకు గుర్తింపు లభించకపోవడం అనేది జరగదు. ఎప్పటికైనా వాటికి ప్రతిఫలం ఉంటుంది. దానికి ఇదే నిదర్శనం" అని చెప్పారు యాభై తొమ్మిదేళ్ళ జుమ్దే.

మహాత్ముడి అడుగుజాడల్లో...



రాధా బహిన్ భట్‌కు పద్మశ్రీ పురస్కారం వచ్చిందన్న వార్త వినగానే, ఆమె గురించి తెలిసినవారిలో "అదేమిటి? ఇప్పటివరకూ ఆమెకు ఆ గౌరవమే దక్కలేదా?" అని విస్మయం వ్యక్తం చేసేవారే ఎక్కువ. ఎందుకంటే... జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఎన్నో గౌరవాలను ఆమె ఇప్పటికే అందుకున్నారు. గతంలో నోబెల్ శాంతి బహుమతికి సైతం ఆమె నామినేట్ అయ్యారు. వీటన్నిటికన్నా తనను సంతోషపరిచేవి తన ఉద్యమ ఫలితాలు, తద్వారా ప్రజలకు చేకూరే ప్రయోజనాలేనంటారు 'పర్వతాల గాంధీ'గా పేరుపొందిన రాధా బహిన్. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని అల్మోరా జిల్లాలో దుర్కా గ్రామంలో 1933లో ఆమె జన్మించారు. చిన్నవయసునుంచి ఉపాధ్యాయురాలు కావాలనేది ఆమె కోరిక. ఇంటర్ పూర్తి చెయ్యగానే... కౌసానీ గ్రామంలోని 'లక్ష్మీ ఆశ్రమ్' (కస్తూర్బా మహిళా ఉత్థాన్ మండల్)లో టీచర్‌గా చేరారు. గాంధీ శిష్యురాలైన సరళా బెహెన్ ఈ ఆశ్రమ వ్యవస్థాపకురాలు. గాంధేయవాదం పట్ల రాధా బహిన్‌కు ఉన్న ఆసక్తి... సరళ మార్గదర్శకత్వంలో మరింత బలపడింది. తరువాత అదే సంస్థకు 1966 నుంచి 1989 వరకు కార్యదర్శిగా వ్యవహరించారు, ప్రస్తుతం అధ్యక్షురాలుగా ఉన్నారు. 'సర్వోదయ-భూదాన్' ఉద్యమంలో 1957 నుంచి 1961 వరకూ ఆమె చురుగ్గా పాల్గొన్నారు. ఆచార్య వినోబా భావేతో కలిసి ఉత్తరప్రదేశ్, అసోం రాష్ట్రాల్లో సుదీర్ఘ పాదయాత్రల్లో భాగస్వామి అయ్యారు. ఈ యాత్రల సందర్భంగా గ్రామస్వరాజ్యం, మద్యవ్యతిరేక ఉద్యమం, మహిళా సాధికారత గురించి ఆమె విస్తృతంగా ప్రచారం చేశారు. ఆ తరువాత గ్రామీణ పునర్నిర్మాణం, మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటాలు, చిప్కో ఉద్యమం, తెహ్రీ డ్యామ్ ఉద్యమం, గనుల అక్రమ తవ్వకాల వ్యతిరేక ఉద్యమాలు, నదుల పరిరక్షణ ఉద్యమం... ఇలా ఎన్నో కార్యక్రమాలకు సారథ్యం వహించారు. అడవుల పరిరక్షణ ఆవశ్యకతను చాటిచెబుతూ 1975లో 75 రోజుల పాటుదీర్ఘ పాదయాత్ర నిర్వహించారు. 2006 నుంచి 2010 వరకూ ఉత్తరాఖండ్‌లోని నదులు, హిమాలయాలపై ఆమె సర్వే నిర్వహించారు. నదులపై హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గత ఆరు దశాబ్దాలుగా నార్వే, ఫిన్లాండ్, అమెరికా, డెన్మార్క్, కెనడా, స్వీడన్ తదితర అనేక దేశాల్లోని మానవ, మహిళా హక్కుల ఉద్యమాలతో మమేకమయ్యారు. అల్మోరా, పిథోరాఘడ్ జిల్లాల్లో లక్షా అరవై వేల మొక్కలను నాటి... పర్యావరణ పరిరక్షణకు దోహదం చేశారు. మారుమూల, పర్వత ప్రాంతాల్లో పాతిక బాలమందిర్‌లను ఏర్పాటు చేసి, 15 వేల మందికి పైగా పిల్లలకు విద్యను అందించారు. 'హిమాలయ సేవాసంఘ్', 'గాంధీ పీస్ ఫౌండేషన్', 'గాంధీ మెమోరియల్ ఫండ్', 'కస్తూర్బా ట్రస్ట్' లాంటి ఎన్నో సంస్థలతో కలిసి ఆమె పని చేస్తున్నారు. గుజరాత్‌లోని సేవా ఆశ్రమ్‌లో నివసిస్తున్న రాధా బహిన్ 'పద్మశ్రీ' పురస్కారాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. ప్రస్తుతం 'నౌలా' పేరుతో కౌసానీ చుట్టుపక్కల ఉన్న జలవనరులు, కాలువల పునరుద్ధరణ లక్ష్యంగా ఉద్యమాన్ని ఆమె సాగిస్తున్నారు.

ఎనభయ్యేళ్ళ కళాయజ్ఞం



అర్ధరాత్రి దాటింది. చీకటి పడగానే ఊళ్ళో రచ్చబండ దగ్గరకు చేరుకున్న ప్రేక్షకులెవరూ అక్కడి నుంచి కదల్లేదు. వారి ఆసక్తిని గ్రహించిన భీమవ్వ దొడ్డబల్లప్ప సిలేక్యా తార తన వయోభారాన్ని లెక్క చెయ్యకుండా ప్రదర్శన ఇస్తూనే ఉన్నారు. మధ్యమధ్యలో కథలు చెబుతూ వారిని అలరిస్తూనే ఉన్నారు. తెల్లవారుజామువరకూ కొనసాగిన 'తొగలు గొంబెయాట' (తోలు బొమ్మలాట) ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య ముగిసింది. భీమవ్వలో అలసట కన్నా ఆనందమే ఎక్కువగా కనిపించింది. ఎనభయ్యేళ్ళుగా ఆమె ఆ కళా యజ్ఞంలో ఏమాత్రం అలసిపోలేదు. పద్నాలుగేళ్ళ వయసులో... కుటుంబ వారసత్వంగా అందిపుచ్చుకున్న తోలుబొమ్మలాటకు ఆమె కొత్తదనాన్ని జోడించారు. రామాయణ, మహాభారత గాథలను తోలుబొమ్మలాట రూపంలో చెబుతున్నారు. ప్రాథమికమైన చదువుకూడా లేని ఆమెకు 'మహా భారతం'లోని పద్దెనిమిది పర్వాల గురించి క్షుణ్ణంగా తెలుసు. ఆ ఘట్టాలను తోలుబొమ్మలతో ప్రదర్శించడంతోపాటు... మారుతున్న కాలానికి అనుగుణంగా సామాజిక, పర్యావరణ అంశాలను కూడా తన ప్రదర్శనలో మిళితం చేసి, నవతరాన్ని ఆకర్షిస్తున్నారు. ఉత్తర కర్ణాటకలోని మోరనలా గ్రామంలో భీమవ్వ జన్మించారు. ఆ గ్రామానికి చెందిన వారు తరతరాలుగా తోలుబొమ్మలాటలో ప్రసిద్ధి చెందారు. అదే మార్గాన్ని భీమవ్వ అనుసరించారు. మన దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు అమెరికా, ఫ్రాన్స్, ఇరాక్, ఇరాన్, హాలెండ్, స్విట్జర్లాండ్, జర్మనీ, సౌదీ అరేబియా, జపాన్... ఇలా కొన్ని పదుల దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి 'భేష్' అనిపించుకున్నారు. అంతేకాదు, ఈ కళ అంతరించిపోకుండా ఉండాలనే ఆలోచనతో ఎందరికో శిక్షణ ఇచ్చారు. భీమవ్వ కుమారులు విరూపాక్ష, యంకప్ప, కేశప్పలతో పాటు, మనుమలు, మునిమనుమలు కూడా ఇప్పుడు ఈ వృత్తిలోనే కొనసాగుతున్నారు. 'జానపదశ్రీ', 'సంగీత, నాటక అకాడమీ', 'కర్ణాటక రాజ్యోత్సవ' అవార్డులతో సహా ఎన్నో పురస్కారాలను అందుకున్నారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారాన్ని ఆమెకు ప్రకటించింది. దీనిపై స్పందిస్తూ "నా కళకు ఇంత పెద్ద పురస్కారం లభించడం గర్వంగా అనిపిస్తోంది. అది కళకు లభించిన గౌరవం. తోలుబొమ్మలాటకు దీనివల్ల మరింత ఆదరణ లభిస్తుందని ఆశిస్తున్నాను" అన్నారు భీమవ్వ. ఆధునిక వినోద రూపాల మధ్య ఉనికిని కోల్పోతున్న తోలుబొమ్మలాటకు పూర్వవైభవం తెచ్చిన ఘనత ఆమెదేనంటారు అభిమానులు.



కరెంట్ చార్జీలు పెరగవ్!

- వచ్చే ఏడాది మార్చి వరకూ పాత రేట్లే
- డిస్కమ్‌ల ఆదాయం రూ.45,697 కోట్లు.. లోటు రూ.20,151 కోట్లు
- ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీతో లోటు భర్తీ
- విద్యుత్ నియంత్రణ మండలికి డిస్కమ్‌ల వివరణ

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రానున్న ఆర్థిక సంవత్సరంలో (2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు) కరెంట్ చార్జీలు పెంచవద్దని డిస్కమ్‌లు నిర్ణయించాయి. ఈ మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక ఆదాయ అవసరాల (ఏఆర్ఆర్) పిటిషన్లను తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలిలో దాఖలు చేశాయి. కొత్త ఆర్థిక సంవత్సరంలో నిర్వహణ, జీతాలు తదితర వ్యయాలకు దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్)కు రూ.46,035 కోట్లు, ఉత్తర డిస్కమ్‌కు (ఎన్పీడీసీఎల్) రూ.19,814 కోట్లు అవసరమని అంచనా వేశాయి. రెండింటికీ కలిపి రూ.65,849 కోట్ల నిధులు అవసరమవుతాయి. ప్రస్తుతం కొనసాగుతున్న విద్యుత్ చార్జీలతో దక్షిణ డిస్కమ్ రూ.36,220 కోట్లు, ఉత్తర డిస్కమ్ రూ.9421 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తాయని అంచనా. దీనికి ఓపెన్ యాక్సెస్‌లో కరెంట్ కొనుగోలు చేసే వినియోగదారుల నుంచి క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీ(సీఎస్ఎస్), అదనపు సర్‌చార్జీ(ఏఎస్) రూపంలో రూ.56.71 కోట్లు అదనంగా లభిస్తాయని లెక్క కట్టారు. అంటే మొత్తం ఆదాయం రూ.45,697 కోట్లు సమకూరే అవకాశం ఉంది. అవసరాలకు అయ్యే వ్యయంతో పోల్చితే దక్షిణ డిస్కమ్ రూ.9758 కోట్ల లోటుతో ఉండగా... ఉత్తర డిస్కమ్ రూ.10,393 కోట్ల లోటుతో ఉంటుంది. మొత్తం లోటు రూ.20,151 కోట్లు. ఈ లోటును ప్రభుత్వం సబ్సిడీ రూపంలో భర్తీ చేయనున్నట్లు గుర్తు చేశాయి.

చార్జీల పెంపునకు అనుమతించని ప్రభుత్వం

రానున్న ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ చార్జీల పెంపునకు ఉత్తర/దక్షిణ డిస్కమ్‌లు అనుమతి కోరగా, రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది. లోటునంతా సబ్సిడీ రూపంలో భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. విద్యుత్ చట్టం ప్రకారం రానున్న ఆర్థిక సంవత్సరంలో ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలను ఏటా నవంబరు 30వ తేదీలోగా ఈఆర్‌సీకి సమర్పించాలి. ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడానికి నాలుగు నెలల ముందు దాఖలు చేయాలి. దీనిపై ఈఆర్‌సీ ప్రకటన జారీ చేసి, అభిప్రాయాల సేకరణ జరిపి, బహిరంగ విచారణ అనంతరం టారిఫ్ ఉత్తర్వులు ఇస్తుంది. ఉత్తర/దక్షిణ డిస్కమ్‌ల నష్టాలు గత పదేళ్ళల్లో రూ.64227 కోట్లకు చేరాయి. లోపభూయిష్ట నిర్వహణ విధానాలకు తోడు, గత ప్రభుత్వ హయాంలో డిస్కమ్‌లు నిండా మునిగాయని ఆయా సంస్థల ఉద్యోగులు, కార్మికులు వాపోతుంటారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ

సంగారెడ్డిలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ప్రకటన.. 60 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల ఆమోదం



జాన్ వెస్లీ

సంగారెడ్డి/అమరచింత/హైదరాబాద్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జాన్ వెస్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మూడేళ్లపాటు ఈ పదవిలో ఉండనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అమరచింతకు చెందిన వెస్లీ ప్రస్తుతం సీపీఎం అనుబంధ కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. సీపీఎం రాష్ట్ర చరిత్రలో దళితుడికి రాష్ట్ర కార్యదర్శి పదవి దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం. జాన్ వెస్లీ సీపీఎంలో మూడు దశాబ్దాలుగా వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి జరుగుతున్న సీపీఎం మహాసభలు మంగళవారం ముగిశాయి. చివరిరోజున పార్టీ ప్రతినిధులంతా 60 మంది రాష్ట్ర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సభ్యుల్లో ఒకరు రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాల్సి ఉండడంతో మెజారిటీ అభిప్రాయం మేరకు అనూహ్యంగా జాన్‌వెస్లీ పేరు తెరమీదకొచ్చింది. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా జి.నాగయ్య, ఎస్. వీరయ్య, పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి, టీ.జ్యోతిని ఎన్నుకున్నారు. వీరితోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా చుక్క రాములు, పాలడుగు భాస్కర్, టి.సాగర్, మల్లు లక్ష్మి, ఎండీ అబ్బాస్, పి. ప్రభాకర్, నున్న నాగేశ్వరరావు, బండారు రవికుమార్, ఎండీ జహంగీర్‌లను మహాసభ ఎన్నుకుంది.

నిరుపేద కుటుంబం

జాన్‌వెస్లీ తల్లిదండ్రులు అమరచింతలోని ఎస్సీ కాలనీలోని చిన్నపాటి ఇంట్లో ఉండేవారు. కొద్దిపాటి వ్యవసాయం చేస్తూ, బీడీ పనితో జీవనం కొనసాగించేవారు. జాన్‌వెస్లీ తండ్రి మోజెస్, తల్లి బేతమ్మలకు ఐదుగురు సంతానం. వెస్లీ నాలుగో కుమారుడు. పదో తరగతి వరకు అమరచింత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకొని ఇంటర్ ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పూర్తి చేశారు. డిగ్రీ గద్వాల ఎంఎల్‌డీ కళాశాలలో పూర్తి చేసిన వెస్లీ విద్యార్థి దశ నుంచే పాలేర్ల ఉద్యమానికి ఆకర్షితులై కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాల్లో పాల్గొన్నారు. మొదట ఆర్ఎస్‌యూ, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్‌లలో పని చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శిగా, డీవైఎఫ్ఐ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న సమయంలోనే దళిత సమస్యలపై ఆయన చేసిన పోరాటాల ఫలితంగానే అప్పటి ప్రభుత్వం జస్టిస్ పున్నయ్య కమిషన్, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్‌లు తీసుకొచ్చాయని పార్టీ వర్గాలు చెబుతుంటాయి. ప్రస్తుతం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా ఉంటూ వనపర్తి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ ఎన్నికపై సీపీఎం నాయకులు వివిధ వర్గాల ప్రజలు అమరచింతలో సంబురాలు జరుపుకొన్నారు. మంగళవారం రాత్రి అమరచింత బస్టాండ్ సెంటర్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు.

రేవంత్ సర్కారు హామీలను నెరవేర్చడం లేదు: జాన్‌వెస్లీ

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీలను నెరవేర్చడం లేదని, గత ప్రభుత్వం కూడా ఇలాగే వ్యవహరించిందని సీపీఎం నూతన కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. కార్యదర్శిగా ప్రకటించిన అనంతరం తొలిసారిగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని కూలీలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాలను ప్రభుత్వం పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. ప్రజాసమస్యలపై తాను ముందుండి పోరాటాలను నడిపిస్తానని చెప్పారు. మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహిస్తున్న బీజేపీ విధానాలపై తమ పోరాటం ఉంటుందన్నారు. వామపక్షాలను ఓట్లతోనూ, సీట్లతోనూ కొలమానం చేయవద్దని సూచించారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నర్సిరెడ్డికి తమ మద్దతు ఇస్తున్నామని ఆయన ప్రకటించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో 5వరకు హరీశ్‌రావును అరెస్ట్ చేయొద్దు

- ఉత్తర్వులు పొడిగించిన హైకోర్టు

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావును అరెస్ట్ చేయకూడదంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వుల కాలపరిమితిని హైకోర్టు ఫిబ్రవరి 5 వరకు పొడిగించింది. హరీశ్‌రావు ఆదేశాలతో తన కుటుంబ సభ్యుల ఫోన్ ట్యాప్ చేశారని సిద్దిపేట నియోజకవర్గం నుంచి ఆయనపై పోటీచేసి ఓడిపోయిన చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని కొట్టివేయాలని కోరుతూ హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయనను అరెస్ట్ చేయరాదని.. దర్యాప్తు మాత్రం చేసుకోవచ్చని పేర్కొంటూ హైకోర్టు ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. హరీశ్‌రావు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దామ శేషాద్రినాయుడు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు. సమగ్ర వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని కోరడంతో విచారణ ఫిబ్రవరి 5కు వాయిదా పడింది. అప్పటివరకు అరెస్ట్ చేయరాదంటూ మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు పేర్కొంది.

రాజకీయ కక్షసాధింపులో భాగంగానే..

రాజకీయ కక్షలో భాగంగానే కుట్రపూరితంగా ఫోన్‌ట్యాపింగ్ కేసును తనపై బనాయించారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టేయాలని పేర్కొంటూ హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌లో పోలీసులు దాఖలు చేసిన కౌంటర్‌కు సమాధానం ఇచ్చారు.

మీ ఫోన్ ట్యాప్ అయింది..

(మొదటిపేజీ తరువాయి)

కసరత్తు ప్రారంభించారు. విచారణలో భాగంగా మీ ఫోన్ ట్యాపింగ్ అయిన విషయం మీకు తెలుసా? ఆ రోజుల్లో ఎవరెవరితో మాట్లాడారు? ఎవరిమీదైనా అనుమానం ఉందా..? అని అడగనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర బీజేపీలో కీలక నేతగా ఉన్నప్పుడే త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డి ఫోన్‌ను ట్యాప్ చేశారు. కేంద్ర, రాష్ట్ర నాయకులతో ఏం మాట్లాడుతున్నారో తెలుసుకున్నారు. ఆయన గవర్నర్‌గా వెళ్లాక.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. 2023 నవంబరులో 15 రోజులు పాటు ఇది కొనసాగింది. అందుకే ఇటీవల ఇంద్రసేనారెడ్డి పీఏ నర్సింహ వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 4 వేలకు పైగా ఫోన్లను ఎస్ఐబీ అప్పటి చీఫ్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలోని బృందం ట్యాప్ చేసినట్లు విచారణ అధికారులు గుర్తించిన సంగతి తెలిసిందే. వీరిలో చాలామంది కాంగ్రెస్, బీజేపీ నాయకులతో పాటు అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ నాయకులున్నారు. పోలీసు అధికారి తిరుపతన్నకు సుప్రీంకోర్టులో బెయిల్ రావడంతో మిగతా వారికి కూడా త్వరలోనే బెయిల్ మంజూరయ్యే అవకాశాలున్నాయని పోలీసులు భావిస్తున్నారు. దీంతో మరింతగా కేసు మూలాల్లోకి వెళ్లడమే కాకుండా నిందితుల నేరాన్ని నిరూపించే సాక్ష్యాధారాల సేకరణకు ప్రయత్నాలు ప్రారంభించారు. కీలక సాక్ష్యాధారాలైన హార్డ్ డిస్కులను డీఎస్పీ ప్రణీత్‌రావు ధ్వంసం చేయడంతో సర్వీసు ప్రొవైడర్ల ద్వారా సమాచారాన్ని సేకరించడానికి పోలీసు బృందాలు ప్రయత్నిస్తున్నాయి. సర్వీసు ప్రొవైడర్లు ఎయిర్‌టెల్, జియో, వీఐ, బీఎస్ఎన్ఎల్‌కు లేఖలు రాశాయి. కాగా, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును అమెరికా నుంచి రప్పించడానికి పోలీసు ఉన్నతాధికారులు చట్టపరమైన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కేంద్రం నుంచి అమెరికాకు లెటర్ ఆఫ్ రొగేటరీ పంపించడం ద్వారా ప్రభాకర్‌రావు, అక్కడే ఉన్న మరో నిందితుడు శ్రవణ్‌రావును రప్పించవచ్చని అంచనా వేస్తున్నారు. ఇందుకోసం వ్యక్తిగతంగానూ కేంద్ర హోం శాఖతో సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే, తిరుపతన్నకు బెయిల్ రావడంతో ప్రభాకర్‌రావు సైతం ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. దీనికిముందే ఆయనను రప్పించగలిగితే అరెస్టు చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రభాకర్‌రావు మాజీ పోలీసు అధికారి కావడంతో.. శాఖ ఏమేం చర్యలు తీసుకోవచ్చు..? దర్యాప్తులో ఏయే అడుగులు ఎలా వేయొచ్చు? అని ఊహించి అందుకుతగ్గట్లు పావులు కదుపుతున్నారని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

చంచల్‌గూడ జైలు నుంచి తిరుపతన్న విడుదల

హైదరాబాద్/ సైదాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రధాన నిందితుల్లో ఒకరైన అదనపు ఎస్పీ తిరుపతన్న చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. తిరుపతన్నకు సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. బెయిలు కాపీలు జైలు అధికారులకు అందడంతో మంగళవారం సాయంత్రం ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. ట్యాపింగ్ కేసులో అరెస్టయిన తిరుపతన్న గత 10 నెలలుగా చంచల్‌గూడ జైల్లో విచారణ ఖైదీగా ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో తాము లక్ష్యంగా చేసుకున్న వ్యక్తుల ఫోన్లను తిరుపతన్నతోపాటు ఈ కేసులో అరెస్టయిన సహ నిందితులు నిబంధనలకు విరుద్ధంగా ట్యాపింగ్ చేశారని దర్యాప్తు అధికారులు అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. కాగా, ఇదే కేసులో ఏ4గా ఉన్న భుజంగరావు అనారోగ్య కారణాలతో గత ఆగస్టు నుంచి మధ్యంతర బెయిలుపై జైలు బయటే ఉన్నారు.

బిజినెస్

టిక్‌టాక్ కొనుగోలు రేసులో మైక్రోసాఫ్ట్ !

• ధ్రువీకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



న్యూయార్క్: ప్రపంచంలోని అతిపెద్ద సామాజిక మాధ్యమాల్లో ఒకటైన వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ టిక్‌టాక్‌ను కొనుగోలు చేసేందుకు అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చర్చలు జరుపుతోంది. అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. టిక్ టాక్ అమెరికా కార్యకలాపాలను చేజిక్కించుకునేందుకు మైక్రోసాఫ్ట్ సహా పలు టెక్ కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయన్నారు. టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, ఒరాకిల్ చైర్మన్ ల్యారీ ఎల్లిసన్ కూడా ఈ ప్లాట్‌ఫామ్ కొనుగోలుకు పోటీపడాలని ఆయన కోరారు. టిక్‌టాక్‌లో 50 శాతం వాటా అమెరికన్ కంపెనీ చేతుల్లో ఉండాలని తాను కోరుకుంటున్నాని ఆయన పేర్కొన్నారు. జాతీయ భద్రత కారణాల దృష్ట్యా టిక్‌టాక్‌పై అమెరికా మాజీ అధ్యక్షుడు బైడెన్ హయాంలో విధించిన నిషేధం అమలును ట్రంప్ 75 రోజుల పాటు వాయిదా వేశారు. అప్పటిలోగా టిక్‌టాక్ యూఎస్ కార్యకలాపాలను విక్రయించాలని, లేదంటే నిషేధానికి గురికాక తప్పదని చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్‌కు అల్టిమేటం జారీ చేశారు. టిక్‌టాక్ మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ టిక్‌టాక్ అమెరికా కార్యకలాపాలను కొనుగోలు చేసేందుకు మైక్రోసాఫ్ట్, ఒరాకిల్ 2020లోనే పోటీపడ్డాయి. ఐదేళ్ల తర్వాత మళ్లీ ఈ దిశగా చర్చలు ప్రారంభమయ్యాయి.

2028 నాటికి భారత్‌లో ఎలక్ట్రిక్ బైక్ ప్లాంట్

హోండా మోటార్


మినోరు కాటో

న్యూఢిల్లీ/ముంబై: భారత్‌లో పూర్తిగా ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్ల మాత్రమే తయారు చేసే ప్లాంట్‌ను 2028 నాటికి ప్రారంభిస్తామని జపాన్ ఆటో దిగ్గజం హోండా మోటార్ ప్రకటించింది. ఈ ప్లాంట్‌లో విస్తృత శ్రేణిలో మోటార్ సైకిళ్ల తయారు చేయనున్నట్లు తెలిపింది. అయితే ఈ ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేసేది, పెట్టుబడులు ఎంతనేది మాత్రం కంపెనీ వెల్లడించలేదు. ఈ కొత్త ప్లాంట్ నుంచి ఎనిమిది మోడళ్లలో ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటర్లు ఉత్పత్తి చేయనున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మినోరు కాటో తెలిపారు. అలాగే విద్యుత్ వాహనాల్లో కీలకమైన బ్యాటరీల కోసం వివిధ బ్యాటరీ ఉత్పత్తిదారులతో సంప్రదిస్తున్నామని, తాము తయారు చేయాలనుకుంటున్న మోటార్ సైకిళ్ల స్వభావానికి సరిపోయే బ్యాటరీలు తయారు చేయడంతో పాటు సరఫరా స్థిరంగా ఉండాలన్నది తమ ధ్యేయమని ఆయన చెప్పారు. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ)కు అందుబాటులో ఉన్న సబ్సిడీ విధానాలు, కంపెనీలు అందిస్తున్న వినూత్న మోడళ్ల మద్దతుతో 10 లక్షల విద్యుత్ టూ వీలర్లకు డిమాండ్ ఏర్పడిందని, మొత్తం వాహనాల మార్కెట్లో ఇది ఐదు శాతంతో సమానమని ఆయన వెల్లడించారు. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 30 విద్యుత్ మోడళ్ల ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటికే 13 మోడళ్ల ప్రవేశపెట్టినట్టు చెప్పారు. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 40 లక్షల విద్యుత్ బైక్‌లు విక్రయించాలన్నది తమ లక్ష్యమని మినోరు తెలిపారు.

హైదరాబాద్‌లో సొనోకో జీసీసీ

500 మందికి ఉద్యోగాలు

SONOCO

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ తన గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాన్ని (జీసీసీ) ఏర్పాటు చేస్తోంది. పలు ఫార్చ్యూన్-500 కంపెనీలకు ప్యాకేజింగ్ ఉత్పత్తులు సరఫరా చేస్తున్న ప్రముఖ అంతర్జాతీయ సంస్థ సొనోకో 'పెర్‌ఫార్మెన్స్ హబ్' పేరుతో ఈ జీసీసీని ఏర్పాటు చేస్తోంది. హైటెక్ సిటీ సమీపంలోని ఫీనిక్స్ కార్యాలయ భవనంలో కోటి డాలర్ల (సుమారు రూ.86 కోట్లు) పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రం ద్వారా వచ్చే ఏడాది, ఏడాదిన్నర కాలంలో 300 నుంచి 500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని సొనోకో చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారి (సీఐఓ) రాజీవ్ అంకిరెడ్డిపల్లి తెలిపారు. ఇందులో ఇప్పటికే 60-70 మంది నియామకాలను కంపెనీ పూర్తి చేసింది. క్యాపబిలిటీ, కెపాసిటీ, కాస్ట్ అంశాల ప్రాతిపదికన సొనోకో హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రం ద్వారా తమ కంపెనీతో పాటు తమ ఖాతాదారులకు అవసరమైన డిజిటల్ సేవలు అందిస్తామని రాజీవ్ చెప్పారు. పర్యావరణానికి హాని చేయని రీతిలో ప్యాకేజింగ్ ఉత్పత్తులు అందించడం తమ కంపెనీ ప్రత్యేకత అన్నారు. ప్రస్తుతం నిపుణులైన ఉద్యోగులు భారత్‌లో లభిస్తున్నంత విరివిగా మరే దేశంలోనూ లభించడం లేదని సొనోకో కంపెనీ గ్లోబల్ ఐటీ సేవల విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జొచెన్ లీ లార్జ్ తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,930 ▼	75,100 ▼	1,04,000 ▼
విజయవాడ	82,900 ▼	78,200 ▲	92,500 ▼
విశాఖపట్నం	80,300 ▲	73,610 ▲	90,700 ▼
రాజమండ్రి	81,930 ▼	75,100 ▼	92,700 ▼
ప్రొద్దుటూరు	82,000 ▲	75,840 ▼	92,500 ▼
ముంబై	80,313 ▼	73,567 ▼	89,750 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	490
చిత్తూరు	553	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	109	విజయవాడ	120
వరంగల్	109	గుంటూరు	118
కరీంనగర్	109	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	100
కర్నూలు	109	నెల్లూరు	105
విశాఖపట్నం	112	అనంతపురం	105
గోదావరి	120		

బ్యాంకింగ్ షేర్ల దన్ను

ఆర్థిక వ్యవస్థలోకి రూ.1.5 లక్షల కోట్లు విడుదల చేయాలని ఆర్‌బీఐ నిర్ణయం



ముంబై: వరుసగా రెండు రోజులు భారీ నష్టాలు చవిచూసిన సెన్సెక్స్, నిఫ్టీ.. మంగళవారం ట్రేడింగ్‌లో మళ్లీ పుంజుకున్నాయి. ఆర్థిక వ్యవస్థలో రూ.1.5 లక్షల కోట్ల మేర ద్రవ్య లభ్యత పెంచాలని ఆర్‌బీఐ నిర్ణయం తీసుకోవడంతో బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జరపడం సూచీల ర్యాలీకి దోహదపడింది. ఆరంభం నుంచే పాజిటివ్‌గా ట్రేడవుతూ వచ్చిన సెన్సెక్స్.. ఒకదశలో 1,146.79 పాయింట్లు ఎగబాకి 76,512.96 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆఖరి అరగంటలో మదుపరులు మళ్లీ లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీ 535.24 పాయింట్ల లాభంతో 75,901.41 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 308 పాయింట్ల పెరుగుదలతో 23,138 స్థాయికి చేరుకున్నప్పటికీ, చివర్లో 128.10 పాయింట్ల లాభంతో 22,957.25 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 రాణించాయి.

నిధుల కొరత తీర్చేందుకు ఆర్‌బీఐ చర్యలు

బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న నిధుల కొరత తీర్చేందుకు ఆర్‌బీఐ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వివిధ చర్యల ద్వారా బ్యాంకింగ్ రంగానికి రూ.1.5 లక్షల కోట్ల నిధులు సరఫరా చేసేందుకు సిద్ధమవుతోంది. ఇందులో రూ.43,000 కోట్లు ఈ నెల 31న బ్యాంకుల నుంచి 500 కోట్ల డాలర్ల విదేశీ మారక ద్రవ్య నిధుల కొనుగోలు ద్వారా ఆర్‌బీఐ సమకూరుస్తుంది. మళ్లీ ఆరు నెలల్లో ఈ మొత్తాన్ని బ్యాంకులకు విక్రయిస్తుంది. ఇంకో, రూ.60,000 కోట్లు బ్యాంకుల వద్ద ఉన్న ప్రభుత్వ రుణ పత్రాలు కొనుగోలు ద్వారా, మరో రూ.50,000 కోట్లు వేరియబుల్ రేటు రెపో (వీఆర్ఆర్) వేలం ద్వారా సమకూర్చనున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది.

• ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 26 పైసలు నష్టపోయి 86.57 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతో పాటు ట్రంప్ సుంకాల హెచ్చరికలు మన కరెన్సీని కుంగదీశాయి.

ఎన్‌ఎండీసీ రూ.70 వేల కోట్ల పెట్టుబడులు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో అతి పెద్ద ఇనుప ఖనిజం ఉత్పత్తిదారైన ఎన్ఎండీసీ రాబోయే ఐదేళ్ల కాలంలో రూ.70,000 కోట్ల పెట్టుబడి ప్రణాళికలు ప్రకటించింది. ఉత్పాదక సామర్థ్యం పెంపు, మౌలిక వసతులు, డిజిటల్ పరివర్తన విభాగాల్లో ఈ సొమ్ము ఇన్వెస్ట్ చేయనున్నట్టు కంపెనీ సీఎండీ (అదనపు చార్జి) అమితవ ముఖర్జీ తెలిపారు. ఎన్ఎండీసీ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వెండర్ల మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. 2030 నాటికి 10 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం సాధించడం కంపెనీ ప్రాధాన్యత అన్నారు. అలాగే ప్రపంచ మైనింగ్ దిగ్గజంగా తీర్చి దిద్దాలన్నది తమకు లభించిన జీవితకాల అవకాశమని చెప్పారు. కంపెనీ పురోగతిలో పాలు పంచుకున్న వారందరూ ఈ బృహత్ ప్రయత్నంలో భాగస్వాములై ఆర్థికపరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ముఖర్జీ సూచించారు.

ఫ్రెంచి కంపెనీతో ప్యూర్ ఈవీ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అత్యాధునిక లిథియం అయాన్ బ్యాటరీ కండిషనింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఫ్రాన్స్‌కు చెందిన బీఈ ఎనర్జీతో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు హైదరాబాద్‌కు చెందిన విద్యుత్ టూ వీలర్ల తయారీ సంస్థ ప్యూర్ ఈవీ ప్రకటించింది. చరిత్రలో ఇలాంటి భాగస్వామ్యాల్లో ఇదే మొదటిదని పేర్కొంటూ ఈ టెక్నాలజీ ఈవీ యజమానులకు దీర్ఘకాలిక పొదుపు కల్పిస్తుందని తెలిపింది. బ్యాటరీల రీ కండిషనింగ్ వల్ల కొత్త బ్యాటరీల కొనుగోలు భారం తగ్గుతుందని పేర్కొంది. ఈ ఒప్పందం కింద బీఈ ఎనర్జీ నుంచి తాము పేటెంట్లు గల హైటెక్ పరికరాలు దిగుమతి చేసుకోగలుగుతామని కంపెనీ తెలిపింది. ఈ భాగస్వామ్యంతో భారత్‌లో బీఈ ఎనర్జీ కార్యకలాపా లు ప్రారంభించినట్టవుతుందని ప్యూర్ ఈవీ వ్యవస్థాపకుడు, ఎండీ నిశాంత్ దొంగరి అన్నారు.

లాభాల్లోకి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్

డిసెంబరు త్రైమాసిక లాభం రూ.202 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్) లాభాల్లోకి అడుగుపెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ రూ.202 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ రూ.486 కోట్ల నికర నష్టాలను నమోదు చేసింది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ నికర ఆదాయం 17 శాతం వృద్ధి చెంది రూ.2,748 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో కంపెనీ నిర్వహణలోని విమానాశ్రయాల్లో ప్యాసింజర్ ట్రాఫిక్ 10 శాతం వృద్ధి చెందింది. హైదరాబాద్ విమానాశ్రయ ట్రాఫిక్ 22.1 శాతం వృద్ధితో 77 లక్షలకు చేరుకున్నట్లు పేర్కొంది. దేశీయ విమాన ట్రాఫిక్ 24.43 శాతం పెరగగా అంతర్జాతీయ ప్యాసింజర్ ట్రాఫిక్ 11.5 శాతం పెరిగిందని తెలిపింది. డిసెంబరు త్రైమాసికంలో హైదరాబాద్ విమానాశ్రయ మొత్తం ఆదాయం 22.9 శాతం వృద్ధితో రూ.496 కోట్ల నుంచి రూ.609 కోట్లకు చేరుకుందని పేర్కొంది. కాగా ఢిల్లీ విమానాశ్రయ ఆదాయం 8.1 శాతం వృద్ధితో రూ.1,430 కోట్లుగా నమోదైనట్లు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ తెలిపింది. మరోవైపు విశాఖపట్నంలోని భోగాపురం విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని వెల్లడించింది.

మొబిక్విక్, క్రెడ్ నుంచి డిజిటల్ రూపీ వ్యాలెట్లు

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ కంపెనీలైన మొబిక్విక్, క్రెడ్ తాజాగా సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) లేదా డిజిటల్ రూపీ వ్యాలెట్లను అందుబాటులోకి తెచ్చాయి. ఆర్‌బీఐ, యెస్ బ్యాంక్ భాగస్వామ్యంతో ఈ సేవలను ప్రారంభించాయి. ఆర్‌బీఐ డిజిటల్ కరెన్సీని యూజర్లకు ఆఫర్ చేస్తున్న తొలి బ్యాంకింగేతర సంస్థలివే. ఆర్‌బీఐ తొలుత బ్యాంక్‌లను మాత్రమే డిజిటల్ రూపీ సేవలందించేందుకు అనుమతించింది. అయితే, సీబీడీసీ సేవలను విస్తరించేందుకు నాన్-బ్యాంకింగ్ కంపెనీలకూ ఇందుకు అనుమతివ్వాలని గత ఏడాది ఏప్రిల్‌లో ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. మొబిక్విక్ ఆండ్రాయిడ్ యూజర్ల కోసం పూర్తిస్థాయి ఈ-రూపీ వ్యాలెట్ సేవలను ప్రారంభించగా.. క్రెడ్ మాత్రం ఎంపిక చేసిన సభ్యుల కోసం బీటా వెర్షన్ వ్యాలెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ వ్యాలెట్ ద్వారా యూజర్లు ఇతరుల డిజిటల్ రూపీ వ్యాలెట్లతో పాటు యూపీఐ ద్వారా బ్యాంక్ అకౌంట్లకు నిధులు పంపవచ్చు లేదా అందుకోవచ్చు.

సీబీఐసీ

బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల పెనాల్టీ చార్జీలపై జీఎస్‌టీ వర్తించదు..

న్యూఢిల్లీ: బ్యాంక్‌లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) విధించే పెనాల్టీ చార్జీలపై జీఎస్‌టీ వర్తించదని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) స్పష్టం చేసింది. అంతేకాదు, పేమెంట్ అగ్రిగేటర్లకు రూ.2,000 వరకు డిజిటల్ చెల్లింపుల ప్రాసెసింగ్ పైనా జీఎస్‌టీ విధించడం జరగదని తెలిపింది. ఇందుకు సంబంధించి సీబీఐసీ మంగళవారం నాడు సర్క్యులర్ జారీ చేసింది.

చిత్రజ్యోతి

SINCE 1965

వింటేజ్ జాతర



రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' ఉప శీర్షిక. ఇది ఆయన నటిస్తున్న 75వ చిత్రం కావడం విశేషం. సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి ఓ గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులోని విజువల్స్ అభిమానులకు వింటేజ్ రవితేజను గుర్తుకుతెచ్చేలా ఉన్నాయి. 'ధమాకా' చిత్రం తర్వాత శ్రీలీల మరోసారి ఆయనతో కలసి ఇందులో నటిస్తున్నారు. ఈ సినిమా మాస్ ప్రేక్షకులకు విందుభోజనంలా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్‌నూలి, సినిమాటోగ్రఫీ: విధు అయ్యన్న, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

అల్లు అరవింద్.. నా తండేల్



అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన 'తండేల్' చిత్రం ఫిబ్రవరి 7న విడుదలవుతోంది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. ఈ సినిమా ట్రైలర్‌ను వైజాగ్‌లోని రామా పిక్చర్ ప్యాలెస్‌లో విడుదల చేశారు. ప్రేమ, దేశభక్తి అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. 'మా దేశంలోని ఊరకుక్కలన్నీ ఉత్తరం వైపు తిరిగి పోస్తే ప్రపంచ పటంలో పాకిస్థాన్ లేకుండా పోతుంది' అంటూ నాగచైతన్య చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నాగచైతన్య మాట్లాడుతూ 'ఏడాదిన్నర నుంచి నా లైఫ్‌లో నిజమైన తండేల్ అల్లు అరవింద్‌గారే. ఆయన లేకుండా ఇంకో సినిమా నేను ఎలా చేయగలనా అని ఇప్పుడు అనిపిస్తోంది. ఈ చిత్ర నిర్మాణంలో ఆయన ఇన్‌వాల్వ్‌మెంట్ చాలా ఉంది. నేను వైజాగ్ అమ్మాయినే ప్రేమించి పెళ్లి చేసుకున్నా. మా ఇంట్లో రూలింగ్ వాళ్లదే. తండేల్ సినిమా వైజాగ్‌లో బాగా ఆడాలి. లేకపోతే ఇంట్లో పరువు పోతుంది' అన్నారు.

అల్లు అరవింద్ మాట్లాడుతూ 'చాలా కష్టపడి ఈ సినిమా తీశాం.మీరు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది. నాగచైతన్య ఇంతవరకూ ఏ సినిమాలో నటించని స్థాయిలో ఇందులో నటించాడు. దర్శకుడు చందు కథను తెరపై అద్భుతంగా మలిచాడు' అన్నారు.

ధనుష్‌కు అనుకూలంగా కోర్టు తీర్పు



హీరోయిన్ నయనతార డాక్యుమెంటరీ కోసం తాను నిర్మాతగా తెరకెక్కించిన 'నానుమ్ రౌడీదాన్' మూవీలోని మూడు సెకన్ల సన్నివేశాలను ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ రూ.10 కోట్లు నష్టపరిహారం చెల్లించాలని హీరో ధనుష్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిని కొట్టివేయాలని కోరుతూ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది.

చెన్నై, ఆంధ్రజ్యోతి

ఆ డ్యాన్సులు ఆపండి బాబూ!



దుబాయ్‌లో జరిగిన 'గ్లోబల్ విలేజ్' కార్యక్రమంలో బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్ సందడి చేశారు. దక్షిణాది కథానాయకులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ అందరినీ నవ్వులతో ముంచెత్తారు. 'సౌతిండియా స్టార్స్ ప్రభాస్, మహేశ్‌బాబు, రామ్‌చరణ్, అల్లు అర్జున్, యశ్, రజనీకాంత్, విజయ్ నాకు మంచి స్నేహితులు. వేగంగా డ్యాన్స్ చేయడం ఆపేయాలని వారికి విజ్ఞప్తి చేస్తున్నా. డ్యాన్స్‌లో వారిని అనుసరించడం కష్టం' అని షారుక్ అన్నారు. ఆయా హీరోల పేర్లను షారుక్ ప్రస్తావిస్తుండగా సభా ప్రాంగణం అభిమానుల కేరింతలతో హోరెత్తింది. ప్రస్తుతం షారుక్ 'కింగ్' చిత్రంలో నటిస్తున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో షారుక్ కుమార్తె సుహానా ఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నారు.

చాలా ఎంజాయ్ చేస్తారు



విశాల్ హీరోగా సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మదగజరాజా'. వరలక్ష్మీ శరత్ కుమార్, అంజలి హీరోయిన్లు. జెమిని కిరణ్ నిర్మాత. తమిళంలో విడుదలై భారీ విజయాన్ని సాధించింది. ఈ యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ సత్యకృష్ణన్ ప్రొడక్షన్స్ ద్వారా ఈనెల 31న తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అంజలి మాట్లాడుతూ 'ఇది మంచి కమర్షియల్ సినిమా. తమిళ్‌లో పెద్ద హిట్ అయ్యింది. తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుందని అనుకుంటున్నా. ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు' అన్నారు. వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ 'హీరోయిన్‌గా నాకు ఇది ఫస్ట్ కమర్షియల్ సినిమా. ఇందులో నేను వెస్ట్రన్ హీరోయిన్‌గా కనిపించా' అని చెప్పారు.

ప్రేమికుల రోజున



అమ్మ రాజశేఖర్ దర్శకత్వంలో ఆయన తనయుడు అమ్మ రాగిణ్ రాజ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'తల'. అంకిత నాన్సర్ కథానాయిక. పి. శ్రీనివాస్‌గౌడ్ నిర్మించారు. ఫిబ్రవరి 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. హీరో సోహైల్, అశ్విన్ ట్రైలర్‌ను విడుదల చేశారు. అమ్మరాజశేఖర్ మాట్లాడుతూ "ఇండస్ట్రీలో అంతా 'అమ్మ రాజశేఖర్ ఫినిష్' అన్నారు. కానీ ఇప్పుడు 'తల'తో వచ్చా. కొత్తదనం కోరుకునేవాళ్లకి ఈ సినిమా బాగా నచ్చుతుంది' అన్నారు.

బాపు చెప్పిన కథ



నటుడు బ్రహ్మాజీ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'బాపు'. 'ఏ ఫాదర్స్ సూసైడ్ స్టోరీ' అనేది ఉపశీర్షిక. బలగం సుధాకర్ రెడ్డి, ఆమని, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ కీలకపాత్రలు పోషించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా దయా తెరకెక్కిస్తున్నాడు. రాజు, సీహెచ్ భాను ప్రసాద్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 21న విడుదలవుతోంది. మంగళవారం చిత్ర బృందం నిర్వహించిన కార్యక్రమంలో విశ్వక్‌సేన్ టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఇన్ ప్రోగ్రెస్

సస్పెన్స్ థ్రిల్లర్



అబిద్ భూషణ్, రోహిత్ సహాని, రియా కపూర్, మేఘనా రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన సస్పెన్స్ థ్రిల్లర్ 'మిస్టీరియస్'. జయ్ వల్లందాస్ నిర్మాత. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తిచేసుకొని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మహి కోమటి రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంలోని ప్రతి పాత్ర అనుమానాస్పదంగా ఉండేలా సస్పెన్స్ మిస్టరీతో ప్రేక్షకులను కట్టిపడేసేలా నిర్మించాం. ఇందులోని షాకింగ్ ట్విస్ట్‌లు కథను కొత్త ఎత్తులకు తీసుకెళ్లి వీక్షకులను రంజింపజేస్తుంది' అని తెలిపారు.

జపాన్ అకాడమీ అవార్డు రేసులో...



బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ సతీమణి కిరణ్ రావు తెరకెక్కించిన చిత్రం 'లాపతా లేడీస్'. జపాన్‌లో అక్టోబరులో విడుదలైన ఈ సినిమా ఇటీవలే అక్కడ 100 రోజులను పూర్తి చేసుకుంది. తాజాగా, ఈ సినిమా 'జపాన్ అకాడమీ ఫిల్మ్ ప్రైజ్ 2024' అవార్డులకుగానూ ఉత్తమ అంతర్జాతీయ చిత్రం' విభాగంలో షార్టు లిస్టు అయ్యింది. ఈ జాబితాలో మొత్తం ఐదు చిత్రాలు ఉన్నాయి. ఇందులో క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వం వహించిన 'ఓపెన్‌హైమర్'.. యోర్గోస్ లాంథిమోస్ తెరకెక్కించిన 'పూర్ థింగ్స్'తో పాటు 'ద జోన్ ఆఫ్ ఇంట్రస్ట్', 'సివిల్ వార్' చిత్రాలు ఉన్నాయి. మార్చి 14న జరిగే వేడుకలో విజేతల్ని ప్రకటిస్తారు. కాగా, ఇప్పటికే పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో 'లాపతా లేడీస్' ప్రదర్శితమై చక్కటి ఆదరణ పొందింది. ఈ ఏడాది భారత్ తరఫున ఆస్కార్‌కి ఎంపికైనా, కమిటీ తయారుచేసిన షార్టులిస్టులో మాత్రం స్థానం సంపాదించుకోలేకపోయింది.

బాలుడి కాలేయ మార్పిడికి రూ. 10.50 లక్షలు

- దినసరి కూలీ కుటుంబానికి ప్రజావాణి అండ
- సీఎం రేవంత్‌కు బాలుడి తల్లిదండ్రుల ధన్యవాదాలు


బాలుడు విశాల్

బేగంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం రేవంత్ ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం ఓ నిరుపేద బాలుడికి పునర్జన్మను ప్రసాదించింది. కాలేయం పూర్తిగా పాడయిన ఆ బాలుడికి దాని మార్పిడికి అవసరమైన రూ. 10.50 లక్షలను ముఖ్యమంత్రి తరఫున మంజూరు చేస్తూ.. మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణిలో అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లా పోలేపల్లి గ్రామానికి చెందిన దినసరి కూలీలు శంకర్, సరిత దంపతులు హైదరాబాద్‌లోని బోరబండలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు విశాల్ (10) అనారోగ్యంతో బాధపడుతుండడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. బాలుడి కాలేయం పూర్తిగా పాడయిందని వైద్యులు నిర్ధారించారు. కాలేయ మార్పిడికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో బాలుడి తల్లిదండ్రులు సాయం కోసం ప్రజావాణిలో ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యను కలిసి తమ పరిస్థితిని వివరించారు. అధికారుల సూచన మేరకు ప్రజావాణి రాజీవ్ ఆరోగ్య శ్రీ బృంద నాయకుడు సంతోష్ బాలుడి వివరాలను తెలుసుకున్నారు. బాలుడి కుటుంబానికి ఆరోగ్య శ్రీ కార్డు లేకపోవడంతో ఉన్నతాధికారుల ద్వారా అందుకు అవసరమైన పత్రాలను మంజూరు చేయించారు. అనంతరం కాలేయ మార్పిడికి అవసరమైన రూ. 10లక్షల 50వేలను రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా మంజూరు చేస్తూ.. ఉస్మానియా ఆస్పత్రిలో కాలేయ మార్పిడికి ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు నిమ్స్‌లోని జీవన్‌దాన్ ట్రస్టులో బాలుడి పేరును నమోదు చేయించారు. ప్రజావాణి ద్వారా తమ కుమారుడికి పునర్జన్మ లభించిందని ఈ సందర్భంగా విశాల్ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రితో పాటు ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యకు ధన్యవాదాలు తెలిపారు.

వచ్చే నెలలో కేసీఆర్‌కు పిలుపు

- తుది అంకానికి కాళేశ్వరం కమిషన్ విచారణ ..

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ తుది అంకానికి చేరుకుంది. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులను, విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేత కంచర్ల రఘును విచారించిన కమిషన్.. ఈ దఫా విచారణ షెడ్యూల్‌ను ముగించింది. తదుపరి విచారణలో భాగంగా ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో జస్టిస్ ఘోష్ హైదరాబాద్‌కు రానున్నారు. ఈ దఫా విచారణ కింద మాజీ సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక శాఖ మాజీ మంత్రి ఈటల రాజేందర్‌లకు సమన్లు పంపించి విచారించనున్నట్లు సమాచారం. కేసీఆర్ విచారణకు సహకరించకపోయినా, హాజరుకాకపోయినా.. ఇప్పటిదాకా సాక్షులు సమర్పించిన ఆధారాలే ప్రామాణికం చేసుకోవాలని కమిషన్ యోచిస్తోంది.

లేఖలోని అంశాలే అభిప్రాయాలుగా..

విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ విచారణను ఇప్పటికే ముగించి సంచలన నివేదికను సమర్పించారు. యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణంతో పాటు ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందంపై తొలుత జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ వేయగా... విచారణ ప్రక్రియలో భాగంగా నిర్ధారించిన అంశాలను ముందే వెలువరించడాన్ని తప్పుపడుతూ సుప్రీంకోర్టు జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డిని తప్పించిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టిన జస్టిస్ లోకూర్.. కేసీఆర్‌ను విచారణకు పిలవలేదు. అంతకుముందు జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్‌కు కేసీఆర్ రాసిన లేఖలోని అంశాలనే కేసీఆర్ అభిప్రాయాలుగా తీసుకొని జస్టిస్ లోకూర్ నివేదికను రూపొందించారు. ఇప్పుడు జస్టిస్ ఘోష్ కమిషన్ కూడా ఇదే ఫార్ములాను అనుసరించనున్నట్లు తెలుస్తోంది. సాధ్యమైనంతవరకు కేసీఆర్‌ను విచారణకు పిలిపించి ఆయన అభిప్రాయాలు తీసుకోవాలని, ఆరోగ్య కారణాలతో హాజరుకాకపోతే వర్చువల్ విధానంలో విచారించాలని, అయినా సహకరించకపోతే.. ఇప్పటికే ఉన్న ఆధారాలను ప్రాతిపదికగా తీసుకొని నివేదికను ప్రభుత్వానికి అందించాలనే యోచనతో ఉన్నట్లు సమాచారం. ఫిబ్రవరి నెల అంతా క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను పూర్తిచేసి, మార్చి నెలాఖరుకల్లా నివేదికను అందించాలని కమిషన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఏసీబీకి చిక్కిన ఎస్సై, కానిస్టేబుల్

తిరుమలగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం కేసు నుంచి తప్పించడానికి రూ.3లక్షలు డిమాండ్ చేసిన ఎస్సై, కానిస్టేబుల్ ఏసీబీకి పట్టుబడ్డారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో మంగళవారం ఈ ఘటన జరిగింది. ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చందర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 12న తిరుమలగిరి పోలీసులు తనిఖీలు చేస్తుండగా పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఓ డీసీఎం పట్టుబడింది. డ్రైవర్‌ను విచారించగా సిద్దిపేట జిల్లా రాయపోలు మండలం వడ్డేపల్లికి చెందిన రైస్‌మిల్లు యజమాని చంద్రశేఖర్ పేరు చెప్పాడు. ఎస్సై సురేశ్, సదరు వ్యాపారిని స్టేషన్‌కు పిలిపించి, కేసు నుంచి తప్పించడానికి రూ.3లక్షలు డిమాండ్ చేశారు. రూ.లక్ష ఇస్తానని చంద్రశేఖర్ ఒప్పందం చేసుకున్నాడు. ఈ నెల 25, 28 తేదీల్లో తిరుమలగిరిలోని ఓ ఖాతాలోకి ఎస్సై చెప్పినట్టుగా రూ.30వేలు, రూ.70వేలు చంద్రశేఖర్ బదిలీ చేశాడు. అదే స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ నాగరాజు ఫోన్‌పేకు రూ.30వేలు పంపాడు. అయితే మళ్లీ డబ్బు కావాలని ఎస్సై సురేశ్ డిమాండ్ చేయడంతో చంద్రశేఖర్ ఏసీబీని ఆశ్రయించాడు. రైస్ మిల్లు వ్యాపారి చంద్రశేఖర్ రూ.75వేల నగదును కానిస్టేబుల్ నాగరాజుకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

విషాద హారతి!

- హుస్సేన్‌సాగర్ అగ్నిప్రమాద ఘటనలో ఇద్దరి మృతి
- చికిత్స పొందుతూ యువకుడు గణపతి తుదిశ్వాస
- గల్లంతైన అజయ్ మృతదేహం లభ్యం
- కిషన్‌రెడ్డి విచారం.. బాధితులను ఆదుకుంటామని ప్రకటన

హైదరాబాద్, ఖైరతాబాద్/రాంగోపాల్ పేట, బర్కత్‌పుర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'భరతమాతకు మహా హారతి' ఈసారి రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. హుస్సేన్ సాగర్ నట్ట నడుమ ఓ బోటులో పటాకులు పేలుస్తూ ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని తీవ్రంగా గాయపడ్డ గణపతి అనే యువకుడు, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందితే.. అదేరోజు సాయంత్రం, ప్రమాదం జరిగిన రోజు అగ్ని కీలల నుంచి తప్పించుకునేందుకు నీళ్లలో దూకి గల్లంతైన అజయ్ అనే యువకుడి మృతదేహం పైకి తేలింది. 'భరతమాట ఫౌండేషన్' ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం రోజైన ఆదివారం సాయంత్రం 'భరతమాతకు మహా హారతి' పేరిట వేడుకలో భాగంగా హుస్సేన్‌సాగర్‌లో రెండు బోట్లలో పటాకులు పేల్చుతుండగా నిప్పురవ్వలు ఎగిసి.. పటాకుల నిల్వలపై పడి పేలడంతో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రెండు బోట్లూ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో నాగారానికి చెందిన బీటెక్ విద్యార్థి అజయ్ గల్లంతవ్వగా.. నలుగురు తీవ్రంగా, ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ నలుగురిని యశోదా ఆస్పత్రిలో చేర్పించగా వారిలో చికిత్స పొందుతూ గణపతి మృతిచెందాడు. ఇక ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం సాయంత్రం 6:10 గంటలకు ఘటనాస్థలి నుంచి 50 మీటర్ల దూరంలో అజయ్ మృతదేహం లభ్యమైంది. ఇద్దరు యువకుల మృతిపట్ల కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'బోటు ప్రమాదంలో గణపతి, అజయ్ అనే ఇద్దరు యువకులు చనిపోయారనే విషయం నన్ను తీవ్రంగా కలిచివేసింది. రెండు కుటుంబాలకు భారమైన హృదయంతో ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను భరతమాత ఫౌండేషన్ ద్వారా ఆ రెండు కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటాం' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

మల్లన్న ఆలయం వద్ద మహిళా అఘోరి వీరంగం

- దర్శనం కోసం వచ్చి కత్తితో హల్‌చల్
- ఒకరికి గాయాలు.. మరొకరి సెల్‌ఫోన్ ధ్వంసం

చేర్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద వ్యాఖ్యలు, చేష్టలతో తెలుగు రాష్ట్రాలలో కలకలం రేపుతున్న మహిళా అఘోరి ఈసారి వీరంగం సృష్టించింది. సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం వచ్చిన అఘోరి కత్తి పట్టుకుని భయభ్రాంతులకు గురిచేసింది. సహనం కోల్పోయి పలువురిపై దాడికి పాల్పడి హల్‌చల్ చేసింది. వివరాలిలా ఉన్నాయి. మహిళా అఘోరి మంగళవారం మధ్యాహ్నం మల్లికార్జునస్వామి దర్శనం కోసం కొమురవెల్లికి చేరుకుంది. ఒంటిపై ఎలాంటి వస్త్రం లేకుండానే స్వామి వారిని దర్శించుకునేందుకు ఆలయం గంగిరేగుచెట్టు ప్రాంగణం వరకు చేరుకుంది. కానీ దుస్తులు ధరించిన తరువాత మాత్రమే దర్శనానికి రావాలని ఆలయవర్గాలు సూచించడంతో వెనక్కిమళ్లి ఆలయ ప్రాంగణంలో పార్కింగ్ చేసిన తన కారులో కూర్చుంది. అఘోరి వచ్చిందన్న విషయం తెలిసిన స్థానికులు, భక్తులు భారీగా గుమిగూడారు. విషయం తెలిసిన పోలీసులు చేరుకుని అఘోరికి నచ్చచెప్పారు. కానీ ఆలయ ప్రధాన ద్వారం నుంచి దర్శనానికి అనుమతి ఇవ్వాలంటూ అఘోరి పట్టుబడింది. ఇదే సమయంలో కొంత అసహనానికి గురై కారులో నుంచి కత్తితో బయటకు వచ్చి వీరంగం చేసింది. దీంతో జనాలు భయంతో పరుగెత్తగా, కత్తితో చేసిన దాడిలో యాదగిరి అనే వ్యక్తి వీపుపై గాట్లు పడ్డాయి. చిత్రీకరిస్తున్న వీడియో జర్నలిస్ట్ లింగం ఫోన్‌ను కిందపడేసి ధ్వంసం చేసిన అఘోరి కారులోపలికి వెళ్లి కూర్చుంది. కాసేపటి తరువాత పోలీసు సిబ్బంది, ఆలయాధికారుల సూచన మేరకు దుస్తులు ధరించి ఆలయం లోపలికి వెళ్లి మల్లన్నను దర్శించుకుని తాంత్రిక సంజ్ఞలు చేసింది. అర్చన నిర్వహింపచేసిన అనంతరం అర్చకులు స్వామివారి ప్రసాదం అందించారు. తరువాత మహిళా అఘోరి వెనుదిరిగి వెళ్లిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



కత్తితో జరిపిన దాడిలో యాదగిరి అనే వ్యక్తి వీపుపై పడిన గాటు; కారులో మహిళా అఘోరీ

పిచ్చోడు.. తిక్కలోడు

(మొదటిపేజీ తరువాయి)

నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానం, నిర్దిష్టమైన ప్రణాళిక కలిగి ఉన్న కారణంగానే ప్రపంచ అగ్రశ్రేణి కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ ప్రభుత్వంపై విశ్వాసం, నమ్మకంతో పెట్టుబడులు పెట్టడం ద్వారా వ్యాపార విస్తరణతో పాటు ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడానికి ముందుకొచ్చిన సంస్థలకు అభినందనలు తెలుపుతున్నానన్నారు.

చాలా ప్రత్యేక విజయం

"దావోస్ పర్యటనలో రూ. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్ర ప్రభుత్వం ఆకర్షించింది. ఇది చాలా ప్రత్యేక విజయం" అని రేవంత్‌రెడ్డి అన్నారు. అక్రమ నిధులతో కొందరు విష ప్రచారం చేస్తున్నా కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి ప్రభుత్వంపై విశ్వాసం చాటాయని కొనియాడారు. "2004 కంటే ముందున్న తెలుగుదేశం ప్రభుత్వం అనుసరించిన విధానాలు రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటే తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని కొనసాగించింది. ఇప్పుడు కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన విధానాల్లో మేలు చేసేవి ఏమైనా ఉంటే రాజకీయాలను పక్కనబెట్టి మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడుల మీద అపోహలు, అనుమానాలు సృష్టిస్తూ విష ప్రచారం చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక మూలాలను దెబ్బ తీయాలని బీఆర్ఎస్ కుట్రలు పన్నుతోందని రేవంత్ ఆరోపించారు. తాము విపక్షంలో ఉండగా ఏనాడూ అలా ప్రవర్తించలేదని, రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే వ్యతిరేకించలేదని అన్నారు. సింగపూర్‌తో చేసుకున్న నైపుణ్యాల అభివృద్ధి ఒప్పందం యువతకు భారీ ఎత్తున ఉపాధి కల్పించబోతోందని చెప్పారు.

అటెన్షన్ సీకింగ్ డిజార్డర్‌తో బాధ పడుతున్నడు

అమెజాన్, సన్ పెట్రో కెమికల్స్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్.. ఇలా అనేక ప్రముఖ సంస్థలు ఒప్పందాలు చేసుకుంటే కొందరు లేకితనంతో, అజ్ఞానంతో మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఒప్పందాలపై అనుమానాలు ఉండే ధ్రువీకరించుకోవాలని సూచించారు. పెట్టుబడులను స్వాగతించే విశాల హృదయం లేని వారు మౌనంగా ఉండాలని సీఎం సలహా ఇచ్చారు. ఏ ఏ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నామో జాబితాలు, ఫోటోలు అన్నీ బహిరంగంగానే ఉన్నాయని గుర్తు చేశారు. పెళ్లికి పోతే పెళ్లి కుమారుడిలా, చావుకు పోతే శవంలా అందరి దృష్టి తనపైనే ఉండాలనే ఒక రకమైన జబ్బుతో కేటీఆర్ బాధ పడుతున్నారని రేవంత్ పరోక్షంగా వ్యాఖ్యానించారు. అటెన్షన్ సీకింగ్ డిజార్డర్‌తో బాధ పడుతున్న నాయకుడిని మంచి డాక్టర్‌కు చూపించాలని, డబ్బులు తక్కువ పడితే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఇప్పిస్తానని అన్నారు. ఈ కారు రేసింగ్‌ను రద్దు చేసి పెట్టుబడుల అవకాశాలు దెబ్బ తీశారంటూ తన మీద క్రిమినల్ కేసు పెట్టాలంటూ బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంపై రేవంత్‌రెడ్డి స్పందించారు. తాము విదేశాల నుంచి పెట్టుబడులు తెచ్చామని, విదేశాల్లో సొమ్ము దాచుకున్న నేత తరఫున ఫిర్యాదు చేసిన ప్రవీణ్ కుమార్ బానిస మనస్తత్వం నుంచి బయటకురావాలన్నారు. భారీగా పెట్టుబడులు సాధించినందుకు రాష్ట్రంలో అంతా సంతోషపడుతుంటే ఒకే ఒక్కడు విపరీతంగా బాధ పడుతున్నాడని వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబు కూడా మీడియాతో మాట్లాడారు. ఒప్పందాలతోనే సంబరపడిపోవడం లేదని, ఇవి అమల్లోకి వచ్చి స్థానికులకు ఉపాధి అవకాశాలు వచ్చినప్పుడే విజయం సాధించినట్లని వ్యాఖ్యానించారు. మూసీ ప్రక్షాళనకు సింగపూర్ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. సింగపూర్ ఐటీఈతో ఒప్పందంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త సిలబస్ ప్రవేశ పెట్టడానికి వీలు కలిగిందన్నారు. సింగపూర్‌తో రూ.4 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు.దావోస్ ఒప్పందాలతో 51,400 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మల్టీవ్యాక్ అనే స్విస్ కంపెనీ హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయనుందని తెలిపారు. "గతేడాది 18 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటే అందులో 17 అమల్లో ఉన్నాయి. 10 కంపెనీలు నిర్మాణాలు ప్రారంభించి 70శాతం పనులు పూర్తయ్యాయి. మరో 7 ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉన్నాయి" అని వివరించారు.



రేవంత్ వల్లే మొబిలిటీ వ్యాలీ రాలేదు

- బంధువులు, మిత్రులకు టెండర్లు
- ఈ-కార్ రేసులో సీఎం అవాస్తవాల ప్రచారం : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, నార్సింగ్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనాలోచిత చర్యల వల్ల తెలంగాణకు నష్టం కలుగుతోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి అమెరికా వెళ్లి తన బంధువులు, స్నేహితులకు టెండర్లు ఇప్పించుకుంటున్నారని ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో, నార్సింగ్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పరిశ్రమలు నెలకొల్పి వేలాదిమందికి ఉద్యోగావకాశాలు దక్కేవిధంగా మొబిలిటీ వ్యాలీ అనే కార్యక్రమాన్ని సంకల్పించిందని, అయితే రేవంత్ రెడ్డి చర్యల వల్ల అది రాకుండా పోయిందని ఆరోపించారు. ఈ-కార్ రేసును రద్దు చేయడంతో పాటు అస్తవ్యస్త విధానాలతో తెలంగాణకు రావాల్సిన వేలాది ఉద్యోగావకాశాలు చేజారే పరిస్థితి తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసు పెట్టి విచారించాలని కోరుతూ నార్సింగి ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు ఆర్ఎస్ ప్రవీణ్ వెల్లడించారు.

కొత్తగా రెండు ఐటీ పార్కులు

మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, జనవరి 28: హైటెక్ సిటీ తరహాలోనే హైదరాబాద్ శివార్లలో కొత్తగా రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. ఇందుకోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఐటీ రంగంలో హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రముఖ కంపెనీలు ఇక్కడ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొస్తున్నాయని అన్నారు. హైదరాబాద్‌లో రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన 'డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో సచివాలయంలో మంత్రి సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రెండు ఐటీ పార్కులకు ఏయే ప్రాంతాలు అనుకూలంగా ఉన్నాయనే విషయమై అధికారులు అధ్యయనం చేస్తున్నారని చెప్పారు. నగరంలో ఎక్కడి నుంచైనా ఈ పార్కులకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. హైదరాబాద్‌లో 100 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన డ్యూ సాఫ్ట్‌వేర్ కంపెనీని సంతోషంగా ఆహ్వానిస్తున్నామని, ప్రభుత్వం తరఫున పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ఐదేళ్లలో ఈ సంస్థ 900 మందికి ఉపాధి అవకాశాలను కల్పించనుందని పేర్కొన్నారు.

రైతులకు సబ్సిడీతో ట్రాక్టర్లు.. డ్రోన్లు

- మొత్తంగా 20 రకాల సాగు పరికరాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- కంపెనీలతో ఒప్పందాలకు టెండర్ల ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో యాంత్రీకరణపై సర్కారు దృష్టి పెట్టింది. రైతులకు సబ్సిడీ కింద ట్రాక్టర్లు, కల్టివేటర్లు, మందులు పిచికారీ చేసేందుకు డ్రోన్లు, పవర్ స్ప్రేయర్లు సహా సాగులో ఉపయోగపడే 20 పరికరాలను ఇవ్వాలని నిర్ణయించింది. ఈ పరికరాల తయారీ కంపెనీలతో ఒప్పందం చేసుకునేందుకు వ్యవసాయ శాఖ టెండర్లు ఆహ్వానించింది. కంపెనీలకు ఫిబ్రవరి 7వ తేదీ వరకు టెండర్ల దాఖలుకు అవకాశం కల్పించింది. బిడ్‌లను ఫిబ్రవరి 8న తెరవనున్నారు. సబ్సిడీ కింద ఇచ్చే పరికరాల కోసం రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల దాకా ఖర్చవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. గత ప్రభుత్వ హయాంలోనే యాంత్రీకరణ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో అమలు చేయలేదు. కాగా రైతులకు సబ్సిడీ కింద ఇవ్వనున్న పరికరాలలో 600 ట్రాక్టర్లు, 160 వరకు డ్రోన్లు ఉన్నాయి. దుక్కి కోసం ట్రాక్టర్లకు కల్టివేటర్, ప్లవ్, రోటవేటర్లు సహా అమర్చే వివిధ పరికరాలనూ అధిక మొత్తంలో ఇవ్వనుంది. కాగా టెండర్లలో పేర్కొన్న వివరాల ప్రకారం రోటవేటర్లు 12వేల యూనిట్లు, కల్టివేటర్లు 4వేల యూనిట్లు, ప్లవ్ రూ.2వేల యూనిట్లు, గడ్డికట్టే యంత్రాలు 200 యూనిట్లు, భూమిపై గడ్డిని తొలగించే బ్రష్ కట్టర్లు 400, పొలం గట్లు వేసే బండ్ ఫార్మర్లు 64, మొక్కల మధ్య ఉన్న గడ్డిని తొలగించేందుకు పవర్ వీడర్స్ 200 ఇవ్వనున్నారు. మొక్కజొన్నను గింజలుగా వేరు చేసే యంత్రాలు 80, పవర్ ట్రిల్లర్‌లు 420 వరకు ఇవ్వాలని నిర్ణయించారు. ఇక 16-20 లీటర్ల ట్యాంకు సామర్థ్యంతో ఉన్న పవర్ స్ప్రేయర్‌లు 12వేలు, 12-16 లీటర్ల ట్యాంకు సామర్థ్యంతో ఉన్న పవర్ స్ప్రేయర్‌లు 6,300, డీజిల్, కరెంటుతో నడిచే పంప్‌సెట్లు 1,230 యూనిట్లతో పాటు నీటిని సరఫరా చేసే పీవీసీ, హెచ్‌డీపీఈ పైపులు 1,40,000, స్టోరేజీ బిన్స్ 50వరకు ఇవ్వాలని నిర్ణయించారు.

డిమాండ్‌కు తగ్గట్టుగా ఎరువుల నిల్వలు : తుమ్మల

హైదరాబాద్, జనవరి28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో డిమాండ్‌కు తగినంతగా ఎరువుల నిల్వలు ఉన్నాయని, పంపిణీలో రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సచివాలయంలో వ్యవసాయ శాఖపై అధికారులతో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. మార్క్‌ఫెడ్ కందిపంట కొనుగోలుకు ప్రస్తుతం 21 కేంద్రాలు ప్రారంభించిందని, రైతులు మద్దతు ధర రూ. 7,550కి తమ కందిపంటను అమ్ముకోవాలని కోరారు. మార్క్‌ఫెడ్ నిర్మించిన గోదాములను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. హాకా వ్యవసాయ శాఖ చేపట్టే కార్యక్రమాలకు తోడ్పాటు అందించాలని హాకా ఎండీని మంత్రి ఆదేశించారు.

ప్రకృతి వనంగా తెలంగాణ

'ఎక్స్‌పీరియం' ఎకో ఫ్రెండ్లీ పార్కు ప్రారంభంలో సీఎం రేవంత్‌రెడ్డి


'ఎక్స్‌పీరియం' ఎకో ఫ్రెండ్లీ పార్కు

రంగారెడ్డి అర్బన్/శంకర్‌పల్లి, జనవరి28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను ప్రకృతి వనంగా తీర్చిదిద్దాలనేది తమ ఆశయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఎకో టూరిజాన్ని ప్రోత్సహించేందుకు సరికొత్త పర్యాటక పాలసీని తీసుకువస్తామని ప్రకటించారు. పర్యావరణ ప్రేమికుడు రాందేవ్.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం పొద్దుటూరులో ఏర్పాటు చేసిన 'ఎక్స్‌పీరియం' ఎకో ఫ్రెండ్లీ పార్కును ముఖ్యమంత్రి మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రముఖ సినీ నటుడు చిరంజీవి ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట ఉన్నారు. ఎక్స్‌పీరియం సందర్శన అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఐటీ, ఫార్మా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహా వివిధ రంగాల్లో ముందున్న తెలంగాణలో టెంపుల్ టూరిజం, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. టెంపుల్, ఎకో టూరిజం వృద్ధితో రాష్ట్ర ఆదాయం, గౌరవం పెరగడంతోపాటు మరింత గుర్తింపు కూడా లభిస్తుందని చెప్పారు. అన్ని సహజ వనరులు ఉన్న తెలంగాణలో హెల్త్, ఎకో టూరిజం అభివృద్ధిపై గత ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎకో టూరిజం అంశంపై ఇటీవల అసెంబ్లీ చర్చించామని చెప్పారు. హెల్త్, ఎకో, టెంపుల్ టూరిజంలను ప్రోత్సహించేందుకు త్వరలోనే కొత్త పాలసీని తీసుకువస్తామని అన్నారు. ప్రభుత్వం కంటే ముందుగా రాందేవ్ ఎకో టూరిజం పార్కును ఏర్పాటు చేశారని, పొద్దుటూరులోని 150 ఎకరాల్లో అద్భుతం సృష్టించారని కొనియాడారు. ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా అభివృద్ధి జరుగుతుండడం వల్లే ఎక్స్‌పీరియం ప్రారంభంలో తాను పాల్గొన్నానని సీఎం వివరించారు. ఎకో టూరిజం పాలసీలో ప్రభుత్వం కూడా పార్కులను అభివృద్ధి చేయనుందని ప్రకటించారు.హరితహారం ద్వారా జరిగే మొక్కల పెంపకానికి సంబంధించిన విధివిధానాల్లో మార్పులు చేసి రాష్ట్రాన్ని ప్రకృతి వనం చేస్తామని వెల్లడించారు. మొక్కలు నాటి పద్మశ్రీ పురస్కారం అందుకున్న ఖమ్మంలోని మారుమూల ప్రాంతానికి చెందిన రామయ్య ఈ విషయంలో అందరికీ ఆదర్శం కావాలని అన్నారు. ఇక ఎక్స్‌పీరియం హైదరాబాద్‌కు మణిహారం అని, ఎందరికో ఉపాధి లభిస్తుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

నా సంపాదన అంతంతమాత్రమే

ఎక్స్‌పీరియం హైదరాబాద్‌కు తలమానికం కానుందని ప్రముఖ సినీ నటుడు చిరంజీవి అన్నారు. తాను ఇంటి నిర్మాణం చేపట్టినప్పుడు రాందేవ్ వద్ద కొన్ని మొక్కలు కూడా తీసుకున్నానని తెలిపారు. ఎక్స్‌పీరియంను చూశాక రాందేవ్ వ్యాపారవేత్తగా కాక తనకో కళాకారుడు కనిపిస్తాడని కొనియాడారు. ఎక్స్‌పీరియంలో వచ్చే శీతాకాలంలో సినిమా చిత్రీకరణ చేస్తానని ప్రకటించారు ఇక, కొత్త మొక్కలు వచ్చాయి చూస్తారా? అని రాందేవ్ అప్పుడప్పుడు తనని అడుగుతుంటారని, వేలు, లక్షల్లో ఉండే ఆ మొక్కలు ధరలు ప్రస్తుతం రూ.కోట్లలో ఉన్నాయని అన్నారు. అసలే తన సంపాదన అంతంతమాత్రంగా ఉందని, ఈ మొక్కలు కొనగలమా? అని అనిపిస్తుందని చిరంజీవి ఛలోక్తి విసిరారు. అయితే, పార్కును తిలకించిన తర్వాత ఆ మొక్కలన్నీ కొనుగోలు చేయాలని అనిపిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

అరుదైన మొక్కలు, అద్భుత శిల్పాలు

పొద్దుటూరులో 150 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియం పార్కులో 25 వేల జాతుల మొక్కలు, కనువిందు చేసే శిల్పాలు కొలువుదీరాయి. 85 దేశాల నుంచి వీటిని దిగుమతి చేశారు. రూ.50 కోట్ల వ్యయంతో 12 ఎకరాల్లో ఓ బీచ్‌ను కూడా ఏర్పాటు చేశారు. 40 గదులు, 20 కాటేజీలతో ఓ రిసార్టును ఓ ద్వీపంలా తీర్చిదిద్దారు. ఎక్స్‌పీరియం త్వరలోనే సందర్శకులకు అందుబాటులోకి రానుంది. ప్రవేశ రుసుము రూ.1600గా నిర్ణయించనున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఎలా ఇద్దాం?

- సరఫరాపై అధ్యయనం చేయండి
- ఇసుక మాఫియాను అరికట్టాలి
- అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నలుగురు ఉన్నతాధికారులతో కమిటీ
- వారంలోపు నివేదిక ఇవ్వాలని ఆదేశం
- 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి 112 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు ఏవిధంగా ఇసుక సరఫరా చేయాలనే అంశంపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీనికోసం ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, టీజీ ఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్‌తో ఓ అధ్యయన కమిటీని నియమించారు. వారంలోపు అధ్యయనాన్ని పూర్తి చేసి నివేదిక సమర్పించాలని కమిటీకి సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా... గనుల శాఖపై సచివాలయంలో సీఎం రేవంత్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన నేపథ్యంలో లబ్ధిదారులకు ఇసుక ఏవిధంగా సరఫరా చేయాలనే దానిపై అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఏటేటా నిర్మాణాలు పెరుగుతున్నా ఇసుక నుంచి ప్రభుత్వానికి ఆశించినంత ఆదాయం రావడం లేదని, అదే సమయంలో వినియోగదారులు ఎక్కువ ధరకే ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోందని చెప్పారు. వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక అందడంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా చూడాలని సూచించారు. ఇసుక మాఫియాను అరికట్టాలని ఆదేశించారు. మైనర్ ఖనిజాల గనులపై వేసిన జరిమానాల వసూళ్లపై ప్రశ్నించారు. మేజర్, మైనర్ ఖనిజ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేసి రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని కమిటీని ఆదేశించారు. సమీక్షలో గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి పాల్గొన్నారు.

తక్కువ ధరకే..ఇచ్చే యోచన

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇంటికి అవసరమయ్యే ఇసుక, ఇనుము, సిమెంటును లబ్ధిదారులకు తక్కువ ధరలే ఇచ్చే విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుంది. ఇందుకు సంబంధించి గృహ నిర్మాణ సంస్థ ఒక ప్రతిపాదన కూడా సిద్ధం చేసింది. ఒక్కో ఇంటికి ఎంత సిమెంటు, ఇనుము, ఇసుక అవసరం అనే అంచనాలను గృహ నిర్మాణ సంస్థ అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. ఈ మేరకు ఒక్కో ఇంటి నిర్మాణానికి 25 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుందని, రాష్ట్రవ్యాప్తంగా 4.50లక్షల ఇళ్ల నిర్మాణానికి దాదాపు 112 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమవుతుందని పేర్కొన్నారు. ఒక్కో ఇంటికి 9 మెట్రిక్ టన్నుల సిమెంటు చొప్పున, 40.50లక్షల మెట్రిక్ టన్నుల సిమెంటు, ఒక్కో ఇంటికి 1.5 మెట్రిక్ టన్నుల చొప్పున సుమారు 68లక్షల మెట్రిక్ టన్నుల ఇనుము కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇసుక సరఫరా విధానంపై కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోనుంది.

అటవీ భూములను డీనోటిఫై చేసే అధికారం కలెక్టర్లకు లేదు

» కొంగరకలాన్‌లోని 72 ఎకరాలపై హైకోర్టు వ్యాఖ్య

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అటవీ చట్టం-1967 ప్రకారం ఒకసారి అటవీభూములుగా నోటిఫై చేసిన వాటిని కలెక్టర్ సైతం డీనోటిఫై చేయలేరని హైకోర్టు వ్యాఖ్యానించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్ సర్వే 249లోని 1026 ఎకరాల అటవీభూమి నుంచి 72 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి డీనోటిఫై చేసి పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇవ్వాలని 2019లో అప్పటి కలెక్టర్ ఆదేశించడంపై ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ కే ప్రవీణ్‌గౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదిస్తూ.. ఎలాంటి విచారణ నిర్వహించకుండా ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించడం అక్రమని పేర్కొన్నారు. ఆర్టీఐ దరఖాస్తుకు రంగారెడ్డి కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఇచ్చిన సమాధానంలో సైతం 2019లో కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులకు సంబంధించిన ఎలాంటి రికార్డు అందుబాటులో లేవని పేర్కొన్నారని తెలిపారు. ఈ విషయాలన్నీ తేలేవరకు వివాదాస్పద భూమి తత్వాన్ని మార్చరాదంటూ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంటూ రెవెన్యూ ముఖ్యకార్యదర్శి, రంగారెడ్డి కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 24కు వాయిదా పడింది.

విద్యుత్ సలహా మండలి పునర్ వ్యవస్థీకరణ

» గెజిట్ విడుదల చేసిన ఈఆర్‌సీ

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంపై డిస్కమ్‌లు సిద్ధం చేసే పాలసీలపై నిరంతరం చర్చించడం, నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు సేవలు, వినియోగదారుల ప్రయోజనాలపై విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ)కి సూచనలు అందించడానికి వీలుగా రాష్ట్ర సలహా మండలి (ఎస్‌ఏసీ)ని పునర్‌వ్యవస్థీకరిస్తూ తెలంగాణ ఈఆర్‌సీ నిర్ణయం తీసుకుంది. మంగళవారం గెజిట్ విడుదల చేసింది.

విద్యుత్ ఉద్యోగుల డీఏ పెంపు

విద్యుత్ ఉద్యోగుల డీఏను పెంచుతూ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి, జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెరిగిన డీఏ 2024 జూలై 1 నుంచి అమల్లోకి రానుండగా.. జనవరి నెల నుంచే వేతన రూపంలో అందనుంది. 2024 జనవరి 1 నుంచి 11.780 శాతంగా ఉండగా.. దీన్ని 14.074 శాతానికి పెంచారు. దాంతో ఉద్యోగులు, పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు 2024 జూలై నుంచి డిసెంబరు దాకా బకాయిలను జీపీఎఫ్ అకౌంట్‌లలో జమచేయనున్నారు. దీంతో ఫిబ్రవరి 1న పెరిగిన డీఏతో ఉద్యోగులు వేతనాన్ని అందుకోనున్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు ఒక డీఏ మాత్రమే (జనవరి 1 నుంచి) పెండింగ్‌లో ఉంది.

అతివేగానికి ముగ్గురు బాలురు బలి

» ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో..

రాజేంద్రనగర్, జనవరి28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభమైన మన్మోహన్‌సింగ్ ఫ్లైఓవర్‌పై సోమవారం అర్ధరాత్రి తర్వాత ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనంపై మితిమీరిన వేగంతో ప్రయాణించిన ముగ్గురు బాలురు.. మన్మోహన్‌సింగ్ ఫ్లైఓవర్‌పై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పాతబస్తీ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ (16), మహ్మద్ అహ్మద్ (14), సయ్యద్ మాజ్ (14) మరణించారని పోలీసులు ప్రకటించారు. సయ్యద్ అహ్మద్, సయ్యద్ మాజ్ ఘటనాస్థలిలోనే మరణించగా, ఇమ్రాన్ ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. రంజాన్ పండగకు నెల రోజుల ముందు జరుపుకొనే షబ్బే మెరాజ్ కార్యక్రమాన్ని ముస్లింలు సోమవారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా భాగంగా ముస్లింలు రాత్రంతా జాగారం చేసి అల్లాను ప్రార్థిస్తారు. ఇందులో భాగంగా ఇమ్రాన్, అహ్మద్, మాజ్ తమ ఇళ్ల నుంచి బయటికొచ్చి ద్విచక్రవాహనంపై తిరుగుతూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.

ఐఏఎంసీకి భూమి కేటాయింపుపై తీర్పు రిజర్వు

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు రూ.3.7 ఎకరాల భూమి, ఏడాదికి రూ. 3 కోట్ల చొప్పున కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు మంగళవారం తీర్పు రిజర్వు చేసింది. ఐఏఎంసీ పూర్తిగా ప్రైవేటు సంస్థ అని, దానికి ప్రజల సొమ్ము కేటాయించడం అక్రమమని పేర్కొంటూ కోటి రఘునాథరావు, ఎ. వెంక్రామిరెడ్డి అనే న్యాయవాదులు వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ సుజన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఐఏఎంసీ ప్రారంభమై మూడేళ్లవుతున్నా సొంతంగా ఆదాయాన్ని సమకూర్చుకోలేదా? అని ధర్మాసనం ప్రశ్నించింది. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

ఎస్తేర్ అనూహ్య అత్యాచారం హత్య కేసులో చంద్రభాన్ సనప్ నిర్దోషి

» ఏపీ యువతి హత్య కేసులో సుప్రీం కోర్టు సంచలన తీర్పు

» ఉరిశిక్ష పడిన నిందితుడిని విడుదల చేయాలని ఆదేశం

» నేరం నిరూపణలో ప్రాసిక్యూషన్ విఫలమైందని వ్యాఖ్య

మచిలీపట్నం (ఆంధ్రజ్యోతి), న్యూఢిల్లీ, జనవరి 28: ఏపీలోని కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎస్తేర్ అనూహ్యపై అత్యాచారం, హత్య కేసులో సుప్రీంకోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ముంబైకి చెందిన నిందితుడు చంద్రభాన్ సనప్‌ను నిర్దోషిగా ప్రకటించింది. నేరం రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని పేర్కొంటూ.. సనప్‌ను తక్షణమే విడుదల చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మచిలీపట్నానికి చెందిన ఎస్తేర్ అనూహ్య(26) ముంబైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసేది. క్రిస్మస్ సెలవుల కోసం సొంతూరుకు వచ్చిన ఆమె.. విజయవాడ నుంచి రైలులో బయల్దేరి 2015 జనవరి 5 తెల్లవారుజామున కుర్లాలోని లోకమాన్య తిలక్ టెర్మినల్‌కు చేరుకుంది. ఆ తర్వాత కొన్ని రోజులపాటు అదృశ్యమైన ఆమె.. పదిరోజుల తర్వాత ముంబైలోని కుంజూర్ మార్గ్ వద్ద శవంగా కనిపించింది. ఎస్తేర్‌ను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసి, ఆపై హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. ఆమెను హాస్టల్ వద్ద డ్రాప్ చేస్తానని నమ్మించి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం, హత్య చేశాడన్న ఆరోపణలపై ట్యాక్సీ డ్రైవర్ చంద్రభాన్ సనప్‌ను అరెస్టు చేశారు. అప్పట్లో సంచలనంగా మారిన ఈ కేసులో 2015లో ప్రత్యేక మహిళా కోర్టు సనప్‌కు మరణశిక్ష విధించింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును 2018లో బాంబే హైకోర్టు సమర్థించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సనప్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. కాగా, ప్రాసిక్యూషన్ కథనంలో లోపాలను గుర్తించిన సుప్రీంకోర్టు మంగళవారం ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. చంద్రభానే ఈ హత్య చేశాడని ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందని వ్యా ఖ్యానించింది. ఇలా మరణ శిక్ష పడిన ఖైదీని నిర్దోషిగా విడుదల చేయ డం ఇది రెండోసారి. ఇటీవల ఇదే తరహా కేసులో మరణశిక్ష పడి త్రిసూర్‌లోని వియ్యూరు సెంట్రల్ జైలులో ఉన్న జొమోన్ అనే వ్యక్తిని కూడా కేరళ హైకోర్టు నిర్దోషిగా ప్రకటించింది.

మేమిచ్చిన ఓఆర్ఆర్ లీజు లక్ష కోట్లతో సమానం

ప్రభుత్వానికి ముందే 7,380 కోట్లు వచ్చాయి.. 30 ఏళ్లకు దాని విలువ 96 వేల కోట్లు

» 20 ఏళ్ల క్రితం తులం బంగారం 5,500

» ఇప్పుడు 80 వేలు... 4 లక్షలూ అవుతుంది

» అతిపెద్ద రోడ్డు లీజు పారదర్శకంగా ఇచ్చాం

» దీనిపై ప్రభుత్వంతో ఎక్కడైనా చర్చకు సిద్ధం

» రోజుకు 5 కోట్ల ఆదాయం అంచనా కలే

» ఓఆర్ఆర్ ఆరోపణలపై బీఆర్ఎస్ వివరణ

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)ను 30 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చిన టెండర్లలో వేల కోట్ల అవినీతి జరిగిందంటూ అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు అర్థ రహితమని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తమ ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న లీజు ఒప్పందంలో ఎలాంటి అవినీతి, అక్రమాలు లేవని స్పష్టం చేశాయి. దేశంలోనే అతి పెద్ద రోడ్డు లీజు ఒప్పందాన్ని అత్యంత పారదర్శకంగా చేపట్టామని పేర్కొంటున్నాయి. అర్థశాస్త్రం తెలిసిన వాళ్లు మాత్రమే ఈ ఒప్పందంలోని లాభదాయకతను అర్థం చేసుకోగలరని వ్యాఖ్యానిస్తున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణను ప్రైవేటు కంపెనీకి లీజుకు ఇవ్వడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి తీసుకున్న రూ.7,380 కోట్ల విలువ 30 ఏళ్ల తరువాత లక్ష కోట్ల రూపాయలతో సమానమని చెప్పాయి. ఆ విధంగా చూస్తే తమ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని లక్ష కోట్ల రూపాయల ఒప్పందంగా భావించవచ్చని తెలిపాయి. రెండు దశాబ్దాల క్రితం తులం బంగారం విలువ రూ.5500 ఉండేదని, ఇప్పుడు రూ.80,000 ఉందని బీఆర్ఎస్ వర్గాలు గుర్తు చేశాయి. అదే తులం బంగారం, అదే రూపాయి కరెన్సీ. కానీ, ఆ తులం కొనడానికి అవసరమయ్యే మొత్తం ద్రవ్యోల్బణం కారణంగా 20 ఏళ్లలో అన్ని రెట్లు పెరిగిందని ప్రస్తావించాయి. వచ్చే పదేళ్లలో తులం రూ.నాలుగు లక్షలు కూడా అవుతుందని చెప్పాయి. అదేవిధంగా ఓఆర్ఆర్ లీజు ఒప్పందంలో ప్రభుత్వం తీసుకున్న మొత్తం రూ.7,380 కోట్ల విలువ కూడా పలు రెట్లు పెరుగుతుందని వ్యాఖ్యానించాయి. ఔటర్ లీజులో ఎక్కడా కుంభకోణం లేదని, దీనిపై ప్రభుత్వంతో ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.



అంతా పద్ధతి ప్రకారం...

ఓఆర్ఆర్ ప్రాజెక్టు బిడ్డింగ్‌కి మాజర్స్ గ్రూప్ 2022 అక్టోబరులో ఒక అధ్యయనం చేసి ప్రాజెక్టు విలువను తేల్చి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని బీఆర్ఎస్ వర్గాలు గుర్తు చేశాయి. 142 రోజుల పాటు జరిగిన టెండర్ల ప్రక్రియలో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాతో పాటు 11 కంపెనీలు బిడ్డింగ్‌లో పాల్గొన్నాయని, నాలుగు కంపెనీలు ఫైనల్ బిడ్డింగ్‌కు వచ్చాయని ప్రస్తావించాయి. రూ.7380 కోట్ల బిడ్‌తో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్(టీవోటీ) పద్ధతిలో దక్కించుకుందని తెలిపాయి. దేశంలో పెట్టుబడిని రాబట్టుకొనే రహదారి లీజ్ ఒప్పందాల్లో ఇదే అతి పెద్దదని స్పష్టం చేశాయి. దేశంలో ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 8.5%-8.9% వరకు ఉందని తెలిపాయి. ఈ లెక్కన భవిష్యత్తు విలువ 30ఏళ్లకి రూ.89,531కోట్ల నుంచి రూ. 96,635కోట్ల వరకు ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలు అంచనా వేశాయి. దీన్ని బట్టే లీజులో ఎక్కడా అవినీతి జరగలేదని అర్థమవుతోందని వ్యాఖ్యానించాయి.

రోజుకు 4-5 కోట్ల వసూలు ఊహాగానమే

ఈ ఏడాది జనవరిలో రోజుకు రూ.2 కోట్ల వసూలు జరిగిందని, దీన్నిబట్టి కొన్ని రోజుల్లో రోజుకు రూ.4 నుంచి రూ.5 కోట్లు వస్తుందనే అంచనాలు ఊహాగానాలు మాత్రమేనని బీఆర్ఎస్ వ్యాఖ్యానించింది. వచ్చే 30 ఏళ్లలో మారుతున్న టెక్నాలజీ మొదలు మారుతున్న జీవన విధానం వరకు అనేక అంశాలు ఓఆర్ఆర్ ఆదాయాన్ని ప్రభావితం చేస్తాయని ప్రస్తావించింది. కోవిడ్ సమయంలో ఎవరూ ఓఆర్ఆర్ వాడలేదని గుర్తు చేసింది. కొవిడ్ లాంటి విపత్తులు, మెట్రో కనెక్టివిటీ పెరగడం, విద్యుత్తు వాహనాలు, వర్క్ ఫ్రమ్ హోం, ఎక్కడి వాళ్లు అక్కడ ఉండి సమావేశాలు జరుపుకొనే హాలోగ్రామ్ లాంటి కొత్త టెక్నాలజీ రావడం.. తదితర అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని మాజర్స్ సంస్థ అధ్యయనం చేసి, ఓఆర్ఆర్ ఆదాయం మీద రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని బీఆర్ఎస్ తెలిపింది. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థకు ఇలాంటి లీజులు కొత్త కాదని, అప్పటికే ముంబై-పూణె ఎక్స్‌ప్రెస్ హైవేను ఇదే పద్ధతిలో తీసుకొని నిర్వహిస్తోందని ప్రస్తావించింది. జాతీయ రహదారుల సంస్థ 566 కిలోమీటర్ల పొడవున తొమ్మిది జాతీయ రహదారులను టీవో టీ ద్వారా కంపెనీలకు అప్పగించిందని, ఈ ఒప్పందాల ద్వారా ఆయా కంపెనీలు ఆర్జించే మొత్తం రూ.85 వేల కోట్లని ఎన్‌హెచ్‌ఏఐ అంచనా వేసిందని బీఆర్ఎస్ వర్గాలు ప్రస్తావించాయి. ఆ లెక్కన చూస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓఆర్ఆర్ మీద వస్తుందని చెబుతున్న లక్ష కోట్ల రూపాయల ఆర్జన 566 కిలోమీటర్ల జాతీయ రహదారుల మీద కూడా రావడం లేదని గుర్తు చేశాయి.

దివ్యాంగులకు స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలు

» 711 యూనిట్లకు రూ.3.50 కోట్ల నిధులు విడుదల

» ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తుకు అవకాశం

ఓల్డ్‌మలక్‌పేట జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగుల స్వయం ఉపాధి కోసం ప్రవేశ పెట్టిన సబ్సిడీ రుణాల నిధులు మంజూరయ్యాయి. దివ్యాంగులకు ఆర్థిక చేయూతనిచ్చి వారిని చిరువ్యాపారాల వైపు ప్రోత్సహించి ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ వందశాతం సబ్సిడీతో ఈ రుణాలను అందిస్తుంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోని 711 యూనిట్లకు రూ.3 కోట్ల 50 లక్షలు నిధులు ఇటీవల విడుదలయ్యాయి. ఎంపికైనా వారికి ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున వ్యక్తిగత రుణం అందిస్తారు. 21 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు ఉండి 40 శాతం పైగా వికలాంగత్వంతో వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2.5 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.1.5 లక్ష ఆదాయం ఉన్నవారే ఈ రుణాలకు అర్హులు. అర్హులైన వారు వచ్చేనెల 2వ తేదీ లోపు రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత మండల స్థాయిలో ఎంపీడీవోలు పరిశీలించి రుణాలకు 1:3 నిష్పత్తిలో దరఖాస్తులను ఎంపిక చేసి జిల్లా అధికారులకు జాబితా పంపుతారు. అదనపు(అడిషనల్) కలెక్టర్ ఆధ్వర్యంలో తుది జాబితా రూపొందుతుంది. ఆన్‌లైన్‌లో ఆ జాబితాను ప్రకటిస్తారు. అయితే ఈ రుణాల మంజూరులో ఉన్నత చదువులు చదువుకున్న వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తారు.

దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అన్ని విధాల సహాయసహకారాలు అందిస్తోంది. వారికి ఆర్థికంగా చేయూత ఇస్తూ వ్యాపారాలల్లో నిలదొక్కుకునే విధంగా ఈ స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలు ఉపయోగపడతాయి. ఈ రుణాలు పూర్తిగా వందశాతం సబ్సిడీతో అందిస్తున్నాం. అర్హులైన దివ్యాంగులు నిర్దేశించిన సమయంలోగా దరఖాస్తు చేసుకోవాలి.

'రైతుబంధు' రద్దుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ఎగ్గొట్టారని, ఇప్పుడు మళ్లీ జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు రైతుభరోసా వేస్తామంటున్నారని దుయ్యబట్టారు. రైతులకు మేలు చేయాలనే ఏకైక లక్ష్యంతో నాటి సీఎం కేసీఆర్ 2017 యాసంగి నుంచి ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందించారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఏక కాలంలో రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, రూ.49,500 కోట్ల నిధులు ఈ పథకానికి అవసరమని అంచనావేసి.. చివరకు రూ.12వేల కోట్లకు లోబడే రుణమాఫీ చేశారని అన్నారు. రుణమాఫీపై సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లి అయినా, సొంత నియోజకవర్గం కొడంగల్‌లో అయినా ఏదైనా ఒక ఊరు వెళ్లి అక్కడి రైతులు వందశాతం రుణమాఫీ అయిందంటే రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరితే, సీఎం నోరుమెదపడం లేదని ఎద్దేవా చేశారు. ధాన్యం బోనస్ విషయంలోనూ రైతుల్ని మోసం చేశారని, అన్నిరకాల ధాన్యానికి ఇస్తామని చెప్పి, చివరకు సన్నవడ్లకేనంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని దుయ్యబట్టారు. రైతులు రైతుభరోసా వద్దంటున్నారని, బోనస్ ఇస్తే చాలంటున్నారని వ్యవసాయమంత్రి ప్రకటనలు ఇస్తున్నారని విమర్శించారు. ప్రతీ రైతుకు ఈ ప్రభుత్వం ఎకరాకు రూ.17,500 బకాయి ఉందని, స్థానిక ఎన్నికల ఓట్లకు వచ్చినప్పుడు రైతులు ఈ నిధుల కోసం నిలదీయాలని సూచించారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో 410 మంది రైతులు, 55 మంది గురుకులాల విద్యార్థులు, వందమంది ఆటోడ్రైవర్లు, 35మంది చేనేత కార్మికులు చనిపోయారని వీటన్నింటికీ ఈ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అహంకారం, ఆకారాలు, పెరిగాయి తప్ప ఈ ఏడాదిలో నల్లగొండకు చేసిందేమీ లేదని కేటీఆర్ అన్నారు. ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ సీఎంగా ఉన్న హయాంలో తెలంగాణలో రైతును రాజుగా చేసి నిలబెట్టారని అన్నారు.

బాబూ.. మీ శిష్యుడికి చెప్పండి: కేటీఆర్

దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం రాష్ట్రం తెలంగాణ అని చంద్రబాబు గుర్తించడం సంతోషకరమని కేటీఆర్ అన్నారు. దశాబ్దకాలంగా ప్రభుత్వం అనుసరించిన ప్రగతిశీల విధానాలే దీనికి కారణమని ట్విటర్‌లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్న మీ మాజీ శిష్యుడి (రేవంత్‌రెడ్డి)కి బోధపడేలా చెప్పాలంటూ బాబుకు సూచించారు.

కోర్టు ధిక్కరణ కేసులో సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్‌కు షోకాజ్ నోటీసు

» ఆసిఫాబాద్ కలెక్టర్‌కు కూడా

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఓ కోర్టు ధిక్కరణ కేసులో సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్‌లకు హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీచేసింది. వ్యక్తిగతంగా లేదా లాయర్ ద్వారా ఫిబ్రవరి 14న హాజరై వివరణ సమర్పించాలని ఆదేశాలు జారీచేసింది. చట్టప్రకారం కొనుగోలు చేసిన భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వడంలేదని బీవీ నారాయణరావు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారించిన హైకోర్టు.. సాంకేతిక సమస్యలు పరిష్కరించి పిటిషనర్‌కు పాస్‌బుక్ జారీచేయాలని ఆదేశాలు జారీచేసింది. ఆ ఆదేశాలు అమలుకాకపోవడంతో మళ్లీ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ప్రతివాదులకు షోకాజ్ నోటీసులు జారీచేసింది.

భూముల విలువలకు రెక్కలు

(మొదటిపేజీ తరువాయి)

చదరపు అడుగు ఫ్లాట్ ధర రిజిస్ట్రేషన్ శాఖ పుస్తక విలువ ప్రకారం నగరాల్లో సగటున రూ.3200 ఉంది. దీన్ని 60 శాతం మించకుండా పెంచాలని సర్కారు భావిస్తోంది. అంటే చదరపు అడుగు ధర రూ.5120 వరకు కానుంది. ప్రాంతాలను బట్టి ఈ విలువలో మార్పులు ఉంటాయి. హైదరాబాద్ లాంటి చోట్ల కొండాపూర్, గచ్చిబౌలిలో రిజిస్ట్రేషన్ శాఖ విలువ ప్రకారం ప్రస్తుతం గజం ధర రూ.26700గా ఉంది. ఇదే వాణిజ్య స్థలమైతే గజం రూ.44900 ఉంది. నార్సింగ్‌లో గజం రూ.23800, మణికొండలో రూ.23900, రాయదుర్గంలో రూ.44900, బుద్వేల్‌లో రూ.10200గా ఉంది. ఇటీవల బుద్వేల్‌లో ఎకరా రూ.20 కోట్లు పలికింది. మహేశ్వరంలో గజం రూ.2100, వాణిజ్య స్థలం రూ.10,200 చొప్పున పుస్తక విలువలు ఉన్నాయి. అయితే మహేశ్వరం లాంటి చోట్ల రూ.2100 ఉన్న విలువను 300 నుంచి 400 శాతం పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇలా రూ.3 వేల కంటే తక్కువ ఉన్న ప్రాంతాల్లోని మార్కెట్ విలువలను హేతుబద్ధీకరించనున్నారు. పుస్తక విలువ భారీగా పెంచితే క్యాపిటల్ గెయిన్, ఇతర పన్నులతో నిర్మాణ రంగం కుదేలయ్యే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వం జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. ఇక వ్యవసాయ భూములు, స్థలాల విషయంలో ఇప్పుడున్న పుస్తక విలువను సవరించి 100 నుంచి 200 శాతంపైగా పెంచాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. గజం ధర రూ.1000 ఉంటే దాన్ని రూ.3 వేల వరకు పెంచాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఉదాహరణకు శేరిలింగంపల్లి రెండు రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో ఉంది. అక్కడ ప్రస్తుతం స్థలాల విలువ గజం ధర రూ.26,700గా ఉంది. దీన్ని రూ.50-60 వేల వరకు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. మోకిలాలో గజం రూ.2300 ఉంది. వాస్తవ విలువకు, రిజిస్ట్రేషన్ శాఖ విలువకు అసలు పొంతనే లేదు. ఇలాంటి ప్రాంతాల్లో ప్రస్తుత విలువను కనీసం 400 శాతం పెంచాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇటీవల ఇక్కడ హండా లేఅవుట్‌లో వేసిన వేలం పాటల్లో గజం ధర రూ.50 వేలు పలికింది. ఇలాంటి చోట్ల గజం ధర రూ.10 వేల వరకు పెంచాలని చూస్తున్నారు. 2023-24 లెక్కల ప్రకారం రిజిస్ట్రేషన్ శాఖకు వస్తున్న మొత్తం ఆదాయంలో ఫ్లాట్ల నుంచి వచ్చేది 35.1 శాతం(రూ.5,115 కోట్లు) కాగా, ప్లాట్ల నుంచి 22.8% (రూ.3322 కోట్లు)గా ఉంది. ఇక ఇళ్ల రిజిస్ట్రేషన్ల ద్వారా 19.5% (రూ.2838 కోట్లు), వ్యవసాయ భూములు 11.4% (రూ.1668 కోట్లు), నాన్-రిజిస్టర్ 11.3% (రూ.1645 కోట్లు)గా ఉంది. మొత్తం 14,588 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.15 వేల కోట్ల రాబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. దీనిపై 40 శాతం అదనంగా ఆదాయం సమకూర్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఉద్యోగులను వేధిస్తున్నారు

» గోదావరి బోర్డు మెంబర్ సెక్రటరీపై సీడబ్ల్యూసీకి తెలంగాణ ఈఎన్‌సీ లేఖ

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గోదావరినది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) వ్యవహారం రోడ్డుకెక్కింది. బోర్డు సభ్యకార్యదర్శి(మెంబర్ సెక్రటరీ) వ్యవహారశైలిపై ఉద్యోగులు నిరసనగళమెత్తారు. మహిళా ఉద్యోగులతో పాటు ఇతర ఉద్యోగుల పట్ల సభ్యకార్యదర్శి అజగేషన్ అనుచితంగా, అవమానకర రీతిలో వ్యవహరిస్తున్నారని, పని వాతావరణం ఏ మాత్రం అనుకూలంగా లేదని వీరంతా ఏపీ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావుతో పాటు తెలంగాణ ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తమను కాపాడాలని నివేదించుకోగా... ఈ వ్యవహారంపై ఆరా తీసిన అనిల్‌కుమార్.. తక్షణమే అజగేషన్‌ను బదిలీ చేయాలని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్‌కు లేఖ రాశారు. ఉద్యోగుల పట్ల అనుచితంగా, అవమానపరిచే విధంగా అజగేషన్ ప్రవర్తన ఉందని, గోదావరి బోర్డు సభ్యుడిగా ఈ విషయాన్ని నివేదిస్తున్నానని కోరారు. అజగేషన్ వైఖరి వృత్తిపరమైన ప్రమాణాలను దెబ్బతీస్తుందని అనిల్‌కుమార్ నివేదించారు. తక్షణమే అతడిని బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా నాగోబా మహాజాతర

ఇంద్రవెల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మెస్రం వంశీయుల అల్లుళ్ల కోనేరులోని నీటిని తోడి మట్టికుండల్లో నింపగా, ఆ కుండలను మహిళలు తలపై పెట్టుకొని వరుసగా నాగోబా ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయం పక్కనే ఉన్న పాత మట్టి పుట్టల వద్ద నుంచి అల్లుళ్ల మట్టిని తీసుకొని రాగా ఆడపడుచులు తెచ్చిన నీటితో మట్టిని కలిపి పుట్టలను తయారు చేశారు. తయారు చేసిన పుట్టల నుంచి మట్టిని ఉండల రూపంలో తీసుకుని ఏడు వరుసలతో బౌలదేవతను తయారు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా మహాజాతర మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆదివాసీల ఆరాధ్య దైవమైన నాగోబాకు పవిత్ర గోదావరి జలాలతో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు, పూజారీ (కటోడ) మెస్రం దేవ్‌రావు, మెస్రం కోసురావు పూజలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి వరకు బేటింగ్ (కొత్త కోడళ్ల పరిచయం), భక్తుల దర్శనం, ప్రత్యేక పూజలు కొనసాగాయి. కాగా, మంగళవారం ఆలయ ప్రాంగణం గేటు వద్ద పాము ప్రత్యక్షమైంది. పామును చూసేందుకు భక్తులు ఎగబడ్డారు.

అవమాన భారంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రియుడితో ఉండగా తండ్రి చూడటంతో మనస్తాపం

వరంగల్ క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ప్రియుడితో కలిసి ఉండగా తండ్రి కంటబడటం, ఆపై జరిగిన గొడవతో అవమానం భారం తాళలేక ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. హనుమకొండ జిల్లా కేయూ పోలీస్‌స్టేషన్ పరిధి గోపాల్‌పూర్‌లో మంగళవారం ఈ ఘటన జరిగింది. గోపాల్‌పూర్‌కు చెందిన ఓ బాలిక సుబేదారిలోని ఓ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఆ బాలిక తల్లిదండ్రులు ప్రైవేటు ఉద్యోగులు. ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న సమయంలో ఓ సీనియర్ విద్యార్థితో ఆమెకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పోచమ్మమైదాన్‌కు చెందిన సదరు యువకుడు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూ బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇటీవల స్వస్థలానికి వచ్చాడు. అయితే, బాలిక తల్లిదండ్రులు ఎప్పటిల్లానే మంగళవారం ఉదయం విధులకు వెళ్లిపోగా.. ఆ బాలిక కళాశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయింది. మధ్యాహ్న సమయంలో ఆమెను కలిసేందుకు ప్రియుడు ఇంటికి రాగా అదే సమయంలో బాలిక తండ్రి మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి వచ్చాడు. తండ్రి రాకతో బాలిక ఆ యువకుడిని ఇంటిలోని ఓ గదిలో దాచి పెట్టింది. భోజనం అనంతరం తండ్రి తిరిగి విధులకు వెళ్లిపోగా.. వారి పక్కింటిలో నివసించే బాలిక మేనమామ అనుమానంతో బాలిక తండ్రికి ఫోన్ చేసి వెనక్కి పిలిపించాడు. తండ్రి ఇంటి తలుపు కొట్టగా.. ఎవరో అనుకుని బాలిక తలుపులు తీయగా ఇంట్లోకి ప్రవేశించిన తండ్రికి ఆ యువకుడు కనిపించాడు. దీంతో ఆ యువకుడు పారిపోయేందుకు యత్నించగా బాలిక తండ్రి, మేనమామ పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ క్రమంలో అవమాన భారంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బాలిక ఆత్మహత్యకు యత్నించింది. అయితే, ఆ ఇంటి సమీపంలో నివసించే ఓ ఏఆర్ కానిస్టేబుల్ అక్కడికి చేరుకుని బాలికను కిందికి దించి సీపీఆర్ చేసి బతికించేందుకు యత్నించాడు. అనంతరం ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలోనే బాలిక మరణించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బాలిక మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అప్పటికే సదరు యువకుడు అక్కడి నుంచి తప్పించుకున్నాడని తెలుస్తుండగా.. అతడి గొంతుకు కత్తి గాట్లున్నాయని, బాలిక కుటుంబసభ్యులు అతడిని చంపేందుకు ప్రయత్నించారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ ఘటనపై రాత్రి 10:30గంటల వరకు తమకు ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.